ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం 05.11.2025 | సంపుటి : 12 సంచిక : 105 | పేజీలు : 12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370




హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

## మంత్రి అజారుద్దీన్‌కు మైనార్టీ సంక్షేమం, పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్

**శాఖలు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు**



హైదరాబాద్(జనంసాక్షి): ఇటీవల మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన అజారుద్దీన్‌కు తెలంగాణ ప్రభుత్వం శాఖలు కేటాయించింది. మైనార్టీల సంక్షేమం, పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ శాఖలను కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర మంత్రిగా అజారుద్దీన్ గత నెల 31న ప్రమాణ స్వీకారం చేశారు. రాజ్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ.. ఆయనతో ప్రమాణం చేయించారు.



## రేపటి నుంచి విచారణలకు సిద్ధం

**పార్టీ మారిన ఎమ్మెల్యేల వ్యవహారంలో మరోమారు షెడ్యూల్ ప్రకటించిన స్పీకర్**

హైదరాబాద్(జనంసాక్షి):తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారిన పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసు విచారణలో మరో అడుగు పడింది. రేపటి నుండి ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసు విచారణ జరుగనుంది. ఈనెల 6 నుంచి ఈ కేసును స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ విచారించనున్నారు.

మిగతా 2లో..

## పీజేఆర్‌కు మీరు చేసిన అవమానం
# చరిత్ర క్షమించదు

**సెంటిమెంట్ పేరుతో బీఆరెస్ ఓట్లు దండుకోవాలని చూస్తోంది**

- ఆనాడు పీజేఆర్ కుటుంబాన్ని రోడ్డుపై నిలబెట్టినందుకు రహమత్‌నగర్ చౌరస్తాలో కేటీఆర్ ముక్కు నేలకు రాసి క్షమాపణ చెప్పాలి
- మహిళలకు, మైనారిటీలకు సముచిత స్థానం కల్పించిన పార్టీ కాంగ్రెస్ ఒక్కటే
- పదేళ్లుగా పాలించిన వాళ్లు పేదలకు ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదు
- మేము ఒక్క జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోనే 14,197 కార్డులు ఇచ్చాం
- కాళేశ్వరం కేసు సీబీఐకి అప్పగిస్తే.. మూడు నెలలైనా కేసు పెట్టలేదు.
- బీఆరెస్, బీజేపీ రెండు ఒక్కటే.. జూబ్లీహిల్స్‌లో అభివృద్ధి కోసం నవీన్ యాదవ్‌ను గెలిపించండి
- రహమత్‌నగర్ డివిజన్ కార్నర్ మీటింగ్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



హైదరాబాద్(జనంసాక్షి):జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను గెలిపిస్తే 4వేల ఇందిరమ్మ ఇళ్లు కట్టిస్తాని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. నవీన్ యాదవ్‌కు మద్దతుగా జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని రహమత్ నగర్ డివిజన్‌లో సీఎం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎస్పీఆర్ హిల్స్ నుంచి హబీబ్ ఫాతిమానగర్ వరకు రోడ్‌షోలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో 30 వేల మెజారిటీతో గెలబోతున్నామన్నారు."మాగంటి గోపీనాథ్ చనిపోయారు.. ఆయన సతీమణిని గెలిపించాలని భారత రాష్ట్ర సమితి కోరుతోంది. గతంలో

మిగతా 2లో..

## హైదరాబాద్‌లో జర్మనీ జీసీసీ

- డ్యుయిష్ బోర్స్ విస్తరణలో భాగంగా గ్లోబల్ కెబులిటీ సెంటర్ ఏర్పాటు
- ముఖ్యమంత్రి రేవంత్‌తో జర్మనీ ప్రతినిధులు భేటీ
- నగరంలో అమెజాన్ కార్యకలాపాల విస్తరణ
- డేటాసెంటర్ ప్రాజెక్టు ఏర్పాటుపై సీఎంతో చర్చించిన సంస్థ ప్రతినిధులు
- విదేశీ పెట్టుబడుల విషయంలో పూర్తిగా సహకరిస్తామని సీఎం హామీ



హైదరాబాద్(జనంసాక్షి):తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల హైదరాబాద్‌లో జర్మనీ కాన్సుల్ జనరల్ మైకేల్ హాస్పర్ బృందంతో, అమెజాన్ వెబ్ సర్వీసెస్ ప్రతినిధి బృందంతో విడివిడిగా సమావేశమయ్యారు. రాష్ట్రంలో పెట్టుబడులు, టెక్నాలజీ, ఉపాధి అవకాశాల కల్పనపై ఈ భేటీల్లో చర్చలు

మిగతా 2లో..

## 12 రాష్ట్రాలు, యూటీల్లో ఎస్ఐఆర్ ప్రక్రియ



**2వ దశ ప్రారంభమైంది • ప్రకటించిన కేంద్ర ఎన్నికల సంఘం**

**జాబితాలో ఛత్తీస్‌గఢ్, గోవా, గుజరాత్, కేరళ, మధ్యప్రదేశ్, రాజస్థాన్, తమిళనాడు, ఉత్తర్‌ప్రదేశ్, పశ్చిమ బెంగాల్, అండమాన్ నికోబార్,లక్షద్వీప్, పుదుచ్చేరిలు ఉన్నాయని వెల్లడి**

న్యూఢిల్లీ(జనంసాక్షి): ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ఫేజ్-2.. తొమ్మిది రాష్ట్రాలు, మూడు కేంద్ర పాలిత ప్రాంతాల్లో ప్రారంభమైందని కేంద్ర ఎన్నికల సంఘం వెల్లడించింది. ఆయా రాష్ట్రాల్లో ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణీ మొదలు పెట్టినట్లు తెలిపింది. ఓటర్ల జాబితా ప్రక్షాళనను బిహార్‌లో విజయవంతంగా పూర్తి చేసినట్లు పేర్కొన్న ఈసీ.. తాజాగా రెండో దశను ప్రారంభించినట్లు తెలిపింది.ఎస్ఐఆర్ రెండో దశలో ఛత్తీస్‌గఢ్, గోవా, గుజరాత్, కేరళ, మధ్యప్రదేశ్, రాజస్థాన్, తమిళనాడు, యూపీ,పశ్చిమ బెంగాల్

మిగతా 2లో..



## 'ఎస్ఐఆర్'పై బెంగాల్‌లో మిన్నంటిన ఆందోళనలు

**ప్రక్రియకు వ్యతిరేకంగా పశ్చిమబెంగాల్‌లో రోడ్డెక్కిన సీఎం మమతా బెనర్జీ**

**కేంద్రం, ఈసీ కుమ్మక్కై నిర్వహిస్తోన్న నిశ్శబ్ద రిగ్గింగ్ అంటూ ఆరోపణ** 2లో

## ఫీజు రీయింబర్స్‌మెంట్ విధానంపై అధ్యయనానికి కమిటీ

**ప్రొఫెసర్లు కోదండరాం, కంచ ఐలయ్యకు చోటు**

**తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులు జారీ**

హైదరాబాద్(జనంసాక్షి):రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ విధానంలో మార్పులకు ప్రభుత్వం సంకల్పించింది. ఇందులో చాలా అవతకవకలతో పాటు, అక్రమాలు చోటు చేసుకుంటున్నాయన్న ఆరోపణల నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఫీజుల చెల్లింపుల్లో తీవ్ర జాప్యం చోటు చేసుకొంటున్న నేపథ్యంలో కాలేజీ యాజమాన్యాలు ఆందోళనకు దిగాయి. కాలేజీల బంద్ కొనసాగి స్తున్నాయి. ఈ క్రమంలో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు సంబంధించి సంస్కరణలపై కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వం మంగళవారం ప్రకటించింది. అందుకు సంబంధించిన ఉత్తర్వులను జారీ చేసింది. స్పెషల్ చీఫ్ సెక్రటరీతో పాటు 15 మందితో ఈ కమిటీని నియమించింది.

మిగతా 2లో..

## చేవెళ్ల ప్రమాదంపై డిసెంబర్ 15 లోపు నివేదిక సమర్పించండి




**ఘటనను సుమోటోగా తీసుకున్న రాష్ట్ర మానవ హక్కుల కమిషన్**

హైదరాబాద్(జనంసాక్షి):రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం మీర్జాగూడ గేటు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంపై రాష్ట్ర మానవహక్కుల కమిషన్ స్పందించింది. ఈ ఘటనను సుమోటోగా తీసుకున్న కమిషన్.. డిసెంబర్ 15 లోపు నివేదిక సమర్పించాలని ఆదేశించింది.

మిగతా 2లో..



## అన్నదాతపై అకాల పిడుగు

- ఉమ్మడి వరంగల్ జిల్లాలో మళ్లీ భారీ వర్షం
- ఎనమాముల ఎనుమాముల మార్కెట్‌లో పత్తి, మొక్కజొన్న నీటిపాలు
- హైదరాబాద్‌లో పలుచోట్ల కురిసిన వర్షం
- తెలంగాణలోని పలు జిల్లాలకు వర్ష సూచన

హైదరాబాద్/వరంగల్(జనంసాక్షి): వరంగల్: ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో మంగళవారం ఉదయం భారీ వర్షం పడింది. వరంగల్ నగరంలో ఒక్కసారిగా వాతావరణం మారింది. ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. సుమారు అరగంట పాటు కురిసిన కుండపోత వర్షానికి నగర రహదారులు జలమయమయ్యాయి. దీంతో పలు చోట్ల ట్రాఫిక్ నిలిచి వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. వర్షానికి ఎనుమాముల మార్కెట్‌లో పత్తి, మొక్కజొన్న తడిసిపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇటీవల 'మొంథా' తుపాను ముంపు నుంచి ఇంకా వరంగల్, హనుమకొండ, కాజీపేట ప్రాంతాలు పూర్తిగా తేరుకోలేదు. తాజా వర్షంతో మరోసారి కాలనీవాసుల్లో ముంపు భయం నెలకొంది. జనగామ జిల్లా వ్యాప్తంగా ఉదయం నుంచి వర్షం కురిసిందిస్టేషన్‌ఘన్‌పూర్, లింగాల ఘన్‌పూర్, తరిగొప్పుల, నర్మెట్ల, బచ్చన్నపేట మండలాల్లో వర్షం పడుతోంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఉరుములతో వర్షాలు దంచికొట్టాయి. మంగళవారం ఉదయం నుంచి కుండపోత వానలు కురిశాయి. వరంగల్ నగరంలో ఒక్కసారిగా వాతావరణం మారింది. ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. సుమారు అరగంట పాటు

మిగతా 2లో..

## ఛత్తీస్‌గఢ్‌లో రైలు ప్రమాదం

- ఎదురెదురుగా ఢీకొన్న ప్యాసింజర్, గూడ్స్
- ఏడుగురి మృతి.. పలువురికి గాయాలు



రాయపూర్(జనంసాక్షి):ఛత్తీస్‌గఢ్‌లో రైలు ప్రమాదం జరిగింది. బిలాస్‌పూర్‌లో ప్యాసింజర్, గూడ్స్ రైలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఏడుగురు మృతి చెందగా, పలువురు గాయపడ్డారు. అయితే, ప్రమాదానికి గల కారణం ఇంకా స్పష్టంగా తెలియరాలేదు. సిగ్నల్ వ్యవస్థ వైఫల్యం లేదా మానవ తప్పిదం వల్లే ప్రమాదం జరిగినట్లు అధికారులు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు.రైల్వే అధికారులు తెలిపిన వివరాలు ప్రకారం, ఈ ఘటన బిలాస్‌పూర్ సమీపంలోని లాల్‌ఖదాన్ ప్రాంతంలో

మిగతా 9లో..

## వైద్యుడి ఇంట్లో మాదకద్రవ్యాలు

- రూ.3 లక్షల విలువైన డ్రగ్స్ పట్టివేత
- గచ్చిబౌలిలో డ్రగ్స్ పార్టీ భగ్నం
- ఎస్‌వోటీ పోలీసుల దాడులు
- భారీగా మాదకద్రవ్యాలు స్వాధీనం
- నైజీరియన్ల నుంచి తేజ కృష్ణ డ్రగ్స్ కొనుగోలు

హైదరాబాద్(జనంసాక్షి): నగరంలోని ఓ వైద్యుడి ఇంట్లో పోలీసులు డ్రగ్స్ పట్టుకున్నారు. ముషీరాబాద్‌లో అద్దెకు ఉంటున్న జాన్‌పాల్ అనే వైద్యుడి ఇంట్లో డ్రగ్స్ విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో అతడి నివాసంలో తనిఖీలు చేపట్టి.. రూ. 3 లక్షల విలువ చేసే డ్రగ్స్‌ను ఎక్సైజ్ ఎస్టీఎఫ్ పోలీసులు



పట్టుకున్నారు. జాన్‌పాల్‌ను అరెస్టు చేసి ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న మరో ముగ్గురిపై కేసు నమోదు చేశారు. హైదరాబాద్‌కు చెందిన ప్రమోద్, సందీప్, శరత్.. ఢిల్లీ, బెంగళూరు నుంచి డ్రగ్స్ తెప్పించి వైద్యుడు జాన్‌పాల్ ఇంట్లో ఉంచి విక్రయిస్తున్నారు. డ్రగ్స్ విక్రయించినందుకు గాను వైద్యుడికి వీటిని ఉచితంగా ఇస్తున్నారు. అతడి ఇంట్లో ఓజీకుష్, ఎండీఎంఏ, కొకైన్, హాష్‌ఆయిల్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పరారీలో నిందితులను త్వరలోనే పట్టుకుంటామని పోలీసులు తెలిపారు.

మిగతా 2లో..



## బీహార్‌లో ఉపాధి అవకాశాలు నాశనం చేశారు

- వలస కూలీలుగా మార్చారు
- సమస్యల నుంచి మోదీ దృష్టిమళ్లిస్తున్నారు
- యువత సోషల్ మీడియా రీల్స్‌లో బిజీగా ఉండాలని ప్రధాని కోరుకుంటున్నారు
- ఔరంగాబాద్ ప్రచార సభలో రాహుల్

ఔరంగాబాద్(జనంసాక్షి):సమస్యల నుంచి దృష్టి మళ్లించేలా.. యువత సోషల్ మీడియా రీల్స్‌లో బిజీగా ఉండాలని ప్రధాని మోదీ కోరుకుంటున్నట్లు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో బిహార్‌లోని ఔరంగాబాద్‌లో నిర్వహించిన ప్రచార సభలో ఈమేరకు ప్రసంగించారు. సీఎం నీతీశ్ కుమార్ యువతను కార్మికులుగా మారుస్తున్నారని, అన్ని ఉపాధి అవకాశాలను నాశనం చేస్తున్నారని మండిపడ్డారు."సామాజిక మాధ్యమాలు, రీల్స్ చేయడం వంటివాటికి యువత బానిస కావాలని ప్రధాని మోదీ కోరుకుంటున్నారు.

మిగతా 2లో..

## అధికారంలోకి వస్తే మహిళలకు ఏటా రూ.30వేలు

**సంక్రాంతి కానుకగా వారి ఖాతాల్లో జమచేస్తాం**

**మద్దతు ధరలకు అదనంగా రూ.300 నుంచి రూ.400 చెల్లింపులు**

**సొంతూరికి 70 కి.మీ. దూరంలోనే ఉద్యోగుల బదిలీలు**

**తేజస్వీ యాదవ్ వరాల జల్లు**

పట్నా(జనంసాక్షి): బిహార్ ఎన్నికల్లో మహిళా ఓటర్లను ఆకట్టుకునేందుకు ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ కీలక హామీ ప్రకటించారు. ఇండియా కూటమి బిహార్‌లో ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసిన వెంటనే 'మై-బహిన్ మాన్ యోజన'ను ప్రారంభిస్తామన్నారు. ఇందులోభాగంగా జనవరి 14న సంక్రాంతి రోజున రాష్ట్రంలోని మహిళలకు ఏడాదికి రూ. 30వేలు కానుకగా అందచేస్తామని వెల్లడించారు. ఎన్నికలు సమీపిస్తోన్న

మిగతా 2లో..

### బీహార్‌లో జంగిల్‌రాజ్ తిరిగి రావద్దంటే ఎన్డీఏకు పట్టంకట్టండి:అమిత్ షా

2లో

### బీహార్‌లో ముగిసిన మొదటి దశ ఎన్నికల ప్రచారం

## అమెరికా బాటలో కెనడా

- భారీగా భారతీయ విద్యార్థి వీసాల తిరస్కరణ
- అక్కడి స్థానిక పరిస్థితులే కారణమని ఇమిగ్రేషన్ నిపుణుల అంచనా

2లో

## ఇజ్రాయెల్‌కు మద్దతిచ్చినంతకాలం అమెరికాకు మా సహకారం ఉండదు

**ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ**

## అమెరికా హెచ్-1బీ వీసాల జారీ పునరుద్ధరణ




**ప్రకటించిన అమెరికా కార్మిక శాఖ**

వాషింగ్టన్(జనంసాక్షి):అమెరికాలో షట్‌డౌన్ ఇంకా కొనసాగుతుంది. దీని నేపథ్యంలో ఇటీవల హెచ్1బీ వీసాల ప్రాసెసింగ్ నిలిచిపోయిన సంగతి తెలిసిందే. తాజాగా దాన్ని పునరుద్ధరించారు. అమెరికా కార్మిక శాఖ ఈ విషయాన్ని ప్రకటించింది. అమెరికా కాంగ్రెస్ నిధులు విడుదల చేయకపోవడం వల్ల సెప్టెంబర్ 30 నుంచి ఫెడరల్ ప్రభుత్వ సేవలు నిలిచిపోయాయి. దీని కారణంగా లేబర్ కండీషన్ అప్లికేషన్ ప్రోగ్రామ్ ఎలక్ట్రానిక్ రివ్యూ మేనేజ్‌మెంట్ దరఖాస్తులు ఆగిపోయాయి. తాజాగా తాత్కాలిక, శాశ్వత ఉపాధి కార్యక్రమాల కోసం వీసా దరఖాస్తుల ప్రాసెస్‌ను విదేశీ కార్మిక ధ్రువీకరణ కార్యాలయం తిరిగి ప్రారంభించిందని కార్మిక శాఖ తెలిపింది. అమెరికన్ కంపెనీలు దరఖాస్తులు ప్రారంభించవచ్చని వెల్లడించింది. గ్రీన్ కార్డుకు సంబంధించి ప్రాసెస్‌లు ప్రారంభించినట్లు వివరించింది. అమెరికా కార్మికశాఖ తాజా ప్రకటన ప్రభావం భారతీయ పౌరులపైనా పడనుంది. హెచ్-1బీ వీసా పొందేవాళ్లలో

మిగతా 9లో..

## రహదారులపై ఆగని ఆర్తనాదాలు




- ట్రాక్టర్‌ను ఢీకొన్న ట్రావెల్ బస్సు... నలుగురికి గాయాలు
- వికారాబాద్ జిల్లాలో మరో ఆర్టీసీ బస్సుకు ప్రమాదం
- డ్రైవర్, కండక్టర్, ఓ ప్రయాణికుడికి గాయాలు
- వడ్లలోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్‌ను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు
- పది మందికి గాయాలు... కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్‌లో చోటు చేసుకున్న ఘటన

2లో..

## యూపీలో ఘోర రోడ్డు ప్రమాదం

**కారును ఢీకొన్న ట్రక్కు..ఆరుగురు దుర్మరణం**

2లో..



# డ్రైవర్లకు, వాహనదారులకు వచ్చే నెల నుంచి అవగాహన కార్యక్రమాలు

**చేవెళ్ల ప్రమాద స్థలాన్ని సందర్శించిన డీజీపీ బి.శివధర్ రెడ్డి**

**హైదరాబాద్(జనంసాక్షి):**రంగారెడ్డి జిల్లాలోని చేవెళ్లలో జరిగిన రోడ్డు ప్రమాద స్థలాన్ని డీజీపీ బి. శివధర్ రెడ్డి పోలీసు అధికారులతో కలిసి మంగళవారం సందర్శించారు. సంఘటన జరిగిన రోజున డిజిపి హైదరాబాదులో అందుబాటులో లేనందున ఆ ప్రాంతానికి వెళ్లలేకపోవడంతో హైదరాబాదుకు చేరుకున్న వెంటనే ప్రమాద సంఘటన స్థలానికి వెళ్లి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ప్రమాదంలో క్షతగాత్రులైన వారిని స్థానిక ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. సంఘటన స్థలంలో సహాయక చర్యలు చేపట్టిన నేపథ్యంలో గాయపడిన చేవెళ్ల సీఐ భూపాల శ్రీధర్ ను పరామర్శించారు ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ వాహనదారులు జాగ్రత్తగా డిఫెన్సివ్ డ్రైవింగ్ పద్ధతులను పాటించాలన్నారు. డ్రైవర్లకు, వాహనదారులకు రోడ్డు భద్రతపై "అరైవ్, అలైవ్" పేరుతో వచ్చే నెలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నామని తెలిపారు. స్వచ్ఛంద సంస్థలు, కార్పొరేట్ సంస్థలు, వివిధ వర్గాలకు చెందిన పౌరులు, కళాశాలల విద్యార్థులు, విద్యావంతులతో కలిసి పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నామని తెలియజేశారు. శాంతి భద్రతల అడిషనల్ డిజిపి మహేష్ ఎం భగవత్, సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి డిజిపి వెంట ఉన్నారు.

## రహదారులపై ఆగని ఆర్తనాదాలు

**నల్లగొండ,తాండూర్,కరీంనగర్(జనంసాక్షి):**చేవెళ్లలో ఘోర బస్సు ప్రమాద ఘటన మరవక ముందే మరో యాక్సిడెంట్ జరిగింది. నల్లగొండ జిల్లా వేములపల్లి మండలం బుగ్గబావిగూడెం వద్ద అద్దంకి-నార్కట్‌పల్లి హైవేపై వేగంగా వచ్చిన ప్రైవేట్ ట్రావెల్ బస్సు అదుపుతప్పి ముందువెళ్తున్న ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీ కొట్టింది. దీంతో ట్రాక్టర్ రోడ్డుపై బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్‌లో ప్రయాణిస్తున్న నలుగురు కూలీలు గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. చేవెళ్ల ఘటనను మరువక ముందే.. వికారాబాద్ జిల్లా తాండూర్ వద్ద మరో ఆర్టీసీ బస్సు ప్రమాదానికి గురైంది. కర్ణాటకలోని కలబురగి నుంచి తాండూరు వైపు వస్తున్న కర్ణాటక ఆర్టీసీ బస్సు.. ఎదురుగా వస్తున్న సిమెంట్ లారీని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఓ ప్రయాణికుడి తలకు గాయమైంది. డ్రైవర్, కండక్టర్‌కు స్వల్పగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు.. అక్కడి చేరుకొని వాహనాలను పక్కకు తొలగించి ట్రాఫిక్ క్లియర్ చేశారు.

**వడ్ల లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్‌ను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు**

కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం రేణికుంట బ్రిడ్జ్ వద్ద రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. వడ్ల లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొంది. మెట్‌పల్లి డిపో బస్సు హైదరాబాద్ నుంచి కరీంనగర్ వెళ్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. బస్సులో ఉన్న పది మందికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆరా తీశారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు.

## యూపీలో ఘోర రోడ్డు ప్రమాదం

**లక్నో(జనంసాక్షి):** ఉత్తరప్రదేశ్‌లో మంగళవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. బారాబంకిలోని దేవా- ఫతేపూర్ రహదారిపై ట్రక్కు కారును బలంగా ఢకొట్టింది. ఈ ప్రమాదంలో ఆరుగురు మృతి చెందారు. ఇద్దరికి గాయాలయ్యాయని పోలీసులు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి బారాబంకి సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ అర్పిత్ విజయవర్గియ తెలిపిన వివరాల ప్రకారం.. ఎనిమిది మందితో వెళుతున్న కారును దేవా పోలీస్ స్టేషన్ ప్రాంతంలో ట్రక్కు బలంగా ఢకొట్టింది. దీంతో ఎనిమిది మందికి తీవ్ర గాయాలయ్యాయి. వారిలో ఆరుగురు మృతి చెందారు..

**చేవెళ్ల ప్రమాదంపై డిసెంబర్ 15 లోపు నివేదిక సమర్పించండి**

ఈ మేరకు రవాణా శాఖ, హెూంశాఖ, భూగర్భ గనుల శాఖల ముఖ్య కార్యదర్శులకు నోటీసులు ఇచ్చింది. జాతీయరహదారుల ప్రాంతీయ అధికారి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్, ఆర్టీసీ ఎండీలను నివేదిక పంపాలని ఆదేశించింది. సోమవారం ఉదయం మీర్జాగూడ గేటు వద్ద ఆర్టీసీ బస్సును టిప్పర్ ఢీ కొన్న ఘటనలో 19 మంది ప్రాణాలు కోల్పోగా 24 మందికి గాయాలైన సంగతి తెలిసిందే.

## అధికారంలోకి వస్తే మహిళలకు ఏటా రూ.30వేలు



తరుణంలో బిహార్ ప్రభుత్వం ఇటీవల అక్కడి మహిళలకు నవరాత్రి కానుకగా ఒక్కొక్కరికీ రూ.10వేలు చొప్పున 75 లక్షల మంది మహిళల ఖాతాల్లో డబ్బు జమ చేసిన నేపథ్యంలో తేజస్వీ ఈ ప్రకటన చేశారు. గత వారం ప్రతిపక్షాలు విడుదల చేసిన మ్యానిఫెస్టో ప్రకారం.. డిసెంబర్ 1 నుంచి మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సహాయంగా రాబోయే ఐదేళు ఒక్కో సంవత్సరానికి మొత్తం రూ.30,000 ఇస్తామని తేజస్వీ హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఇందులోభాగంగానే అధికారంలోకి వచ్చిన వెంటనే మొదటి ఏడాదికి గాను మహిళలకు రూ.30వేలు ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. బిహార్ మహిళల కోరిక మేరకు ఏడాదికి చెల్లించే మొత్తం రూ.30 వేలను జనవరి 14న వారి ఖాతాలకు బదిలీ చేస్తామని తేజస్వీ తెలిపారు. కనీస మద్దతు ధరతో పాటు బోనస్‌గా రైతులకు క్వింటాలు వరికి రూ.300, గోధుమలకు రూ.400 చెల్లిస్తామన్నారు.రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల కోసం పాత పెన్షన్ పథకాన్ని పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారు.

**బీహార్‌లో ఉపాధి అవకాశాలు నాశనం చేశారు**

ఇది 21వ శతాబ్దపు కొత్త మత్తు. యువతను పరధ్యానంలో ఉంచేసి.. విద్య, ఆరోగ్యం, ఉపాధి తదితర రంగాల్లో సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించకుండా ఉండేలా ఇలా చేస్తున్నారు" అని రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. ఈ ఎన్నికల్లో ఎన్డీయే గెలవదని ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి అమిత్ షాకు తెలుసని, అందుకే ఓట్ల చోరీకి పాల్పడుతున్నారని ఆరోపించారు. నీతీశ్ కుమార్ ఢిల్లీ పెద్దల ఆదేశాల ప్రకారం పనిచేస్తున్నారని విమర్శించారు.

## బీహార్‌లో జంగిల్‌రాజ్ తిరిగి రావద్దంటే ఎన్డీఏకు పట్టంకట్టండి

**పట్నా(జనంసాక్షి):**బిహార్‌లో జంగిల్‌రాజ్ తిరిగి రావద్దంటే ఎన్డీఏ కూటమిని గెలిపిం చాలని అమిత్ షా బిహార్ ఓటర్లను కోరారు. దర్భాంగాలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న అమిత్‌షా మాట్లాడుతూ.. ఇటీవల బిహార్ ప్రభుత్వం మహిళల ఖాతాల్లో జమ చేసిన రూ.10వేలను ఉపసంహరించుకోవాలని ఆర్జేడీ నేతలు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయడాన్ని తప్పుబట్టారు. ఆ సొమ్మును ఆర్జేడీ నేతలు దోచుకోవాలని చూస్తున్నారంటూ ధ్వజమెత్తారు. లాలూ తాతలు దిగొచ్చినా.. ఆ సొమ్మును దోచుకోలేరన్నారు.ప్రధాని మోదీ నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం బిహార్‌ను సమగ్ర అభివృద్ధి వైపు నడిపిస్తుందన్నారు. బిహార్‌లో ఎన్డీఏ తిరిగి అధికారంలోకి వస్తే 'మిథిలాంచల్'కు సాగునీరు అందించడానికి, ఆ ప్రాంతంలో వరదలను అరికట్టడానికి, కోషి నది నీటిని ఉపయోగించుకోవడానికి మొత్తం రూ.26,000 కోట్ల బడ్జెట్ కేటాయిస్తామన్నారు.



# పీజేఆర్‌కు మీరు చేసిన అవమానం చరిత్ర క్షమించదు

పి.జనార్దన్‌రెడ్డి చనిపోతే ఉప ఎన్నికల్లో కేసీఆర్ అభ్యర్థిని పెట్టారు. సిట్టింగ్ ఎమ్మెల్యే చనిపోతే వచ్చే ప్రతి ఉప ఎన్నికలో కేసీఆర్ అభ్యర్థిని పెట్టారు. కేటీఆర్‌కు ఇన్ని వేల కోట్ల రూపాయలు ఎక్కడి నుంచి వచ్చాయి. ఇంటి నుంచి గెంటేశారని కవిత రాష్ట్రం మొత్తం తిరుగుతూ గోడు చెప్పకొంటున్నారు. సొంత చెల్లికే న్యాయం చేయలేని కేటీఆర్.. మీకు న్యాయం చేస్తారా? భారత రాష్ట్ర సమితి హయాంలో ఒక్కరికైనా రేషన్ కార్డు ఇచ్చారా? రెండేళ్ల పాలనలో జూబ్లీహిల్స్‌లో 14,159 రేషన్ కార్డులు ఇచ్చాం. భారత రాష్ట్ర సమితి గెలిస్తే మీకు వచ్చే పథకాలు అన్నీ ఆగిపోతాయి.కాళేశ్వరం కేసును సీబీఐకి ఇస్తే 48 గంటల్లో కేసీఆర్, కేటీఆర్‌ను జైలుకు పంపిస్తామన్నారు. సీబీఐకి అప్పగిస్తే 3 నెలలైనా కేసు పెట్టలేదు. ఈనెల 11 లోపు కాళేశ్వరం కేసులో సీబీఐ ఎఫ్ఐఆర్ నమోదు చేయాలి. భాజపా, భారత రాష్ట్రసమితిది ఫెవికాల్ బంధం కాకపోతే సీబీఐ ఎఫ్ఐఆర్ నమోదు చేయాలి. ఎఫ్ఐఆర్ నమోదు చేసి కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావును అరెస్టు చేయాలి. వీళ్ల అరెస్టులో భాజపా చీకటి ఒప్పందం ఏంటి? ఫార్ములా ఈ-రేస్ కేసులో కేటీఆర్ అరెస్టుకు గవర్నర్ అనుమతి కోరితే స్పందన లేదు. కేంద్ర హెూంమంత్రిగా అమిత్ షానే ఉన్నారుగా ఎందుకు చర్యలు తీసుకోవట్లేదు. కిషన్‌రెడ్డి కేంద్రమంత్రిగా ఉన్నారు కానీ, కేసీఆర్, కేటీఆర్‌పై మాత్రం చర్యలు లేవు. కారు ఢిల్లీకి చేరగానే కమలంగా మారుతోది" అని రేవంత్‌రెడ్డి విమర్శించారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ విధానంపై అధ్యయనానికి కమిటీ

ఇక కాలేజీల నుంచి ఈ కమిటీలో ముగ్గురికి చోటు కల్పిస్తున్నట్లు జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొంది. అలాగే ఈ కమిటీలో ప్రొఫెసర్లు కంచ ఐలయ్య, కోదండరాంలకు చోటు కల్పించినట్లు స్పష్టం చేసింది. ఈ కమిటీ.. ఫీజు రీయింబర్స్‌మెంట్ పాలసీపై ప్రభుత్వానికి సూచనలు ఇవ్వనుంది. అలాగే ప్రత్యేక ట్రస్ట్ ద్వారా ఫీజు రీయింబర్స్‌మెంట్ సాధ్యాసాధ్యాలను ఈ కమిటీ పరిశీలిస్తుంది. మూడు నెలల్లో ఈ కమిటీ నివేదిక అందజేయాలని ప్రభుత్వం జారీ చేసిన జీవోలో స్పష్టంగా సూచించింది. అలాగే విద్యా సంస్థలు స్పష్టం చేసిన సూచనలపై సైతం అధ్యయనం చేయాలని ఈ సందర్భంగా కమిటీకి రాష్ట్ర ప్రభుత్వం సూచించింది. ఫీజు రీయింబర్స్‌మెంట్ విషయంలో ప్రైవేట్ కాలేజీల యాజమాన్యం, ప్రభుత్వానికి మధ్య దూరం బాగా పెరుగుతోంది. సమయానికి ప్రభుత్వం ఈ ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకపోవడంతో.. కాలేజీ యాజమాన్యం తమ కళాశాలల బంద్‌కు పిలుపునిస్తుంది. ఆ క్రమంలో కాలేజీ యాజమాన్యంతో ప్రభుత్వం చర్చలు జరుపుతోంది. దీంతో వాయిదాల రూపంలో నగదు చెల్లిస్తామంటూ కాలేజీల యాజమాన్యానికి ప్రభుత్వం తెలుపుతోంది.

## రేపటి నుంచి విచారణలకు సిద్ధం



పార్టీ మారిన ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై విచారణకు అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ షెడ్యూల్ ఇచ్చారు. గత ఎన్నికల్లో బీఆర్ఎస్ గుర్తుపై గెలిచిన పదిమంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో చేరిన విషయం తెలిసిందే. దీంతో పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించాలంటూ బీఆర్ఎస్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీంతో మూడు నెలల్లోగా విచారించి నిర్ణయం వెల్లడించాలని సీజేఐ నేతృత్వంలోని ధర్మాసనం జూలై 31న తీర్పునిచ్చింది. ఈ నేపథ్యంలో నలుగురు ఎమ్మెల్యే విచారణను పూర్తిచేసిన స్పీకర్.. తాజాగా ఈ నెల 6 నుంచి మరో నలుగురు ఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాస్ రెడ్డి, అరికెపూడి గాంధీ, తెల్లం వెంకట్రావు, డాక్టర్ సంజయ్ అనర్హతపై విచారణ చేపట్టనున్నారు. నవంబర్ 6న తెల్లం వెంకట్రావ్, సంజయ్ పిటిషన్లను విచారిస్తారు. ఈ నెల 7న పోచారం శ్రీనివాస్ రెడ్డి, అరికెపూడి గాంధీని విచారించనున్నారు. 12న తెల్లం వెంకట్రావ్, సంజయ్ పిటిషన్లపై రెండోసారి విచారణ కొనసాగనుంది.. 13న పోచారం, అరికెపూడి గాంధీల పిటిషన్లపై మరోసారి విచారణ నిర్వహిస్తారు. కాగా.. సుప్రీంకోర్టు ఇచ్చిన గడువు గత నెల 31న ముగిసిన విషయం తెలిసిందే. దీంతో నాలుగు రోజుల క్రితం ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై విచారణకు మరో రెండు నెలల గడువు ఇవ్వాలని శాసనసభ స్పీకర్ కార్యాలయం సుప్రీంకోర్టును కోరింది. నలుగురు ఎమ్మెల్యేల విచారణ మాత్రమే పూర్తయిందని.. అంతర్జాతీయ సదస్సులు ఉండటంతో గడువు సరిపోలేదని దేశ అత్యున్నత న్యాయస్థానానికి తెలిపింది. 6వ తేదీన భద్రాచలం నియోజకవర్గ ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్, జగిత్యాల నియోజకవర్గ ఎమ్మెల్యే సంజయ్ కుమార్ లను విచారించనున్నారు. 13న కామారెడ్డి ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి, ఖైరతాబాద్ ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ కేసు విచారించనున్నారు. ఇప్పటికే నలుగురు ఎమ్మెల్యేలను స్పీకర్ విచారించిన విషయం తెలిసిందే.అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ నుంచి గెలిచిన 10 మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో చేరిన విషయం తెలిసిందే. ఈ మేరకు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ నేతలు స్పీకర్‌కు ఫిర్యాదు చేశారు. స్పీకర్ నుంచి సరైన స్పందన రాకపోవడంతో హైకోర్టును ఆశ్రయించారు. అత్యున్నత న్యాయస్థానం నుంచి బీఆర్ఎస్‌కు సానుకూల తీర్పు రాకపోవడంతో సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. ఈ మేరకు విచారణ చేపట్టిన సర్వోన్నత న్యాయస్థానం.. ఈ వ్యవహారంపై మూడు నెలల్లోగా స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని జూలై 31న ఆదేశాలు జారీ చేసింది. కాగా, ఆ గడువు అక్టోబర్ 31తో ముగిసింది. దీంతో పార్టీ మారిన ఎమ్మెల్యేలను స్పీకర్ విచారించనున్నారు.

# హైదరాబాద్‌లో జర్మనీ జీసీసీ

జరిగాయి.జర్మనీ కాన్సుల్ జనరల్ మైకేల్ హాస్పర్ నేతృత్వంలోని బృందం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి తమ సంస్థ డ్యుయిష్ బోర్స్ విస్తరణలో భాగంగా హైదరాబాద్‌లో తమ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ ను ప్రారంభిస్తున్నట్లు తెలియజేసింది. ఈ జీసీసీ ఏర్పాటు ద్వారా రాబోయే రెండేళ్లలో ఐటీ రంగంలో వెయ్యి మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని జర్మనీ బృందం సీఎంకు వివరించింది.జీసీసీ ఏర్పాటుకు హైదరాబాద్‌ను ఎంచుకున్నందుకు సీఎం రేవంత్ రెడ్డి జర్మనీ బృందానికి ధన్యవాదాలు తెలిపారు. హైదరాబాద్‌లో మరిన్ని పెట్టుబడులు పెట్టాలని కోరిన సీఎం, ఇందుకు ప్రభుత్వం పూర్తి మద్దతుగా నిలుస్తుందని హామీ ఇచ్చారు. పెట్టుబడుల విషయంలో తెలంగాణ జర్మనీ భాగస్వామ్యాన్ని కోరుకుంటోందని సీఎం స్పష్టం చేశారు. ఐటీ, ఫార్మా, ఆటోమొబైల్ రంగాల్లో పెట్టుబడులు పెట్టాలని కోరారు.హైదరాబాద్‌ను ఇన్నోవేషన్ హబ్‌గా తయారు చేయడానికి సహకరించాలని సీఎం అన్నారు. స్థానిక విద్యార్థులకు జర్మన్ భాషను నేర్పించేందుకు జర్మనీ టీచర్లను నియమించి టామ్‌కామ్ వొకేషనల్ ఎడ్యుకేషన్, శిక్షణ అందించేందుకు సహకరించాలని కాన్సుల్ జనరల్‌ను కోరారు.

**అమెజాన్ వెబ్ సర్వీసెస్‌తో సీఎం భేటీ..**

సీఎం రేవంత్ రెడ్డిని అమెజాన్ వెబ్ సర్వీసెస్ ప్రతినిధి బృందం మర్యాదపూర్వకంగా కలిసింది. తెలంగాణలో ఏడబ్ల్యూఎస్‌కు సంబంధించి ఏర్పాటు చేయబోయే డేటా సెంటర్ ప్రాజెక్టులు, వాటి విస్తరణ వంటి అంశాలపై సీఎంతో చర్చించింది. పెట్టుబడుల విషయంలో ప్రభుత్వం నుంచి అన్ని రకాల సహాయ సహకారాలు ఉంటాయని సీఎం స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఏడబ్ల్యూఎస్ డేటా సెంటర్ గ్లోబల్ హెడ్ కెర్రీ పర్సన్, ఇన్‌ఫ్రా పబ్లిక్ పాలసీ డైరెక్టర్ విక్రమ్ శ్రీధరన్, అనురాగ్ కిల్నాని తదితరులు పాల్గొన్నారు ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ పెట్టుబడుల విషయంలో ప్రభుత్వ సహాయ సహకారాలు ఉంటాయని పునరుద్ఘాటించారు. హైదరాబాద్‌ను ఇన్నోవేషన్ హబ్‌గా తయారు చేసేందుకు సహకరించాలని సీఎం కోరారు.



## అమెరికా బాటలో కెనడా

**ఒట్టావా(జనంసాక్షి):**కెనడాలో భారతీయ విద్యార్థి వీసాలు భారీగా తిరస్కరణకు గురయ్యాయి. ఉన్నతవిద్య చదివేందుకు దరఖాస్తు చేసుకున్న ప్రతి నలుగురిలో ముగ్గురు విద్యార్థి వీసాలను కెనడా అధికారులు తిరస్కరించారు.కెనడా ఇమిగ్రేషన్ డిపార్ట్‌మెంట్ గణాంకాల ప్రకారం.. 2025 ఆగస్టులో భారతీయ విద్యార్థులు చేసుకున్న దరఖాస్తుల్లో 74 శాతం తిరస్కరణకు గురయ్యాయి. 2023లో ఆ మొత్తం 32 శాతంగా ఉంది. ఇదే సమయంలో చైనా విద్యార్థి వీసాల తిరస్కరణ రేటు 24 శాతంగా ఉండగా.. మిగతా దేశాల సగటు రేటు 40 శాతం మాత్రమే ఉండటం గమనార్హం. అంతర్జాతీయ విద్యార్థి వీసా కార్యక్రమాన్ని కఠినతరం చేసేందుకు కెనడా ప్రయత్నాలు కొనసాగిస్తోన్న తరుణంలో ఈ భారీ తిరస్కరణలు పెరిగాయి. మరోవైపు భారత్ నుంచి దరఖాస్తు చేసుకుంటున్న విద్యార్థుల సంఖ్య కూడా తగ్గిపోతోంది. విదేశీ విద్యకు అమెరికా తర్వాతి స్థానంలో ఉన్న కెనడా.. గతేడాది దాదాపు 10లక్షల మంది విదేశీ విద్యార్థులకు అవకాశం కల్పించింది. వీరిలో 41శాతం భారత్ నుంచే ఉండగా.. ఆ తర్వాతి స్థానాల్లో చైనా, వియత్నాం దేశాలు ఉన్నట్లు నివేదికలు వెల్లడిస్తున్నాయి. ఇక భారీ స్థాయిలో విద్యార్థి వీసాల దరఖాస్తులను కెనడా తిరస్కరించడానికి అక్కడి స్థానిక పరిస్థితులే కారణమని ఇమిగ్రేషన్ నిపుణులు అంచనా వేస్తున్నారు. నివాస కొరత, మౌలిక సదుపాయాల కల్పన ఇబ్బందిగా మారడం, స్థానిక ఖర్చులు విద్యార్థులు భరించగలరా? అన్న విషయాలపై ఆందోళనల నేపథ్యంలోనే కెనడా ఈ చర్యలు తీసుకుంటున్నట్లు చెబుతున్నారు. మరోవైపు అమెరికా, కెనడాలకు ప్రత్యామ్నాయం చూస్తున్న భారతీయ విద్యార్థులు జర్మనీ వైపు మొగ్గ చూపుతున్నట్లు మరో నివేదిక వెల్లడించింది.

## వైద్యుడి ఇంట్లో మాదకద్రవ్యాలు

నగరంలోని గచ్చిబౌలి టీఎన్జీవో కాలనీలో ఎస్ఎం లగ్జరి గెస్ట్ రూమ్, కో లివింగ్ గెస్ట్ రూమ్‌లో జరుగుతున్న డ్రగ్స్ పార్టీని ఎస్ఓటీ పోలీసులు భగ్నం చేశారు. భారీగా డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. దీనిపై మాదాపూర్ అదనపు డీసీపీ ఉదయ్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ బెంగళూరులో ఉంటున్న ఇద్దరు నైజీరియన్ల నుంచి తేజ కృష్ణ డ్రగ్స్ కొనుగోలు చేశారని వెల్లడించారు. ప్రస్తుతం ఇద్దరు నైజీరియన్లు పరారీలో ఉన్నారని... వారిని త్వరలో అదుపులోకి తీసుకుంటామని తెలిపారు. బెంగళూరు నుంచి డ్రగ్స్ తీసుకు వచ్చి తేజ లోకల్‌గా ఉన్న యువత, స్టూడెంట్‌లకు అమ్ముతారన్నారు. ఇప్పటివరకు అన్ని లావాదేవీలు కలెక్ట్ చేశామని.. నిందితులు రిమాండ్ చేసినట్లు చెప్పారు. పట్టుబడ్డ తేజ కృష్ణ ఆర్కిటెక్ట్ అని.. కడపకు చెందిన వ్యక్తిగా తెలిపారు. మొత్తం ఈ కేసులో 19 మంది ఉన్నారు..వారి 9 మంది ఫెడ్లర్లు ఉన్నారన్నారు. పరారీలో ఉన్నవారిలో నలుగురు ఫెడ్లర్లు ఉన్నారని చెప్పారు. తేజ కృష్ణపై గతంలో మూడు ఎన్డీపీఎస్ కేసులు ఉన్నాయని డీసీపీ ఉదయ్ రెడ్డి వెల్లడించారు. మాదాపూర్ ఎస్ఓటీ గచ్చిబౌలి పోలీసులు ఎస్ఎం కో లివింగ్ హాస్టల్లో రైడ్ నిర్వహించారని తెలిపారు. కో లివింగ్ హాస్టల్‌లో తేజ కృష్ణ, లోకేష్ రెడ్డి వద్ద డ్రగ్స్ లభించాయని చెప్పారు. వారు ఇచ్చిన సమాచారం మేరకు మరో నలుగురు హోటల్ నైట్ ఐలో దొరికారన్నారు. వారిని అదుపులోకి తీసుకున్నామని.. వారి వద్ద కూడా డ్రగ్స్ లభించినట్లు తెలిపారు.

# 12 రాష్ట్రాలు, యూటీల్లో ఎస్ఐఆర్ ప్రక్రియ

సహా అండమాన్ నికోబార్ దీవులు, లక్షద్వీప్, పుదుచ్చేరిలు ఉన్నాయని ఈసీ వెల్లడించింది. 321 జిల్లాలు, 1843 అసెంబ్లీ నియోజకవర్గాల్లో దాదాపు 51 కోట్ల ఓటర్లను కవర్ చేయనున్నట్లు తెలిపింది. ఎన్యూమరేషన్ ప్రక్రియ నెల పాటు (డిసెంబర్ 4 వరకు) కొనసాగుతుందని, అక్టోబర్ 27 వరకు ఓటరు జాబితాలో ఉన్న ప్రతి ఓటరుకు సంబంధించి పాక్షిక వివరాలు ఎన్యూమరేషన్ ఫారంలో (ఈఎఫ్) ఉంటాయని ఎన్నికల సంఘం వెల్లడించింది.ఈ ప్రక్రియ సజావుగా సాగేందుకు 5.3లక్షల మంది బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు), 7.64లక్షల బూత్ స్థాయి ఏజెంట్లు (బీఎల్ఏలు), 10,448 ఈఆర్ఓ/ఏఈఆర్వోలు, 321 మంది డీఈవోలు విధుల్లో నిమగ్నమయ్యారని ఈసీ పేర్కొంది. ఈ సమయంలో ఈఎఫ్‌ల పంపిణీ, సేకరణ కోసం బీఎల్వోలు ప్రతి ఇంటికి కనీసం మూడుసార్లు వెళ్తారని తెలిపింది. డిసెంబరు 9న ఓటర్ల జాబితా ముసాయిదాను విడుదల చేయనుండగా.. వచ్చే ఏడాది ఫిబ్రవరి 7న తుది ఓటర్ల జాబితా ప్రచురణతో 'ఎస్ఐఆర్' రెండో దశ ముగియనుంది. అస్సాంలోనూ వచ్చే ఏడాది ఎన్నికలు ఉండగా.. అక్కడ 'ఎస్ఐఆర్' కోసం ప్రత్యేక తేదీని ప్రకటిస్తామని ఈసీ ఇప్పటికే ప్రకటించింది.ఎస్ఐఆర్‌ను వ్యతిరేకిస్తూ పశ్చిమ బెంగాల్‌లో నిరసనలు మొదలయ్యాయి. ముఖ్యమంత్రి మమతా బెనర్జీ నేతృత్వంలో కోల్‌కతాలో భారీ స్థాయిలో నిరసన ప్రదర్శన కొనసాగింది. వచ్చే ఏడాదిలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో దీన్ని ఓ రాజకీయ ఆయుధంగా ఉపయోగిస్తున్నారని దీదీ ఈ సందర్భంగా ఆరోపించారు. ఇదే సమయంలో రాష్ట్రంలో 16లక్షల ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేసినట్లు అధికారులు వెల్లడించారు.

## 'ఎస్ఐఆర్'పై బెంగాల్‌లో మిన్నంటిన ఆందోళనలు

**కోల్‌కతా(జనంసాక్షి):**

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)కు వ్యతిరేకంగా పశ్చిమబెంగాల్‌లో తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. ఆ ఆందోళనకు ముఖ్యమంత్రి మమతాబెనర్జీ నాయకత్వం వహించారు. మంగళవారం కోల్‌కతా వీధుల్లో నిర్వహించిన భారీ ర్యాలీని ముందుండి నడిపించారు. ఈ సమగ్ర సవరణ భాజపా నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘం కుమ్మక్కై నిర్వహిస్తోన్న నిశ్శబ్ద రిగ్గింగ్ అని తృణమూల్ కాంగ్రెస్ ఆరోపించింది. బెనర్జీ తో పాటు ఆమె మేనల్లుడు అభిషేక్ బెనర్జీ కూడా పాల్గొన్నారు. మొత్తం 3.8 కిలోమీటర్ల మేర ఈ మార్చ్ కొనసాగింది. దాంతో ఆ దారులన్నీ తృణమూల్ కాంగ్రెస్ కార్యకర్తలతో నిండిపోయాయి. అయితే ఈ నిరసనలపై భాజపా తీవ్రంగా మండిపడింది. భారత రాజ్యాంగ విలువలకు వ్యతిరేకంగా టీఎంసీ వ్యవహరిస్తోందని విమర్శించారు. "మమతా బెనర్జీ దీనిలో లోపాలను ఎత్తి చూపాలనుకుంటే.. సుప్రీంకోర్టును ఆశ్రయించాలి" అని వ్యాఖ్యలు చేశారు. రెండో దశలో 12 రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్)ను చేపట్టనున్నట్లు ఇటీవల కేంద్ర ఎన్నికల సంఘం వెల్లడించింది సంగతి తెలిసిందే "అండమాన్ నికోబార్, ఛత్తీస్‌గఢ్, గోవా, గుజరాత్, కేరళ, లక్షద్వీప్, మధ్యప్రదేశ్, పుదుచ్చేరి, రాజస్థాన్, తమిళనాడు, యూపీ, పశ్చిమబెంగాల్లో జరగనున్న రెండో దశలో 51 కోట్లమంది ఓటర్లు భాగం కానున్నారు" అని తెలిపింది. ఈసీ ప్రకటించినట్టుగా మంగళవారం నుంచి ఈ ప్రక్రియ ప్రారంభమైంది. ఇప్పటికే బిహార్‌లో ఎస్ఐఆర్ పూర్తయిన సంగతి తెలిసిందే. ఎన్డీయే పార్టీలు మినహా ఈసీ చేపట్టిన ఎస్ఐఆర్‌ను విపక్ష పార్టీలు వ్యతిరేకిస్తున్నాయి. ఎన్నికల సంఘం ఓటరు జాబితాల 'ప్రత్యేక సమగ్ర సవరణ' పేరిట భాజపాతో కలిసి ఓట్ల చోరీకి ప్రయత్నిస్తోందని విపక్ష కాంగ్రెస్ పార్టీ ఆరోపిస్తోంది. గత కొన్నేళ్లుగా దేశంలో జరుగుతున్న అన్ని ఎన్నికల్లో ఇదే విధంగా ఓట్ల చోరీ జరిగిందని ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శలు చేసిన సంగతి తెలిసిందే.

## అన్నదాతపై 'అకాల' పిడుగు

కురిసిన కుండపోత వర్షానికి నగర రహదారులు చెరువులను తలపించాయి. దీంతో పలు చోట్ల ట్రాఫిక్ జామ్ అయింది. వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. వర్షానికి ఎనుమాముల మార్కెట్‌లో పత్తి, మొక్కజొన్న తడిసిపోయింది. దీంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ఏర్పడ్డ 'మొంథా' తుపాను ముంపు నుంచి ఇంకా వరంగల్, హనుమకొండ, కాజీపేట ప్రాంతాలు పూర్తిగా తేరుకోలేదు. మరోసారి వర్షాలు కురవడంతో లోతట్టుప్రాంత ప్రజల్లో ముంపు భయం నెలకొంది. వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట, రంగారెడ్డి, మహబూబ్ నగర్, వనపర్తి, నాగర్ కర్నూల్, నారాయణపేట, గద్వాల్, మేడ్చల్ - మల్కాజిగిరి, యాదాద్రి - భోంగీర్ వంటి పశ్చిమ, మధ్య, దక్షిణ తెలంగాణలో అక్కడక్కడా ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు పడుతాయని తెలంగాణ వెదర్ మ్యాన్ అంచనా వేశారు. రాజన్న సిరిసిల్ల, నల్గొండ, సూర్యాపేట, ఖమ్మం, మహబూబాబాద్, హన్మకొండ, వరంగల్, జనగాం జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మేయర్ గుండు సుధారాణి, స్థానిక కార్పొరేటర్, సంబంధిత అధికారులతో కలిసి జీడబ్ల్యూఎంసీ పరిధిలోని 11వ డివిజన్ పోతన నగర్‌లో క్షేత్ర స్థాయి పర్యటన నిర్వహించారు. నాళాల భౌతిక స్థితి పరిశీలించి, వరద నీరు నిల్వ ఉండకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా నిరంతర పర్యవేక్షణ కొనసాగించాల సూచించారు.

ఇదిలావుంటే హైదరాబాద్‌లో మధ్యాహ్నం ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. పలుచోట్ల జల్లులు కురిసాయి. రాష్ట్రంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కుస్తాయనివాతావరణ శాఖ తెలిపింది. ఉమ్మడి హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, మెదక్, నిజామాబాద్, నిర్మల్ జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని వెల్లిడించింది. ఇప్పటికే ఉమ్మడి వరంగల్, నల్లగొండతోపాటు పలు జిల్లాల్లో భారీ వాన కురుస్తున్నది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఉదయం భారీ వర్షం పడింది. సుమారు అరగంటపాటు ఈదురు గాలులతో కూడిన వాన కుండపోతగా కురిసింది. దీంతో రహదారులు జలమయమయ్యాయి. ఇక నల్లగొండ జిల్లాలో భారీ వర్షం కురుస్తున్నది. అరేబియా సముద్రం నుంచి తెలంగాణ వైపు తేమ గాలులు వీస్తున్నాయి. దీంతో రాష్ట్రంలో సాధారణం కంటే 2 నుంచి 3 డిగ్రీలు అధికంగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. గురువారం నుంచి పొడి వాతావరణం కొనసాగే అవకాశం ఉందని తెలిపింది.

**తెలంగాణలోని పలు జిల్లాలకు వర్ష సూచన**

అరేబియా సముద్రం నుంచి తెలంగాణ వైపు తేమ గాలులు వీస్తున్నట్లు వాతావరణ శాఖ అధికారులు చెప్పారు. దీంతో రాష్ట్రంలో సాధారణం కన్నా రెండు నుంచి మూడు డిగ్రీలు అధికంగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. తేమ గాలులు, అధిక ఉష్ణోగ్రతలతో ఇవాళ, రేపు రాష్ట్రంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఉమ్మడి హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, మెదక్, నిజామాబాద్‌తో పాటు నిర్మల్ జిల్లాల్లో ఇవాళ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురవనున్నట్లు చెప్పారు.

## ఇజ్రాయెల్‌కు మద్దతిచ్చినంతకాలం అమెరికాకు మా సహకారం ఉండదు

**టెహ్రాన్(జనంసాక్షి):**ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ అమెరికాను ఉద్దేశిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇజ్రాయెల్ పాలనకు మద్దతు ఇవ్వడం ఆపేవరకు యూఎస్‌కు సహకరించేది లేదని తేల్చి చెప్పారు. టెహ్రాన్‌లో విద్యార్థులతో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ ఖమేనీ ఈ వ్యాఖ్యలు చేసినట్లు స్థానిక మీడియా పేర్కొంది. ఇరాన్ సహకరించాలని అమెరికన్లు కోరుకుంటున్నారని ఖమేనీ అన్నారు. అయితే ఇజ్రాయెల్ పాలనకు మద్దతు ఇవ్వడం పూర్తిగా ఆపేసేంత వరకు యూఎస్‌కు ఇరాన్ సహకరించదన్నారు. సైనిక స్థావరాలను తొలగించడంతో పాటు మధ్యప్రాచ్యంలో అగ్రరాజ్యం జోక్యం చేసుకోవడం ఆపేస్తే దానితో కలుస్తామన్నారు. ఈ సందర్భంగా వాషింగ్టన్ అహంకారంతో వ్యవహరిస్తోందని ఆయన ఆరోపించారు. అమెరికాతో అణుచర్చలు తిరిగి ప్రారంభించడానికి తొందరపడటం లేదని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ ఇటీవల పేర్కొన్నారు. ఇదే క్రమంలో పరోక్ష చర్చలకు సిద్ధంగా ఉన్నామన్నారు. తమ నియంత్రణలో ఉన్న రఫా ప్రాంతంలోని 200 మంది హమాస్ ఉగ్రవాదులను వదిలిపెట్టమని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు పేర్కొన్నారు. వారికి ఎలాంటి సురక్షిత మార్గం ఉండబోదని ప్రధాని కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది. ఈ సందర్భంగా హమాస్‌ను నిరాయుధీకరణ చేసేందుకు నెతన్యాహు కట్టుబడి ఉన్నట్లు వెల్లడించింది. ఆయుధాలను వదిలేయడానికి అంగీకరిస్తే హమాస్‌కు సురక్షిత మార్గాన్ని అందించేందుకు ఇజ్రాయెల్ అంగీకరించే అవకాశాలు ఉన్నాయంటూ స్థానిక మీడియాలో కథనాలు వెలువడ్డాయి.

# ఆందోళన కలిగిస్తున్న వరుస ప్రమాదాలు


- పలు కుటుంబాల్లో తీరని విషాదాలు



**హైదరాబాద్, నవంబర్4 (జనంసాక్షి) :** ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు ప్రమాదాలకు కేరాఫ్‌గా మారుతున్నాయి. గత వారం కర్నూలు జిల్లాలో వేమురి కావేరి బస్సు ప్రమాదంలో 19 మంది సజీవ దహనమైన విషయం తెలిసిందే. తాజాగా మంగళవారం తెల్లవారుజామున మూడు ట్రావెల్స్ బస్సులు ప్రమాదాలకు గురయ్యాయి. నల్లగొండ జిల్లా వేములపల్లి మండలం బుగ్గబావిగూడెం వద్ద అద్దంకి–నార్కట్‌పల్లి హైవేపై వేగంగా వచ్చిన ప్రైవేట్ ట్రావెల్ బస్సు అదుపుతప్పి ముందువెళ్తున్న ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీ కొట్టింది. దీంతో ట్రాక్టర్ రోడ్డుపై బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్‌లో ప్రయాణిస్తున్న నలుగురికి గాయాల య్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను మిర్యాలగూడ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ఆంధ్రప్రదేశ్‌లోని సత్యసాయి జిల్లా చెన్నే కొత్తపల్లి మండలం దామరాజు పల్లి దగ్గర జబ్బార్ ట్రావెల్స్ బస్సు ఓ ట్రక్కును ఢీ కొట్టింది. ఈ ఘటనలో బెంగుళూరుకు చెందిన ఓ మహిళ మరణించగా మరో 8 మంది గాయపడ్డారు. ఈ బస్సు బెంగళూరు నుంచి హైదరాబాద్ వస్తోంది. మృతురాలు బెంగళూరుకు చెందిన వారిగా గుర్తించారు. మరోవైపు.. ఏలూరు జిల్లా లింగపాలెం మండలం జూబ్లీనగర్‌లో భారతి ట్రావెల్స్‌కి చెందిన బస్సు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. పది మందికి గాయాలయ్యాయి. ఆయా ఘటనలపై కేసు నమోదుచేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఇకపోతే సోమవారం తెల్లవారు జామున చేవెళ్లలో జరిగిన ప్రమాదంలో 19మంది దుర్మరణం చెందారు. చేవెళ్లలో తెల్లవారక ముందే బస్సెక్కిన 19 మంది ప్ర యాణికుల బతుకులు తెల్లారేలోగా కానరానిలోకాలకు మరలిపోయాయి. గమ్యస్థానాలకు చేరుకోక ముందే తమ వారికి దూరమయ్యా రు. క్షేమంగా వెళ్లొచ్చని ఆర్టీసీ బస్సు ఎక్కిన వారికి కంకర టిప్పర్ రూపంలో మృత్యుశకటం ఎదురొచ్చి ప్రాణాలనే బలి తీసుకున్నది. నిద్రలో ఉన్నవారు కొందరు శాశ్వత నిద్రలోకి జారిపోయారు. కర్నూలు జిల్లా చిన్నటేకూరు సమీపంలో ట్రావెల్స్ బస్సు అగ్నిప్రమాదానికి గురై 19 మంది సజీవ దహన మైన ఘటనను మరువకముందే రంగారెడ్డి జిల్లా చేవెళ్ల సమీపంలోని మీర్జాగూడ గేట్ వద్ద సోమవారం తెల్లవారుజామున మరో ఘోర రోడ్డు ప్రమా దం జరిగింది. ఈ దుర్ఘటనలో టిప్పర్, బస్సు డ్రైవర్లు ఇద్దరు సహా 19 మంది దుర్మరణం పాలయ్యారు. తాండూరు నుంచి హైదరాబాద్ వైపు వస్తున్న ఆర్టీసీ బస్సును అతివేగంగా వచ్చిన కంకర టిప్పర్ బలంగా ఢీకొనడంతో ఈ ఘటన చోటుచేసుకున్నది. హైదరాబాద్– బీజాపూర్ హైవేపై చేవెళ్ల నుంచి వికారాబాద్‌కు కంకర లోడ్‌తో వెళ్తున్న టిప్పర్ (టీజీ 06టీ3879) వాహనం ఎదురుగా అతి వేగంగా వచ్చి ఆర్టీసీ బస్సును ఢీకొట్టి, దానిపై పూర్తిగా ఒరిగిపోయింది. దానిలో ఉన్న కంకరమొత్తం బస్సులోకి జా రింది. దీంతో ఆర్టీసీ బస్సు కుడివైపున 8 వరుసల సీట్లు పూర్తిగా నుజ్జునుజ్జయ్యాయి. ఆ సీట్లలో కూర్చున్న కొందరు ప్రయాణికులు బలమైన గాయాలతో మరణించగా, మరికొందరు కంకరలో కూరుకుపోయి ఊపిరాడక వి లవిల్లాడుతూ చనిపోయారు.

# బహరేన్‌లో మృతి చెందిన ఐదేళ్లకు గల్ఫ్ కార్మికుడి అంత్యక్రియలకు సన్నాహాలు

- బహరేన్‌లో అంత్యక్రియలకు సమ్మతిస్తూ మృతిడి భార్య అఫిడవిట్ దాఖలు
- సీఎం ప్రవాసీ ప్రజావాణి ని సందర్శించిన కోరుట్ల ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్




**హైదరాబాద్ (జనంసాక్షి) :** ఐదేళ్ల క్రితం బహరేన్‌లో మృతి చెందిన జగిత్యాల జిల్లా మెటుపల్లి కి చెందిన శ్రీపాద నరేష్ మృతదేహం అతిశీతల శవాగారంలో మగ్గుతోంది. శవాన్ని భారత్ కు రవాణా చేయడం సాధ్యం కాదని ఇండియన్ ఎంబసీ స్పష్టం చేయడంతో... బహరేన్ లోనే అంత్యక్రియలు నిర్వహించేందుకు సమ్మతిస్తూ, మృతుని భార్య శ్రీపాద లత (మునికోట నాగమణి) నిరభ్యంతర పత్రంపై సంతకం చేశారు. తదుపరి చర్యలకు కోసం కోరుట్ల ఎమ్మెల్యే డా. కల్వకుంట సంజయ్, మంగళవారం ప్రజా భవన్ లో నిర్వహించిన సీఎం ప్రవాసీ ప్రజావాణిని సందర్శించి మృతుడి సోదరుడు ఆనంద్ తో కలిసి నోటరీ అఫిడవిట్ (నిరభ్యంతర పత్రం) ను సీఎం ప్రజావాణి ఇంచార్జి డా. జి. చిన్నారెడ్డికి, తెలంగాణ ప్రభుత్వ నియమిత ఎన్నారై అడ్వయిజరీ కమిటీ వైస్ ఛైర్మన్ మంద భీంరెడ్డికి అందజేశారు. తెలంగాణ ప్రభుత్వం, బహరేన్ లోని ఇండియన్ ఎంబసీతో సమన్వయం చేసి అక్కడే అంత్యక్రియలు జరిగేలా చూడాలని ఎమ్మెల్యే కోరారు. మృతుడి సోదరుడు ధర్మపురి ఆనంద్ బహరేన్ వెళ్ళి అంత్యక్రియలకు హాజరుకానున్నారు.

ఈ కార్యక్రమంలో ఎన్నారై అడ్వయిజరీ కమిటీ మెంబర్లు నంగి దేవేందర్ రెడ్డి, సింగిరెడ్డి నరేష్ రెడ్డి, సామాజిక సేవకులు మొరపు తేజ, ఆకుల ప్రవీణ్, బొజ్జ అమరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా, బహరేన్ లోని సామాజిక కార్యకర్తలు డి.వి. శివకుమార్, కోటగిరి నవీన్ కుమార్, నోముల మురళి భారత రాయబార కార్యాలయంతో సమన్వయం చేసి సాంప్రదాయబద్ధంగా అంత్యక్రియలు నిర్వహించేందుకు కృషి చేస్తున్నారు.

# పత్తి కొనుగోలు పై ఎకరానికి 7క్వింటాళ్ల పరిమితి ఎత్తివేయాలి

- విలేకరుల సమావేశంలో టి.సాగర్ డిమాండ్




**హైదరాబాద్ (జనంసాక్షి) :** పత్తి కొనుగోలుపై సీసీఐ ఎకరానికి 7 క్వింటాళ్ల పరిమితిని ఎత్తివేయాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి సాగర్ డిమాండ్ చేశారు. ఆర్టీసీ క్రాస్ రోడ్ లోని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు ఈ జంగారెడ్డి, ప్రొఫెసర్ హరిబండి ప్రసాదరావులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..., కిసాన్ కపాస్ రిజిస్ట్రేషన్తో రైతులను ముప్పుతిప్పలు పెడుతున్నారని, కిసాన్ కపాస్ రిజిస్ట్రేషన్ రైతులకు తీవ్ర ఇబ్బందిగా మారిందని అన్నారు. తేమ శాతం 8–12 శాతం పెట్టడం, వర్షాలతో తేమ శాతం పెరగటంతో సీసీఐ కేంద్రాల్లో పత్తిని అమ్ము కునే పరిస్థితి లేదని, తద్వారా కనీస మద్దతు ధర రావడం లేదని ఆందోళన వ్యక్తంచేశారు. ఎకరానికి 7 క్వింటాళ్ల పత్తిని మాత్రమే మద్దతు ధరకు కొనుగోలు చేస్తామని సీసీఐ ప్రకటించడం దుర్మార్గమని అన్నారు. ఎలాంటి పరిమితి లేకుండా రైతులు తెచ్చిన పత్తిని కొనుగోలు చేయాలని కోరారు. కొత్తగా తీసుకొచ్చిన నిబంధనలను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. పత్తి దిగుమతి పై ఉన్న 11 శాతం సుంఖాన్ని ఎత్తివేసి ఈ దేశంలోని 50 లక్షల మంది పత్తి రైతులను కేంద్ర ప్రభుత్వం నిలువునా ముంచిందని అన్నారు. కేంద్ర ప్రభుత్వ కార్పొరేటర్ అనుకూల విధానాలకు వ్యతిరేకంగా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పత్తి రైతులను సమీకరించి ఆందోళనా పోరాటాలు నిర్వహిస్తామని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. ఈ రాష్ట్రం నుంచి ఇద్దరు కేంద్ర మంత్రులు ఉండి కూడా ఇలాంటి నిబంధనలు వ్యతిరేకించకపోవడం శోచనీయమని అన్నారు. సీసీఐ కొనుగోలు కేంద్రాలకు వచ్చిన పత్తిని తేమ పేరుతో తిరిగి పంపడం వల్ల ప్రైవేట్ వ్యాపారస్తులకు మద్దతు ధర కంటే తక్కువగా రైతులు అమ్ముకుంటున్నారని, తిరిగి వ్యాపారస్తులు అదే సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకొని లాభాలు గడిస్తున్నారని అన్నారు. ఈ విధానాలు మార్చుకోకపోతే రైతుల ఆందోళనలకు ప్రభుత్వాలే బాధ్యత వహించాలని హెచ్చరించారు.

# యువతికి బ్లాక్ మెయిల్



- వ్యక్తి అరెస్టు..

**హనుమకొండ ప్రతినిధి, నవంబర్ 4 (జనం సాక్షి) :** హనుమకొండ జిల్లాదామెర పోలీస్ స్టేషన్ లో ఆత్మకూరు మండలం అక్కెంపేట గ్రామానికి చెందిన కక్కెర్ల అనిల్ కుమార్ దామెర మండల కేంద్రానికి చెందిన ఓ యువతిని ఆన్లైన్ లో పరిచయం చేసుకొని నిత్యం మెసేజెస్ పంపుతూ యువతి ఫోటోలు ఆన్లైన్ ద్వారా తీసుకుని యువతిని డబ్బులు ఇవ్వాలంటూ బ్లాక్ మెయిల్ చేశాడు.దీంతో యువతి రూ.50,000 వేలు ఆన్లైన్ ద్వారా పంపించగా, ఇంకా మళ్లీ డబ్బులు కావాలంటూ ఇవ్వకుంటే యువతి చిత్రాలను సోషల్ మీడియాలో పెడతానని అంటూ యువతిని బెదిరించాడు.దీంతో విసిగిపోయిన యువతి దామెర పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా దామెర పోలీసులు కేసు నమోదు చేసి, కక్కెర్ల అనిల్ ను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు పరకాల రూరల్ సీఐ రంజిత్ రావు ఎస్సై కొంక అశోక్ తెలిపారు.

## ఈవీఎంల కమిషన్ ప్రక్రియ పూర్తి

**హైదరాబాద్ (జనంసాక్షి) :** నగరంలోని కోట్ల విజయ భాస్కర్ రెడ్డి ఇండోర్ స్టేడియంలో జూబ్లీ హిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నిక కు సంబంధించి ఈవీఎం ల కమిషన్ ప్రక్రియ ఈ నెల 2, 3 వ తేదీలలో రిటర్నింగ్ అధికారి చేపట్టారు. పోటీలో ఉన్న అభ్యర్థులు, వారి ఏజెంట్ల సమక్షంలో జరిగిన ఈ ప్రక్రియను ఎన్నికల సాధారణ పరిశీలకులు రంజిత్ కుమార్ సింగ్, పోలీస్ పరిశీలకులు ఓం ప్రకాశ్ త్రిపాఠి, జిల్లా ఎన్నికల అధికారి జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్ లు పరిశీలించారు.

## జూబ్లీహిల్స్‌లో బిజెపికి జనసేన మద్దతు

**హైదరాబాద్,నవంబర్ 4(జనంసాక్షి) :** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కీలక రాజకీయ పరిణామం చోటుచేసుకుంది. బీజేపీ అభ్యర్థి లంకల దీపక్ రెడ్డికి జనసేన పార్టీ అధికారికంగా మద్దతు ప్రకటించింది. ఈ సందర్భంగా జనసేన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు శంకర్ గౌడ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావు, కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి లతో హైదరాబాద్‌లోని సాగర్ సొసైటీలో భేటీ అయ్యారు. ఈ సమావేశంలో బీజేపీ అభ్యర్థి లంకల దీపక్ రెడ్డి, పార్టీ ప్రధాన కార్యదర్శి గౌతమ్ రావు, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి సహా ఇరుపార్టీల నాయకులు పాల్గొన్నారు. ఈ భేటీలో జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిని విజయవంతం చేయడానికి జనసేన పార్టీ పూర్తిస్థాయి సహకారం అందించనున్నట్లు శంకర్ గౌడ్ తెలిపారు. రేపు రెండు పార్టీల నాయకులు సంయుక్తంగా ప్రెస్ మీట్ నిర్వహించి, తమ సంయుక్త ప్రచార కార్యాచరణ వివరాలను వెల్లడించనున్నారు. ఈ నిర్ణయం జనసేన పార్టీ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు తీసుకున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి.




# రెండోదశ ఎన్నికల ఓటరు జాబితా సవరణ

- న్యూమరేషన్ ఫారాలు పంపిణీ మొదలు : ఇసి

**న్యూఢిల్లీ, నవంబర్ 4(జనంసాక్షి) :** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై ఇప్పటికే బీహార్‌లో తీవ్ర నిరసనలు చెలరేగాయి. ఇప్పుడు బెంగాల్లో మమతా బెనర్జీ స్వయంగా నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ క్రమంలో ఫేజ్–2.. తొమ్మిది రాష్ట్రాలు, మూడు కేంద్ర పాలిత ప్రాంతాల్లో ప్రారంభమైందని కేంద్ర ఎన్నికల సంఘం వెల్లడించింది. ఆయా రాష్ట్రాల్లో ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణీ మొదలు పెట్టినట్లు తెలిపింది. ఓటర్ల జాబితా ప్రక్షాళనను బిహార్‌లో విజయవంతంగా పూర్తి చేసినట్లు పేర్కొన్న ఈసీ.. తాజాగా రెండో దశను ప్రారంభించినట్లు తెలిపింది. ఎస్ఐఆర్ రెండో దశలో ఛత్తీస్‌గఢ్, గోవా, గుజరాత్, కేరళ, మధ్యప్రదేశ్, రాజస్థాన్, తమిళనాడు, ఉత్తర్‌ప్రదేశ్, పశ్చిమ బెంగాల్ సహా అండమాన్ నికోబార్ దీవులు, లక్షద్వీప్, పుదుచ్చేరిలు ఉన్నాయని ఈసీ వెల్లడించింది. 321 జిల్లాలు, 1843 అసెంబ్లీ నియోజకవర్గాల్లో దాదాపు 51 కోట్ల ఓటర్లను కవర్ చేయనున్నట్లు తెలిపింది. ఎన్యూమరేషన్ పక్రియ నెల పాటు డిసెంబర్ 4 వరకు కొనసాగుతుందని, అక్టోబర్ 27 వరకు ఓటరు జాబితాలో ఉన్న ప్రతి ఓటరుకు సంబంధించి పాక్షిక వివరాలు ఎన్యూమరేషన్ ఫారంలో (ఈఎఫ్) ఉంటాయని ఎన్నికల సంఘం వెల్లడించింది. ఎస్ఐఆర్‌ను వ్యతిరేకిస్తూ పశ్చిమ బెంగాల్‌లో నిరసనలు మొదలయ్యాయి. ముఖ్యమంత్రి మమతా బెనర్జీ నేతృత్వంలో కోల్‌కతాలో భారీ స్థాయిలో నిరసన ప్రదర్శన కొనసాగింది. వచ్చే ఏడాదిలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో దీన్ని ఓ రాజకీయ ఆయుధంగా ఉపయోగిస్తున్నారని దీదీ ఈ సందర్భంగా ఆరోపించారు.

## బీహార్‌లో ముగిసిన తొలిదశ ప్రచారం

- 18 జిల్లాల్లోని 121 నియోజకవర్గాల్లో 6న తొలి విడత పోలింగ్

**పాట్నా, నవంబర్ 4 (జనంసాక్షి) :** బిహార్ అసెంబ్లీ తొలిదశ ఎన్నికల ప్రచారానికి మంగళవారం సాయంత్రంతో తెరపడింది. బీజేపీ, జనతాదళ్ (యునైటెడ్), ఆర్జేడీ, కాంగ్రెస్, జన్ సురాజ్, ఇతర పార్టీలకు చెందిన స్టార్ క్యాంపెయినర్లు ఎన్నికల ప్రచారం చివరి రోజు సుడిగాలి పర్యటనలు సాగిస్తూ పోటీపోటీ ర్యాలీలు నిర్వహించారు. 18 జిల్లాల్లోని 121 నియోజకవర్గాల్లో నవంబర్ 6 తొలి విడత పోలింగ్ జరుగనుంది. రెండో విడత పోలింగ్ నవంబర్ 11న జరుగుతుంది. నవంబర్ 14న ఫలితాలు వెలువడతాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మంగళవారం 'నమో యాప్' ద్వారా పార్టీ మహిళా కార్యకర్తలతో మాట్లాడారు. ప్రజలు ఏమి కోరుకుంటున్నారో దగ్గరుండి తాను చూశానని, భారీ మెజారిటీతో ఎన్డీయే గెలుస్తుందని తాను చెప్పగలనని అన్నారు. 20 ఏళ్ల రికార్డును బ్రేక్ చేసేందుకు ప్రజలు కృతనిశ్చయంతో ఉన్నారనడంలో ఎలాంటి సందేహం లేదని చెప్పారు. 'జంగిల్ రాజ్' టీమ్ ఘోరంగా ఓడిపోతుందని, ఎన్డీయే హయాంలోనే బిహార్ అభివృద్ధి సాధ్యమని అన్నారు. మహిళలు పెద్దఎత్తున ఓటింగ్‌లో పాల్గొనాలని సూచించారు. తొలి విడత ప్రచారం చివరిరోజున కేంద్ర హోం మంత్రి అమిత్‌షా దర్భంగాలో ప్రచారం చేశారు. మోతిహారి, బేతియాలో రోడ్ షోలు నిర్వహించారు. లాలూ, రబ్రీ హయాంలో జంగిల్ రాజ్‌ను చూసిన ప్రజలు తిరిగి వారికి అవకాశం ఇవ్వకూడదన్నారు. బీజేపీకి ఓటు వేయాలని కోరారు. ఆర్జేడీ నేత, మహాగఠ్‌బంధన్ ముఖ్యమంత్రి అభ్యర్థి తేజస్వి యాదవ్ మీడియా సమావేశం ఏర్పాటు చేసి ఈ ఎన్నికల్లో నితీష్ ప్రభుత్వాన్ని మట్టికరిపిస్తామని ధీమా వ్యక్తం చేశారు. 'మై–బిహిన్ మాన్ యోజన' ద్వారా జనవరి 14న సంక్రాంతి రోజున రాష్ట్రంలోని మహిళలకు ఏడాదికి రూ.30 వేలు కానుకగా అందజేస్తామన్నారు.

# జాబ్ క్యాలెండర్ హామీలతో మోసం

- ఒక్క నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదు
- నిరుద్యోగులను నిండా ముంచారు
- జనంబాటలో జాగృతి అధ్యక్షురాలు కవిత




**ఆదిలాబాద్, నవంబర్ 4 (జనంసాక్షి) :** జాబ్ క్యాలెండర్ ఇస్తామన్న హామీలతో అధికారంలోకి వచ్చిన రేవంత్ సర్కార్,అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క కొత్త ఉద్యోగ నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ఆదిలాబాద్‌లో మంగళవారం జరిగిన జనం బాట కార్యక్రమంలో భాగంగా జిల్లా సెంట్రల్ లైబ్రరీని సందర్శించి నిరుద్యోగులతో మాట్లాడిన ఆమె, ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరుద్యోగులను నమ్మించి మోసం చేశారు. ఎన్నో వాగ్దానాలు చేసి ఒక్కటీ అమలు చేయలేదన్నారు. గత ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్ల, నియామకాలను మాత్రమే కొనసాగిస్తున్నారని ఆమె తెలిపారు. డీఎస్సీ, ఫార్మసీ, గ్రూప్స్ కోసం విద్యార్థులు కష్టపడుతున్నారు. కానీ ఎప్పుడు నోటిఫికేషన్ వస్తుందో తెలియని అనిశ్చితి నెలకొంది. ఈ పరిస్థితి మారాలంటే ప్రభుత్వం వెంటనే జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మొన్నటి గ్రూప్–1 పరీక్షల్లో అనేక తప్పులు జరిగాయని, తెలుగు, ఉర్దూ మీడియం అభ్యర్థులకు అన్యాయం జరిగిందని కవిత ఆరోపించారు. ఇలా కాకుండా క్వాలిటీ ఎగ్జామ్స్ నిర్వహించండి. ప్రతిపక్షాల సహకారం కూడా ఉంటుంది. విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రభుత్వం సమర్థవంతంగా వ్యవహరించాలని సూచించారు. ఇక్కడ లైబ్రరీలో కనీస వసతులు లేవు. మండలాల నుంచి వచ్చి చదువుకుంటున్న విద్యార్థులకు మిడ్ డే మీల్స్ ఏర్పాటు చేస్తే చాలా ఉపయోగకరం. గతంలో నిజామాబాద్ లైబ్రరీలో జాగృతి తరఫున విద్యార్థులకు లంచ్ ఏర్పాటు చేశాం. రాష్ట్రవ్యాప్తంగా లైబ్రరీల్లో మిడ్ డే మీల్స్ అమలు చేయాలని సూచించారు. లైబ్రరీలో కరెంట్ పోతే గంటల తరబడి ఇబ్బందులు ఎదురవుతున్నాయని, కనీసం జనరేటర్ ఏర్పాటుతో విద్యార్థులకు సౌకర్యాలు కల్పించాలని ఆమె ప్రభుత్వాన్ని కోరారు.

# మణికొండలో రాజకీయ నేతల కాల్పుల కలకలం

- అల్లుడి స్వాధీనంలోని స్థలం ఖాళీ చేయించేందుకు ఒత్తిడి
- ఈ సందర్భంగా మాజీమంత్రి కెఇ ప్రభాకర్ కాల్పులు

**హైదరాబాద్, నవంబర్ 4 (జనంసాక్షి) :** మణికొండ పంచవటి కాలనీలో మంగళవారం తుపాకీ కాల్పులు కలకలం సృష్టించాయి. ఎపికి చెందిన మాజీమంత్రి ప్రభాకర్ ఓ స్థల వివాదంలో గాల్లోకి కాల్పులు జరిపినట్లు తెలుస్తోంది. మణికొండ పంచవటి కాలనీలో తన స్థలాన్నీ ఖాళీ చేయాలని బాధితులను ప్రభాకర్ బెదిరించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో తుపాకీతో గాల్లోకి ప్రభాకర్ మూడు రౌండ్లు కాల్పులు జరిపినట్లు వార్తలు వస్తున్నాయి. బాధితులను స్థలంలో నుంచి బయటకు గెంటేసి గేటుకి ప్రభాకర్ అనుచరులు తాళాలు వేసినట్లు తెలుస్తోంది. అయితే, రాయదుర్గం పోలీస్ స్టేషన్‌లో బాధితులు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. హైదరాబాద్ రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో కాల్పులకు సంబంధించి కీలక విషయాలు బయటకొచ్చాయి. కేఈ ప్రభాకర్, పటాన్‌చెరు మాజీ ఎమ్మెల్యే నందీశ్వర్ గౌడ్ కుటుంబాల మధ్య రచ్చ కారణంగా ఈ గొడవ జరిగినట్లు తెలిసింది.వివరాల్లోకి వెళ్తే.. కేఈ కృష్ణమూర్తి సోదరుడు కేఈ ప్రభాకర్ కుమార్తెకు, నందీశ్వర్‌గౌడ్ పెద్ద కుమారుడు అభిషేక్ గౌడ్‌కు చాలాకాలం కిందట పెళ్లి జరిగింది. ఆ దంపతుల మధ్య కొంతకాలంగా విభేదాలు నడుస్తున్నాయి. ఈ గొడవల కారణంగా వారు విడాకులు తీసుకోవాలని కూడా నిర్ణయించుకున్నారు. దీంతో తన కుమార్తెకు కట్నంగా ఇచ్చిన ఫ్లాట్ ఖాళీ చేయాలని అల్లుడు నందీశ్వర్ గౌడ్‌పై కేఈ ప్రభాకర్ ఒత్తిడికి తీసుకొచ్చారు. ఈ క్రమంలో కేఈ ప్రభాకర్‌ను అభిషేక్ గౌడ్ గన్‌తో బెదిరించారు. తుపాకీతో గాల్లోకి మూడు రౌండ్ల కాల్పులు జరిపినట్లు సమాచారం. ఈ బెదిరింపులపై అక్టోబర్ 25వ తేదీన రాయదుర్గం పోలీసులకు కేఈ ప్రభాకర్ ఫిర్యాదు చేశారు. అప్పట్నుంచి అభిషేక్ గౌడ్ కోసం పోలీసులు వెతుకుతున్నారు. ఈ క్రమంలో మణికొండలోని పంచవటి కాలనీలో అభిషేక్ గౌడ్ నివాసానికి వెళ్లిన పోలీసులు వెపన్ కోసం సెర్చ్ చేస్తున్నారు.


## సుక్మా జిల్లాలో భారీగా డంప్ స్వాధీనం



**హైదరాబాద్, నవంబర్ 4 (జనంసాక్షి) :** ఇటీవల లొంగుబాట్లు, ఎన్‌కౌంటర్ల తరవాత పోలీసులు చేపట్టిన గాలింపులు మావోలకు చెందిన భారీ ఆయుధ డంపు లభించింది. సుక్మా అడవుల్లో భద్రతా దళాలు చేపట్టిన ఓ ఆపరేషన్‌లో మావోయిస్టుల ఆర్డినెన్స్ ఫ్యాక్టరీని స్వాధీనం చేసుకున్నాయి. జిల్లాలోని గోంగూడ –కంచాల అడవుల్లో బలగాలు మంగళవారం కూంబింగ్ చేస్తున్న క్రమంలో మావోయిస్టుల ఆయుధ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీని గుర్తించాయి. భద్రతా బలగాలు ఆ ప్రాంతం నుంచి 17 రైఫిల్స్, రాకెట్ లాంచర్లు , ఆయుధాల తయారీ సామగ్రి, పరికరాలను స్వాధీనం చేసుకున్నాయి. ఈ ఘటనను ఎస్పీ కిరణ్ చవాన్ ధ్రువీకరించారు. మావోయిస్టులు జనజీవన స్రవంతిలోకి వచ్చి చక్కటి జీవితాన్ని ప్రారంభించుకోవాలని ఎస్పీ సూచించారు. డీఆర్జీ వ్యూహాత్మక ఆపరేషన్‌ను ఆయన అభినందించారు. భారీగా లొంగుబట్ల తరవాత ఈ డంప్‌ను నిర్వహించేవారు లేకుండా పోయారని తెలుస్తోంది.

# అప్పుల ఊబిలో కుటుంబాలు – మోదీ పాలన వైఫల్యం!

మోదీ ప్రభుత్వం రెండో టర్మ్‌లో భారతీయ కుటుంబాలు అపూర్వమైన ఆర్థిక ఒత్తిడికి గురవుతున్నాయి. పేదలు, మధ్యతరగతి వర్గాలు నిత్యావసర ధరల పెరుగుదలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. ఉద్యోగ అవకాశాలు గణనీయంగా తగ్గిపోయాయి. సామాన్య ప్రజలు అప్పుల ఊబిలో చిక్కుకున్నారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) తాజా హౌస్‌హోల్డ్ ఫైనాన్స్ సర్వే ఈ కఠిన వాస్తవాన్ని స్పష్టంగా బయటపెట్టింది. కోవిడ్ మహమ్మారి తర్వాత బీజేపీ పాలనలో కుటుంబాల అప్పులు రెట్టింపు కావడం ఆందోళనకరం. ఆర్థిక నిపుణులు దీన్ని మోదీ ప్రభుత్వం ఆర్థిక విధానాల వైఫల్యంగా అభివర్ణిస్తున్నారు. ఈ పరిస్థితి కేవలం గణాంకాలకు మాత్రమే పరిమితం కాదు – ఇది లక్షలాది కుటుంబాల రోజువారీ జీవితాల్లో ప్రతిబింబిస్తుంది. ఇంటి ఖర్చులు, పిల్లల చదువులు, వైద్య ఖర్చులు, రుణ వాయిదాలు – ఇవన్నీ సామాన్యులను ఆర్థికంగా కుదించేస్తున్నాయి. ప్రభుత్వం పెద్ద ఎత్తున ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్టులు, డిజిటల్ ఇండియా, మేక్ ఇన్ ఇండియా వంటి కార్యక్రమాలు ప్రకటిస్తున్నా, సామాన్యుల జేబులో మాత్రం ఆ లాభాలు చేరడం లేదు. బదులుగా, బ్యాంకు నోటీసులు, రుణ వసూళ్ల ఏజెంట్లు, ఆర్థిక ఒత్తిడి మాత్రమే పెరుగుతున్నాయి.




**అప్పుల రెట్టింపు వృద్ధి**

ఆర్‌బీఐ డేటా ప్రకారం, 2019–20 ఆర్థిక సంవత్సరంలో భారతీయ కుటుంబాల మొత్తం అప్పులు రూ.7.7 లక్షల కోట్లుగా ఉండగా, 2024–25 నాటికి అది రూ.15.7 లక్షల కోట్లకు చేరింది – అంటే 102 శాతం పెరుగుదల. ఈ సంఖ్యలు కేవలం గణాంకాలు మాత్రమే కాదు, ఇవి లక్షలాది కుటుంబాల ఆర్థిక భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తున్నాయి. ఇదే కాలంలో కుటుంబాల ఆస్తులు కేవలం 48 శాతం మాత్రమే పెరిగాయి. ఆర్థిక ఆస్తులు 2019–20లో రూ.24.1 లక్షల కోట్లుగా ఉండగా, 2024–25కి రూ.35.6 లక్షల కోట్లకు పరిమితమయ్యాయి. జీడీపీలో అప్పుల శాతం 3.9 నుంచి 4.7కి పెరిగింది. ఆస్తుల శాతం మాత్రం 12 నుంచి 10.8కి తగ్గింది. ఇది స్పష్టమైన అసమతుల్యతను సూచిస్తుంది. వార్షిక డేటా విశ్లేషిస్తే మరింత ఆందోళనకర చిత్రం కనిపిస్తుంది: 2020–21లో రూ.7.9 లక్షల కోట్లు, 2021–22లో కోవిడ్ లాక్‌డౌన్ ప్రభావంతో రూ.5.9 లక్షల కోట్లు (తాత్కాలిక తగ్గుదల), 2022–23లో రూ.16 లక్షల కోట్లు, 2023–24లో రూ.18.8 లక్షల కోట్లు, 2024–25లో ప్రాథమిక అంచనా ప్రకారం రూ.15.7 లక్షల కోట్లు. ఆర్‌బీఐ హౌస్‌హోల్డ్ ఫైనాన్స్ రిపోర్టు స్పష్టంగా చెబుతోంది %–% అప్పులు ఆదాయం కంటే వేగంగా పెరుగుతున్నాయి. కోవిడ్ అనంతరం ఈ పోకడ మరింత తీవ్రమైంది. ఈ అప్పుల్లో ఎక్కువ భాగం హోమ్ లోన్స్, పర్సనల్ లోన్స్, క్రెడిట్ కార్డ్ డెట్. 2023లో క్రెడిట్ కార్డ్ డెట్ మాత్రమే 30 శాతం పెరిగింది. ఇది మధ్యతరగతి వర్గం ఆర్థికంగా ఎంత ఒత్తిడిలో ఉందో చూపిస్తుంది.

**పెట్టుబడుల మళ్లింపు**

కుటుంబాలు తమ పొదుపుల్ని ఎక్కడ పెట్టుబడి పెడుతున్నాయి? ఆర్‌బీఐ డేటా ప్రకారం, బ్యాంకు డిపాజిట్లు ప్రధాన ఆకర్షణ. 2019–20లో 32 శాతం (రూ.7.7 లక్షల కోట్లు) ఉండగా, 2024–25కి 33.3 శాతం (రూ.11.8 లక్షల కోట్లు)కు చేరింది. ఇది సురక్షిత పెట్టుబడి అయినప్పటికీ, వడ్డీ రేట్లు తగ్గడంతో రాబడి తక్కువగా ఉంది. అయితే మ్యూచువల్ ఫండ్లలో అసాధారణ బూమ్ కనిపిస్తోంది. 2019–20లో కేవలం 2.6 శాతం (సుమారు రూ.0.62 లక్షల కోట్లు) ఉండగా, 2024–25కి 13.1 శాతం (రూ.4.7 లక్షల కోట్లు)కు పెరిగింది – అంటే 655 శాతం వృద్ధి. ఇది మధ్యతరగతి వర్గం స్టాక్ మార్కెట్, మ్యూచువల్ ఫండ్ల వైపు మళ్లడాన్ని సూచిస్తుంది. కానీ ఇది రిస్క్‌ను కూడా పెంచుతుంది. నగదు పొదుపు గణనీయంగా తగ్గింది – 2019–20లో 11.7 శాతం నుంచి 2024–25కి 5.9 శాతానికి పడిపోయింది. డిజిటల్ పేమెంట్లు, యూపీఐ లావాదేవీలు పెరగడం ఇందుకు కారణం. గోల్డ్ ఇన్వెస్ట్‌మెంట్ 10–15 శాతం పెరిగింది – సాంప్రదాయక ఆకర్షణ కొనసాగుతోంది. కానీ ఈ పెట్టుబడులు అప్పుల భారాన్ని తగ్గించలేకపోయాయి. బదులుగా, అప్పులు పెరుగుతూనే ఉన్నాయి. ఇది ఆర్థిక అస్థిరతను సూచిస్తుంది – పొదుపు పెరుగుతున్నా, రుణ భారం మాత్రం తగ్గడం లేదు.

**ధరల దెబ్బ, ఆదాయ స్తబ్ధత**

ఈ ఆర్థిక సంక్షోభానికి ప్రధాన కారణం – నిత్యావసర ధరల ఆకాశమే. ఆహార ద్రవ్యోల్బణం 2022–23లో 8 శాతం దాటింది. టమాటా, ఉల్లి, ఆహార తైలాలు, పప్పులు – ఇవన్నీ సామాన్యుల బడ్జెట్‌ను దెబ్బతీశాయి. జీవన వ్యయం పెరిగింది. కానీ వేతనాలు తగినంతగా పెరగలేదు. సగటు ఉద్యోగి ఆదాయం 6–7 శాతం మాత్రమే పెరిగింది – ఇది ద్రవ్యోల్బణం కంటే తక్కువ. ఉద్యోగ కోతలు పెరిగాయి. ప్రైవేట్ సెక్టార్‌లో 2023లో లేఆఫ్స్ గరిష్ట స్థాయికి చేరాయి. ఐటీ, స్టార్టప్‌లు వేలాది మందిని తొలగించాయి. ఖర్చులు ఆదాయం కంటే ఎక్కువయ్యాయి. కోవిడ్ తర్వాత ఆర్థిక రికవరీ నెమ్మదిగా సాగింది. ప్రభుత్వ ఆర్థిక విధానాలు మధ్యతరగతిని పూర్తిగా విస్మరించాయి. ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ 2024లో స్పష్టంగా హెచ్చరించారు – హౌస్‌హోల్డ్ డెట్ పెరుగుదల ఆందోళనకరం. ఇది భవిష్యత్ వినియోగాన్ని, ఆర్థిక వృద్ధిని ప్రభావితం చేస్తుంది. ఆయన మాటల్లోనే, "అప్పులు పెరగడం స్థిరమైన ఆర్థిక వృద్ధికి ముప్పు."

**అసమాన వృద్ధి, యువత నిరాశ**

భారత్ జీడీపీ 2024–25లో 6.5–7 శాతం వృద్ధి అంచనా వేయబడింది. కానీ ఈ వృద్ధి అసమానం. అగ్ర 10 శాతం కుటుంబాలు లాభపడుతున్నాయి. కింది 50 శాతం కుటుంబాల ఆదాయం స్తబ్దంగా ఉంది. ధనవంతులు మరింత ధనవంతులు అవుతున్నారు – సామాన్యులు మాత్రం అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. యువత అన్‌ఎంప్లాయ్‌మెంట్ 15–20 శాతం మధ్య ఉంది. లక్షలాది మంది గ్రాడ్యుయేట్లు ఉద్యోగాల కోసం తిరుగుతున్నారు. ప్రభుత్వం ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్టులపై దృష్టి పెట్టింది – రోడ్లు, వంతెనలు, ఎయిర్‌పోర్టులు నిర్మాణం జరుగుతోంది. కానీ ఇవి సామాన్యులకు తక్షణ ఉపశమనం ఇవ్వడం లేదు. ట్యాక్స్ రాయితీలు పెద్ద కార్పొరేట్లకు, ధనవంతులకు మాత్రమే. మధ్యతరగతి వర్గం మాత్రం భారీ పన్నులు చెల్లిస్తూ, తక్కువ సేవలు పొందుతోంది. మోదీ హయాంలో ఆర్థిక వ్యవస్థ గాడి తప్పిందని ఆర్‌బీఐ నివేదికలే చెబుతున్నాయి. గ్లోబల్ ఇన్‌ఫ్లేషన్, ఉక్రెయిన్–రష్యా యుద్ధం, చమురు ధరలు పెరగడం వంటి అంతర్జాతీయ కారకాలు ప్రభావం చూపాయి %–% కానీ ప్రభుత్వం సకాలంలో సరైన చర్యలు తీసుకోలేదు. ద్రవ్యోల్బణ నియంత్రణ, ఉద్యోగ సృష్టి, వేతన పెంపు – ఈ మూడు రంగాల్లో వైఫల్యం స్పష్టం.


ఈ ఆర్థిక సంక్షోభం నుంచి బయటపడాలంటే ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలి. వేతన పెంపు, ఉద్యోగ సృష్టి, చిన్న మధ్య తరగతి వ్యాపారులకు మద్దతు, రుణ భారం తగ్గింపు కార్యక్రమాలు అవసరం. లేకుంటే అప్పుల ఊబి మరింత లోతుగా అవుతుంది. సామాన్యులు మాత్రం రోజువారీ జీవితంలో పోరాడుతూనే ఉంటారు.

మోదీ ప్రభుత్వం ఈ హెచ్చరికలను గౌరవిస్తుందా? లేక ఇది కేవలం మరో గణాంకంగానే మిగిలిపోతుందా? సమాధానం కాలమే చెప్పాలి.



డాక్టర్ కోలాహలం
రామ్ కిశోర్
9849328496.

# సాహిత్య మాగాణంలో సాగుబాటు




మొన్న శనివారం రోజున జరసం అధ్యక్షులు నక్క సురేష్ గారు "సాగుబాటు"పుస్తకము నాకు అందించారు.సాహితీ మిత్రులు రాపోలు సత్యనారాయణ గారు వాట్సఫ్ లో పంపించియున్నారు. పుస్తకాన్ని చేతిలోకి తీసుకొని చూస్తున్నపుడు "సాగుబాటు" అనేది సాధారణంగా వ్యవసాయ సమాయత్తానికి ఉపయోగించుకునే పదంగా నా ఆలోచనలో దాగిఉన్నదై ఉంది.

కానీ ఇక్కడ ఆ పదం సాహిత్య పదబంధంగా ఉపయోగించబడడంవల్ల అది ఒక సృజనాత్మక రచనకు,సామూహిక కృషికి అన్వయింపుగా గుర్తుకుచేస్తుంది.

అలాగే

బమ్మెర పోతన గారి – మహాభాగవతములోని ఒక

ఉత్పలమాల పద్యం "భావరసాల సాల..."

స్ఫురణ కొచ్చింది.

దాని భావార్థం..

లేతమామిడి చిగురువంటి అతి కోమలమైన కావ్య కన్యకను అహంకారులైన రాజులకిచ్చి వారిచ్చు ధన ధాన్యములను అనుభవించుటకంటే 'సత్కవులు' వ్యవసాయ దారులైగాని,అడవులలో దొరికే కందమూలములను సంపాదించుకొనిగాని తమ భార్యా బిడ్డలను పోషించుకొనుట మంచిది.

ఈ పద్యాన్ని ఇక్కడ నేనెందుకు ఉదహరించానని అంటే?

పోతన గారి సాహిత్యంలో వ్యవసాయం ప్రత్యామ్నాయంగా

ఈ పదం వర్తించవచ్చునట్లుగా అనిపించింది.

ఈ "సాగుబాటు" లోని సాగుదారులందరు 'సత్కవులె' నన్న భావన కూడ ఉంది నాకు.

"పోరుకెరటాలై ఎగసి
ఉక్కుపిడికిళ్ళు బిగించి
చైతన్య బావుటాలెగిరేసి
మడమతిప్పని పోరుచేసి
చరిత్రలో మరోచరిత్ర
లిఖించినవారు"

జరసంలోని

వారనే అభిప్రాయం కలవాడిని.

ఈ సాహిత్య మాగాణంలోని వారు పేరు ప్రతిష్టల కోసమో,మరే విధమైన లబ్ధికోసమో ఆశించేవారు కూడ కాదని నేను ప్రగాఢంగా విశ్వసించగలను. జనగామ ప్రాంత సారవంతమైన నేలలో రసభరితమైన,కళల హితమైన,శ్రేష్ఠమైన సాహిత్యం సృష్టించబడుతుందనే నమ్మకం నాది.

"సాగుబాటు" లోని ఫలవంతమైన సాహిత్యాన్ని ఎలా తూకం వెయ్యలేనో, అలాగే అందులోని సాహితీ హితవరులను త్రాసులో ఉంచలేను.

ఇందులోని అందరు నాకు ముఖ పరిచయస్తులని కూడ నేను చెప్పుకోవడం లేదు.

ఆ హితవరుల సహజమైన సాహిత్యం గురించే ఈ ఉల్లేఖనం అంతా!

జరసం 15 సంవత్సరాల ప్రయాణానికి మైలు రాయిగా తమ సంస్థ 'లోగో' తో అందంగా ముద్రించుకున్న 128 పేజీలు గల "సాగుబాటు" సంకలనం ఇది. ఇందులో 71 కవితలు,20 పాటలు,2 నానీలు,5 వ్యాసాలు గల సంపుటికి జరసం అధ్యక్షులు నక్క సురేష్ సంపాదకత్వం బాధ్యతను వహించారు.ఇందులో కవితలు, పాటలు,నానీలు,వ్యాసాలు అందించిన వారి సంఖ్యను మాత్రం ఇదమిద్దంగా తేల్చలేకున్నాను.ఎందుకంటే ఇందులోని కొందరు రైటర్స్ ఒకటికి మించి రెండు,మూడింటిలోను సాహిత్య సృజన,ప్రావీణ్యతను చాటగలగటం అభినందనీయం.

ఈ సాహితీ స్రవంతిలో మహిళా కవయిత్రుల సంఖ్య నామ మాత్రంగానే ఉందనిపించింది,ప్రోత్సాహించాల్సిన ఆవశ్యకతను గుర్తించాల్సివుంది జరసం పరంగా.

మరికొందరు రచయితలు, కవులయొక్క రచనలు ఇందులో కనిపించక పోవడం కాసింత వెలితిగా అనిపించిందని చెప్పగలను.

పుస్తకం ముందుమాటల్లో సాహితీ పెద్దలు వెలిబుచ్చిన అభిప్రాయంలోని పరమార్థాన్ని అర్థం చేసుకునేందుకు గాను,వాటిలోని సంక్షిప్త వాక్యాన్ని మళ్ళీ ఒకసారి మననం చేసుకోవడానికి ఇష్టపడుచున్నాను.

"అక్షరం అక్షరం కలిసి పదమై,పదం పదం కలిసి కవిత్వపు ప్రవాహమై పరుగులెత్తినపుడు ఎంత ఆనందం"

అంటారు.

– డా.లింగంపల్లి రామచంద్ర గారు.

వాస్తవమైన మాటను ఎంత హృద్యంగా చెప్పారండి మీరు ఇందులో.

"ఇక్కడ కలం పట్టిన ప్రతి రచయితకూ చైతన్య పూరితమైన వారసత్వం ఉంటుంది" అంటారు.

– కటుకోజ్వల ఆనందచారి గారు.

ఎంతైనా సోమన్న,పోతన్న ల వారస్త్వపు గడ్డ కదండి మరి!

"భిన్న భావజాలాల కవులు గేయ రచయితల 'సాగుబాటు' కవితా సంకలనం" అని అంటారు.

– పొట్లపల్లి శ్రీనివాసరావు గారు

భిన్నత్వంలో ఏకత్వమే కదండీ మన సాంస్కృతి.సాహిత్యంలోను ఇది సహజ లక్షణమైనదని అనుకుంటున్నాను.

ఈ ముగ్గురు ఉద్దండులు "సాగుబాటు" లోని మొదటి 'సాలు' నుండి చివరి 'సాలు' వరకు నిలచి నిలబడిన అక్షర దోవవెంట తిరిగి ఈ సంకలనానికి పరిమళాలు అద్దారు.

"ఇది ప్రజల మనోఫలకాలపై భావాలు వికసింప చేయడానికి,మస్తిష్కాల మాగాణిలో సమకాలీన సామాజిక అంశాలపై మరింత పదునెక్కిన కవిత్వంతో "సాగుబాటు"ను తీసుకువచ్చామని" సవినయంగా తెలియజేసారు జరసం అధ్యక్షులు

– నక్క సురేష్ గారు

అధ్యక్షులు,కార్యవర్గ సభ్యులు 'జరసం' ఆవిర్భావ పదిహేనవ వత్సరాన్ని సాహిత్య జగత్తులో నిలిపారుగా మరి మీరు.


ఈ "సాగుబాటు" యందు అనేకమంది సాహితీకారులను భాగస్వామ్యంచేసి కవితలు, పాటలు, నానీలు, వ్యాసాలతో ఈ సంకలనాన్ని పరిపుష్టం చేసిన "జరసం" తన పదిహేను సంవత్సరాల మైలురాయిగా పటిష్టమై నిలబడుతుంది.

జనగామ జిల్లా సాహితీ కారులందరి వద్ద ఉండాల్సిన పుస్తకం "సాగుబాటు"



రత్నాకర్ రావు

# డిజిటల్ మోసాలకు.. అప్రమత్తతే ఆయుధం



సైబర్ నేరాలు రూపాంతరం చెంది 'డిజిటల్ అరెస్ట్' పేరుతో దోపిడీ పీకు స్థాయికి చేరాయి.ఎంతగా అంటే? ఉన్నతవిద్యావంతులు, వ్యాపారవేత్తలు, ప్రజాప్రతినిధులు, చివరికి బ్యాంకు అధికారులు సైతం వారి వలలో పడి డబ్బులు కోల్పోయి విలవిలాడుతున్నారు. నేరగాళ్లు వ్యక్తిగత సమాచారాన్ని దొంగిలించి,మానసికంగా బెదిరిస్తూ బురిడీ కొడుతున్నారు.ఈ విధంగా డిజిటల్ అరెస్టుల ఘటనలు నానాటికి పెరుగుతున్నాయి.

ఇలాంటి పరిస్థితుల్లో సైబర్ నేరాలపై ప్రజాచైతన్యం,అవగాహన పెరగాలి.పోలీసులు ఎప్పుడూ వీడియో కాల్స్‌లో అరెస్టులు చేయరని, డబ్బులు బదిలీ చేయమని బెదిరించరని ప్రతి ఒక్కరూ గ్రహించాలి. ఎప్పటి కప్పుడు అప్రమత్తంగా ఉండటం అత్యవసరం. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు సైబర్ నేరాలపై ఉక్కు పాదం మోపాలి.

**అప్రమత్తతే ప్రజా ఆయుధం :**

మన దేశంలో జరుగుతున్న సైబర్ నేరాలు డిజిటల్ అరెస్టుల మోసాల తీవ్రత పరిశీలిద్దాం.. ఆధునిక టెక్నాలజీ మూలంగా డిజిటల్ యుగం మన జీవితంలో సౌలభ్యాన్ని తెచ్చింది. కానీ అదే సాంకేతికత ఇప్పుడు మోసాలకు, ఆర్థిక నష్టాలకు కారణమవుతోంది. వాస్తవంగా ఆధునిక టెక్నాలజీ సామాన్యుడి ప్రగతికి, జీవన విధానం మెరుగుదలకు తోడ్పడితేనే దానికి సార్థకత. ప్రస్తుతం దీనికి విరుద్ధంగా టెక్నాలజీని వాడుకొంటూ నేరాలకు పాల్పడుతున్నారు. అలా సైబర్ నేరాల కొత్త రూపమే డిజిటల్ అరెస్టులు.మనసులనూ, మనీని కూడా కబళిస్తోంది. ఇలాంటి మోసాలనుంచి మనం రక్షించుకునే ఆయుధం ఒక్కటే,అప్రమత్తత.

**మోసాల రూపం,విస్తృతి, ప్రభావం :**

ఇటీవలి కాలంలో దేశవ్యాప్తంగా సైబర్ నేరాలు భయానకర స్థాయికి చేరాయి. ముఖ్యంగా డిజిటల్ అరెస్ట్ పేరిట జరుగుతున్న మోసాలు వేగంగా విస్తరిస్తున్నాయి. ఖాకీ బట్టలు వేసుకొని వీడియో కాల్స్ చేస్తూ, "మీరు ఉగ్రవాదులతో సంబంధం కలిగారు", "మాదకద్రవ్యాల కేసులో పేరు వచ్చింది", "మనీలాండరింగ్‌లో పాలుపంచుకున్నారు" అంటూ భయపెట్టే ముఠాలు పౌరుల బ్యాంకు ఖాతాలను ఖాళీ చేస్తున్నాయి. జాతీయ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టులకు డిజిటల్ అరెస్టులపై 2022లో డిజిటల్ అరెస్ట్ మోసాలపై 39,925 ఫిర్యాదులు నమోదైతే, 2024లో అలాంటివి 1.23 లక్షలకు పెరిగాయి. బాధితులు కోల్పోయిన సొమ్ము విలువ రెండు సంవత్సరాల్లో 21 రెట్లు పెరిగింది. ఈ ఏడాది మొదటి రెండు నెలల్లోనే 17,718 కేసులు నమోదవడం చూస్తుంటే, నేరగాళ్ల ఎంతగా చెలరేగి పోతున్నారో అర్థం చేసుకోవచ్చు.ఉన్నత విద్యావంతులు, వ్యాపారవేత్తలు, రాజకీయ నాయకులు, బ్యాంక్ అధికారులు కూడా ఈ వలలో చిక్కుతున్నారు. నకిలీ గుర్తింపులు, ఫోర్జరీ పత్రాలు, వాయిస్ క్లోనింగ్, సాంకేతిక నైపుణ్యంతో ఈ ముఠాలు నేరాలను కొత్త రూపంలో తీవ్ర స్థాయికి తీసుకెళ్తున్నాయి. బాధితులు ఆర్థిక నష్టంతో పాటు మానసికంగా కూడా కృంగిపోతున్నారు.

ప్రత్యేకించి పెన్షనర్లు పెద్దగా ప్రభావితమవుతున్నారు. లైఫ్ సర్టిఫికెట్, పింఛన్ వెరిఫికేషన్ పేరిట వివరాలు సేకరించి మోసాలు చేస్తున్నారు. టెక్నాలజీ అవగాహన తక్కువగా ఉండటంతో వారు సులభంగా వలలో పడుతున్నారు.

**అవగాహనే ఆయుధం, కట్టడే కర్తవ్యము :**

ఈ డిజిటల్ మోసాలపై ప్రధాన ఆయుధం "అప్రమత్తత." ప్రభుత్వం, పోలీసులు, ప్రజలు ముగ్గురి సమన్వయం ద్వారానే మూలాలు గుర్తించి దీన్ని సమూలంగా అరికట్టవచ్చు.

**ప్రజల్లో అవగాహన :**

టీవీ, రేడియో, సోషల్ మీడియా ద్వారా డిజిటల్ అరెస్టులు చట్టంలో లేవు అనే సందేశాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలి.అపరిచిత నంబర్లనుంచి వచ్చే కాల్స్, వీడియో కాల్స్, OTPలు, ఆధార్ వివరాలు పంచకూడదు. బ్యాంకులు, ప్రభుత్వాల సమన్వయంతో బ్యాంకులు తమ వినియోగదారులకు కాలానుగుణంగా సైబర్ సేఫ్టీ అలర్ట్స్ పంపాలి. ప్రభుత్వ సంస్థలు ప్రజా స్థాయిలో సైబర్ అవగాహన శిబిరాలు నిర్వహించాలి. చట్టపరమైన చర్యలు.. సైబర్ మోసగాళ్లపై కఠినమైన శిక్షలు విధిస్తూ, వారి ఆర్థిక లావాదేవీలను తక్షణం ఫ్రీజ్ చేసే చట్టపరమైన విధానాలు రూపొందించాలి. సిబిఐ, సైబర్ సెక్యూరిటీ ఏజెన్సీలు కలిసి విభిన్న రాష్ట్రాల్లో జరిగిన కేసులను సమగ్రంగా దర్యాప్తు చేయాలి.

**ప్రతి పౌరుని బాధ్యత. :**

మోసానికి గురైన వెంటనే డయల్ 1930 లేదా 100 కు సమాచారం ఇవ్వాలి.గుర్తు తెలియని లింకులు క్లిక్ చేయకూడదు. వాట్సాప్ లేదా మెయిల్ ద్వారా వచ్చిన APK ఫైళ్లను తెరవకూడదు. సాంకేతిక సదుపాయాలు ఎంత పెరిగినా, మన జాగ్రత్తే చివరి రక్షాకవచం. "డిజిటల్ అప్రమత్తత" అనే ఈ సంస్కృతి ప్రతి ఇంటి నుంచి మొదలవ్వాలి.

సైబర్ నేరాలు యుద్ధం మాదిరిగా మారుతున్నాయి. కానీ ఆయుధం అవసరం లేదు.అవగాహన, అప్రమత్తత, ధైర్యం చాలు. ప్రజలు తమ వ్యక్తిగత సమాచారం కాపాడుకుంటే, ప్రభుత్వాలు కఠినంగా వ్యవహరిస్తే, ఈ మోసాలు ము గుస్తాయి.

డిజిటల్ మోసాలపై అప్రమత్తతే అసలైన రక్షణ.



మేకిరి దామోదర్
సామాజిక విశ్లేషకులు
వరంగల్ 9573666650

# కామ్రేడ్ షేక్ బుడే

*నవంబర్ 4న పముఖ మార్క్సిస్టు- లెనినిస్టు నాయకుడు కామ్రేడ్ షేక్ బుడే 37వ వర్ధంతి.*



చిత్తశుద్ధి కలిగిన ప్రముఖ మార్క్సిస్టు – లెనినిస్టు నాయకుడు కామ్రేడ్ షేక్ బుడే1988 నవంబర్ 4వ తేదీన గుండెపోటుతో గుంటూరులో సుమారు 60 సంవత్సరాల వయస్సులో మరణించారు. పేద శ్రామిక కుటుంబంలో జన్మించి న కామ్రేడ్ షేక్ బుడే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మార్క్సిస్టు–లెనినిస్టు చరిత్రలో ప్రముఖ పాత్ర వహించారు. మార్క్సిజం– లెనినిజం –మావో ఆలోచనా విధానాన్ని మనసారా నమ్మిన కార్యకర్త ఆయన.ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ నుండి సభ్యుడిగా కొనసాగిన కామ్రేడ్ షేక్ బుడే కమ్యూనిస్టు ఉద్యమ చీలికల్లో మార్క్సిస్టు పార్టీ వైపు నిలిచారు. గుంటూరు నగరంలో మార్క్సిస్టు కమిటీలోనూ, మార్క్సిస్టు–లెనినిస్టు కమిటీ లోనూ ప్రముఖ బాధ్యతలు నిర్వహించారు. జూట్ మిల్లు, సిటీ బస్సు, బిఎటి టుబాకో కార్మికుల, రైస్ మిల్లు కార్మికుల సమస్యలపై పని చేశారు.1964 ప్రాంతంలో గుంటూరు నగరంలో చైన్ బ్యాచ్ పేరుతో రౌడీ మూకలు చెలరేగుతుండేవారు. మార్క్సిస్టు కమ్యూనిస్టుపార్టీ నాయకత్వాన యువకులను కూడ గట్టి ఆ రౌడీ మూకల యొక్క దాడులను తిప్పి కొట్టి గుంటూరు నగరంలో ప్రశాంతతకు కారణమయ్యాడు. ఆ సందర్భంగా కామ్రేడ్ బుడేని టైగర్ బుడేగా ప్రజలు కొనియాడారు.

నక్సల్బరి పోరాట వెలుగులో, సిద్ధాంత చర్చ జరిగినప్పుడు, మార్క్సిస్టు పార్టీలో చీలిక వచ్చినప్పుడు కామ్రేడ్ షేక్ బుడే, సిపిఐ (ఎం.ఎల్) పార్టీ వైపు నిలబడ్డాడు. శ్రీకాకుళ గిరిజన రైతాంగ పోరాటం తీవ్ర రూపం దాల్చినప్పుడు కామ్రేడ్ షేక్ బుడే ఆ పోరాటానికి అండగా నిలబడ్డాడు.కామ్రేడ్ చారు మజుందార్ గుంటూరు జిల్లాకు వచ్చి గుత్తికొండ, గుహలలో సమావేశం నిర్వహించినప్పుడు ఆ సమావేశంలో కామ్రేడ్ షేక్ బుడే పాల్గొని రాష్ట్ర కమిటీ సభ్యునిగా ఎన్నికై విశాఖపట్నం జిల్లా గిరిజన ప్రాంతంలో పనిచేయటానికి బాధ్యతలు తీసుకున్నాడు. విశాఖపట్నం ఏజెన్సీ ప్రాంతంలో పనిచేస్తున్నప్పుడు పోలీసులకు చిక్కి తీవ్ర చిత్రహింసలకు గురయ్యాడు. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన పార్వతీపురం కుట్ర కేసులో కామ్రేడ్స్ కొల్లా వెంకయ్య, కానూ సన్యాల్, నాగభూషణం పట్నాయక్, భువనమోహన్ పట్నాయక్, హసైనార్, సికె నారాయణ రెడ్డి, తదితరులతో కలిసి విశాఖపట్నం జైలులో నిర్భందించబడ్డాడు. 1969 అక్టోబర్‌లో విశాఖపట్నం జైలు గోడలను ఛేధించుకొని బయటపడ్డ కమ్యూనిస్టు విప్లవ కారులలో నాగభూషణం పట్నాయక్, డాక్టర్ దేవినేని మల్లికార్జునుడు, ఆదిభట్ల కైలాసం, డాక్టర్ ఎమ్.ఎల్. నారాయణ, సనక మహా నంద మునులు, పంచాది కృష్ణమూర్తి, పురుషోత్తంపాళి తదితరులలో కామ్రేడ్ బుడే కూడా ముఖ్యుడు. జైలు గోడలను చేదించుకొని బయటపడ్డ తర్వాత పీడిత ప్రజల మధ్య పనిచేస్తున్న క్రమంలో ఒక ద్రోహి ఇచ్చిన సమాచారంతో పొన్నూరు పక్కన మాచవరం దగ్గర పోలీసుల చేతికి చిక్కాడు. గుంటూరు జిల్లాలో చందవరం ,తలార్లపల్లి కేసుల్లో ఇరికించబడ్డాడు. వినుకొండ, నరస రావుపేట, గుంటూరు పోలీస్ క్లబ్బుల్లో మొదలగు స్టేషన్ లలో నిర్భందించి నెల రోజులకు పైగా తీవ్రమైన చిత్ర హింసలకు గురి చేశారు. మొక్కవోని విప్లవదీక్ష కలిగినటువంటి కామ్రేడ్ షేక్ బుడే పార్టీ రహస్యాలను కాపాడటంలో విప్లవ మార్క్సిస్టు చైతన్యాన్ని ప్రదర్శించాడు. శాసనమండలిలో ఈ విషయమై గుంటూరుకు చెందిన సిపిఐ శాసనమండలి సభ్యుడు కామ్రేడ్ కనపర్తి నాగయ్య శాసన మండలిలో ఈ విషయాన్ని లేవనెత్తాడు. తప్పనిసరి పరిస్థితుల్లో షేక్ బుడే బ్రతికి ఉన్నాడని, అరెస్టు చేశామని శాసనమండలిలో ప్రభుత్వం చెప్పక తప్పలేదు.

పార్వతీపురం కుట్ర కేసు విచారణ అనంతరం కామ్రేడ్ షేక్ బుడే విడుదలయ్యారు. కొద్ది కాలానికి 1975 జూన్‌లో అత్యవసర పరిస్థితి విధించబడింది. అత్యవసర పరిస్థితి కాలమంతా రాజమండ్రి, సికింద్రాబాద్ జైలులో రాజకీయ డెటిన్యూగా నిర్బంధించబడ్డారు. జైలు నుండి విడుదలైన తరువాత అమరజీవి కామ్రేడ్ కొల్లా వెంకయ్య నాయకత్వాన మార్క్సిస్టు–లెనినిస్టు పార్టీలనూ, గ్రూపులను సూత్రబద్ధమైన విప్లవ సిద్ధాంతం పై విప్లవ కమ్యూని స్టులను ఐక్యం చేయుట కొరకు కామ్రేడ్ కొల్లా వెంకయ్య ఏర్పాటు చేసినటువంటి మార్క్సిస్ట్ – లెనినిస్టు కమిటీ (ఆంధ్ర ప్రదేశ్) లో కామ్రేడ్ బుడే ముఖ్య బాధ్యతలు నిర్వహించాడు. గుంటూరు, ప్రకాశం జిల్లాల గ్రామీణ పేదల సంఘం నిర్మాణంలోనూ, నల్లమడ రైతు సంఘం ముంపు నివారణ కొరకు జరిపిన ఉద్యమంలోనూ, పెదవడ్లపూడి హై– లెవెల్ ఛానల్ రైతాంగ ఆందోళనలోనూ, కొప్పుకొండ, రేటూరు, సంతరావూరు, చందలూరు, గ్రామాల సీలింగ్ భూముల విషయంలోనూ నిజాంపట్నం మాజీ సైనికులు తమ యొక్క భూములు కొరకు జరిపిన పోరాటం విషయంలోనూ , ముఖ్య ఘట్టాలన్నిటా కామ్రేడ్ షేక్ బుడే వివిధ గ్రామాలకు వెళ్లి పోరాట ఆందోళనలు రూపుదిద్దటములో ప్రముఖ పాత్ర వహించాడు.మొత్తం పోరాటంలో ఐదు సంవత్సరాలకు పైగా జైలు జీవితం అనుభవించిన కామ్రేడ్ షేక్ బుడే ఆరోగ్య సమస్యలు ,ఆర్థిక ఇబ్బందులు వెంటాడినప్పటికీ వాటిని అధిగమించిన కామ్రేడ్ షేక్ బుడే చూపినటువంటి విప్లవోద్యమ దీక్ష, పట్టుదల అనుభవములో చూసిన కార్యకర్తలూ ఆచరణలో చూసిన పేద ప్రజానీకం మరువజాలరు.

కొల్లిపర వెంకటేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి.
సిపిఐ (ఎం.ఎల్) రెడ్ స్టార్, ఆంధ్ర ప్రదేశ్ కమిటీ.,
939 232 5652

## ఆది జనారణ్యా...!!

పెద్ద అడవి
కి కారణ్యం
కన్నుపొడుచుకున్నా
కానీరాని అంధకారం.
క్రూరమృగాలు
భయంకర జంతువులు
కళ్ళలో ఆకలి. క్షుద్బాధ
దాహం తీర్చుకోవాలని
కడుపు నింపుకోవాలిని తపన.
దాని కోసమే వాటి వేట
అయినా భయం వేయలేదు
ప్రాణమే తీసుకుంటుందన్న నమ్మకం
కాని
పట్టపగలు కలెక్టరేట్లో
పదిమంది తిరిగే చోటు
ఎండ వెలుగు మాటల హెూరు
అది జనారణ్యం
మానవ సమూహం
నాగరిక సమాజం
కంప్యూటర్ కాలం
అయినా
ఏ మాత్రం జంకు.బిడియం లేకుండా
సిగ్గు.శరం లేకుండా. నిర్లజ్జగా
అవకాశం దొరికితే
అందరి స్త్రీల శీలాల్ని
మానాల్ని. శరీరాల్ని మింగేద్దామని
కసిదీరా. కసాయిగా నలిపేద్దామని
అసహ్యమైన
అసభ్యకరమైన కామపు చూపులు
అవకాశం కోసం
కాసుకొని
కసాయి చూపులని
వాని కళ్ళను శరీరాన్ని
రక్తం చిమ్మేలా
పొడిచి పొడిచి పెట్టాలనుంది

డా. అరూరి రంజిత్ కుమార్
అధ్యాపకులు
చరిత్ర విభాగము
ఆర్ట్స్, సైన్స్ కళాశాల సుబేదారి

(హనుమకొండ కలెక్టరేట్ కార్యాలయంలో మహిళలపై సంఘటనకు స్పందిస్తూ)

# సమస్యలు పరిష్కరించకపోతే పోరుబాట

• ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగళి శ్రీపాల్ రెడ్డి

**నంగునూరు, నవంబర్ 4 (జనం సాక్షి) :** ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చకుంటే పోరుబాట తప్పదని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగళి శ్రీపాల్ రెడ్డి స్పష్టం చేశారు. పీ ఆర్ టీ యూ టీ ఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమితులైన వంగ మహేందర్ రెడ్డి అభినందన సభ సోమవారం రాత్రి సిద్ధిపేటలోని పీ ఆర్ టీ యూ భవన్ లో జరిగింది. పీ ఆర్ టీ యూ టీ ఎస్ సిద్ధిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి అదరాసుపల్లి శశిధర శర్మ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పింగళి శ్రీపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ రెండున్నర దశాబ్దాలుగా ఉపాధ్యాయులకు నిరంతరం సేవ చేస్తున్న యువ నాయకుడు వంగ మహేందర్ రెడ్డి సేవలు పీఆర్టీయూ టీఎస్ సంఘానికి ఉపయోగించుకోవడానికి అధికార ప్రతినిధిగా నియమించినట్లు తెలిపారు. గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో వంగ మహేందర్ రెడ్డి ఓటమి పాలైనప్పటికీ ప్రజాస్వామ్య స్ఫూర్తితో నిరంతరం ఉపాధ్యాయులకు పాఠశాలలకు సేవలందించడం అభినందనీయమని తెలిపారు. గత ఎన్నికల ప్రచారంలో ఉపాధ్యాయుల పెండింగ్ డీఏలు మూడు నెలల్లోపు చెల్లిస్తామని, సీపీఎస్ రద్దు చేస్తామని,హెల్త్ కార్డులు మంజూరు చేస్తామని, నెలలోపు అన్ని హామీలు నెరవేరుస్తామని మేనిఫెస్టోలో పొందుపరిచారని తెలిపారు. కొత్త ప్రభుత్వానికి సమయం ఇవ్వాలని రెండు సంవత్సరాలు వేచి చూశామని చెప్పారు.డిసెంబర్ 9 లోపు ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చకుంటే పీఆర్టీయూటీఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున




ఉద్యమాన్ని నిర్మిస్తామని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యోగుల జేఏసీ, పీ ఆర్ టీ యూ సంఘాలకు ఇచ్చిన మాట ప్రకారం కనీసం నెలకు రూ.700 కోట్లు ప్రభుత్వం విడుదల చేయకపోవడం విచారకరమని చెప్పారు. డిసెంబర్ 9వ తేదీ లోపు పెండింగ్ బిల్లులన్నీ చెల్లించి సమస్యలు పరిష్కరించాల్సిందే అన్నారు.

### పీఆర్టీయూకు ప్రాథమిక సభ్యులే అధిష్టానం

శాసనమండలిలో 40 మంది ఎమ్మెల్సీలలో 39 మంది ఎమ్మెల్సీలు వివిధ పార్టీలకు చెందిన వారేనని ఎమ్మెల్సీ పింగళి శ్రీపాల్ రెడ్డి తెలిపారు. ఎమ్మెల్సీలు కూడా పార్టీల కండువాలు కప్పుకొని ఉపాధ్యాయుల గొంతుకను వినిపించలేని దుస్థితి నెలకొందన్నారు. ఉపాధ్యాయుల పక్షాన తాను నిలబడుతున్నానని చెప్పారు. ఉపాధ్యాయుల సమస్యలే తన ఎజెండా అన్నారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించి ప్రభుత్వ విద్యా వ్యవస్థను రక్షించడమే తన ఏకైక లక్ష్యమని శ్రీపాల్ రెడ్డి ప్రకటించారు. నిజాయితీతో ఉపాధ్యాయులకు సేవ చేయాలని ఆలోచనలు వంగ మహేందర్ రెడ్డిని భవిష్యత్తులో శాసనమండలి సభ్యునిగా ఎన్నుకోవాలని శ్రీపాల్ రెడ్డి పిలుపునిచ్చారు. పీ ఆర్ టీ యూ టీ ఎస్ అధికార ప్రతినిధి వంగ మహేందర్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికలలో గెలుపోటములు సహజం అన్నారు. తను ఓటమి పాలైనా పీఆర్టీయూ తనకు దిశ, ఉపాధ్యాయుల సేవే తన లక్ష్యమని తెలిపారు. పీ ఆర్ టీ యూ రాష్ట్ర అధికార ప్రతినిధిగా అవకాశం కల్పించిన గౌరవ శాసనమండలి సభ్యులు పింగిలి శ్రీపాల్ రెడ్డి, రాష్ట్ర శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పుల్గం దామోదర్ రెడ్డి, సుంకరి బిక్షం గౌడ్ లకు మహేందర్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. పీ ఆర్ టీ యూ టీ ఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమితులైన వంగ మహేందర్ రెడ్డిని ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి చేతుల మీదుగా గజమాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ టీఎస్ సిద్ధిపేట జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి అదరాసు పల్లి శశిధర శర్మ, రాష్ట్ర ఆడిట్ కమిటీ చైర్మన్ సోమిరెడ్డి శ్రీనివాసరెడ్డి, పత్రిక సంపాదక వర్గ సభ్యురాలు లక్కిరెడ్డి విజయ, సోషల్ మీడియా సిద్ధిపేట జిల్లా కోఆర్డినేటర్ నీరడి లక్ష్మీనారాయణ, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు ముత్యాల సురేందర్ రెడ్డి, హన్మారెడ్డి, ఆస లక్ష్మణ్, పన్యాల శ్రీనివాస్ రెడ్డి, నీలం శ్రీనివాస్, మాలతి, కత్తుల బాపురెడ్డి, నర్సింహారెడ్డి, నాజిం బాబా వివిధ మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వంగ వెంకట్రాంరెడ్డి, దశరథం, పార్థసారథి, రవీందర్ రెడ్డి, బొల్లం రాజశేఖర్, నర్ర రామచంద్రారెడ్డి, కూరెళ్ళ శ్రీనివాసరెడ్డి, మురికి రాజిరెడ్డి నర్సింలు ఎర్రవెల్లి శ్రీనివాస్ రెడ్డి, పల్లె శ్రీనివాస్ గౌడ్, కేవీఎన్ రెడ్డి, వెంకటేశ్, చంద్రారెడ్డి, మహాదేవ రాజ్, మల్లారెడ్డి, వేణు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి



**యాచారం, నవంబర్ 4 (జనం సాక్షి) :** ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో నాణ్యత ప్రమాణాలు పకడ్బందీగా ఉండాలని ఎంపీడీవో రాధా రాణి చెప్పారు. మంగళవారం మండల పరిధిలోని మల్కిజ్ కూడా గ్రామపంచాయతీలో వివిధ స్థాయిల్లో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను అధికారులతో లబ్ధిదారులతో కలిసి పరిశీలించారు. ఇళ్ల నిర్మాణ ప్రక్రియను వేగవంతం చేయాలని చెప్పారు. ఇళ్ల నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు లోపించకుండా ఉండేలా అధికారులు పనుల్ని పర్యవేక్షించాలన్నారు. నిల నిర్మాణంలో ఉపాధి హామీ పథకం ద్వారా ఇండ్ల నిర్మాణంలో భాగంగా ఇండ్ల వద్ద ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని చెప్పారు. ఇంకుడు గుంతల నిర్మాణంతో మరింత ఉపయోగం కలగనున్నట్లు చెప్పారు. అనంతరం నర్సరీని నర్సరీని పరిశీలించారు. నర్సరీలో మొక్కల పెంపకం పట్ల మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పంచాయతీ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు.

## కులమతాలకతీతంగా ఉర్సు ఉత్సవాలు నిర్వహించుకోవాలి

• ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్



**కుత్బుల్లాపూర్, నవంబర్ 4 (జనం సాక్షి) :** ఉర్సు ఉత్సవాలు కుల మతాలకతీతంగా ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని బిఆర్ఎస్ ఎల్పి విప్.ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ సూచించారు. చింతల్ డివిజన్ హెచ్.ఎం.టీ హజరత్ జిందాషా మదార్ దర్గా లో ఈనెల 9 నుంచి రెండు రోజుల పాటు నిర్వహించనున్న ఉర్సు ఉత్సవ వేడుకల గోడపత్రికను కమిటీ సభ్యులతో కలిసి క్యాంప్ కార్యాలయంలో ఆయన ఆవిష్కరించారు. దర్గాకు వచ్చే వారికి ఇబ్బంది కలగకుండా సౌకర్యాలు కల్పించాలని కమిటీ సభ్యులకు సూచించారు. తన సహాయ సహకారాలు అందజేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో దర్గా కమిటీ అధ్యక్షులు ఎండి.అబ్దుల్ ఖాదీర్,సభ్యులు ఎండి. రియాజ్,బాబుమియా, ఎండి.రషీద్,గౌస్ భాయ్, కాశిఫ్,చాంద్,షేక్ అలీ తదితరులు పాల్గొన్నారు.

## సైబరాబాదులో మాదకద్రవ్యాల కేసులో 11 మంది అరెస్ట్

• పలువురి పరారీ



**శేరిలింగంపల్లి, నవంబర్ 4 (జనంసాక్షి) :** సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మాదకద్రవ్యాల సరఫరా ఘటనలో పోలీస్ అధికారులు 11 మందిని అరెస్టు చేసినట్లు తెలిసింది. మాదాపూర్ డిసిపి వెల్లడించిన వివరాల ప్రకారం... గచ్చిబౌలి పరిధిలోని టీఎన్జీవో కాలనీ పరిధిలో ఎస్ఎం లగ్జరీ గెస్ట్ రూమ్, కో-లివింగ్ లయందు సోమవారం దాడులకు పాల్పడి ప్రత్యక్షంగా మదకద్రవ్యాలను సేవిస్తున్న వారితోపాటు వాటిని విక్రయిస్తున్న విక్రయితలను సైతం పోలీసులు అదుపులోకి తీసుకోవడం విధితమే. ఈ ఇల్లీగల్ కార్యక్రమంలో భాగస్వామ్యం ఉన్న 11 మందిని ఎన్డిపిఎస్ చట్టం కింద అరెస్టు చేయడం జరిగింది. అరెస్ట్ అయిన వారిలో గుత్తా తేజ కృష్ణ, షాజీర్ మోటోంగారా, వెన్నెల రవి కిరణ్ అలియాస్ భాను, పాకనతి లోకేష్ రెడ్డి, మన్నె వెంకట ప్రశాంత్, పృధ్వి విష్ణువర్ధన్ అలియాస్ విష్ణు, కర్లపూడి ప్రెస్లీ సుజిత్, మేకల గౌతం, గుండెబోయిన నాగరాజు అలియాస్ నాగార్జున అలియాస్ అర్జున్, గుంటక సతీష్ రెడ్డి అలియాస్ సతీష్ ఉండగా ఇద్దరు అన్నోన్ నైజీరియన్ పర్సన్స్, వినయ్ లక్ష్మణ్ రిజ్వాన్ కార్తీక్ వంశీ హర్ష పరారీలో ఉన్నట్లు తెలిసింది. వీరి వద్దనుండి 32.14 గ్రాముల ఎండిఎంఏ, 4.67 గ్రాముల గంజాయి, 6 మొబైల్ ఫోన్లు, రెండు ద్విచక్ర వాహనాలు, 10 వేల రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నట్లు డిసిపి వివరించారు.

## 72 గంటల్లోనే హత్య కేసు ఛేదించిన వనపర్తి పోలీసులు

**వనపర్తి బ్యూరో, నవంబర్ 4 (జనం సాక్షి) :** 72 గంటల్లోనే హత్య కేసును చేదించి, శభాష్ అనిపించుకున్న వనపర్తి పోలీసులు.హత్య కేసు కు సంబంధించిన వివరాలను మంగళవారం నాడు జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వనపర్తి ఎస్పీ రావుల గిరిధర్ వెల్లడించారు.వనపర్తి పట్టణ పోలీస్టేషన్ పరిధిలోని పానుగల్ రోడ్డు గణేష్ నగర్ కు చెందిన నాగమణి,ప్రియుడు శ్రీకాంత్ లను హత్య కేసులో నిందితులుగా గుర్తించారు. ప్రియునితో కలిసి ఆమె భర్తను అక్టోబర్ 25వ తేదీన రాత్రి సమయంలో మద్యంతో మత్తెక్కించి, కూలర్ తాడు సహాయంతో కురుమూర్తిని,గొంతు బిగించి హత్య చేసి, సెల్ఫ్ డ్రైవింగ్ కారును అద్దెకు తీసుకుని, శ్రీశైలం ప్రాజెక్టు సమీపంలో శవాన్ని పడేసి, అనుమానం రాకుండా వనపర్తి పట్టణ పోలీస్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదు చేశారు. కానీ పోలీసుల క్షుణ్ణ దర్యాప్తు, టెక్నికల్ సాక్ష్యాలు, సీసీటీవీ ఆధారాలతో నిందితులు దొరికిపోయారు.నేరం ఎంత చాకచక్యంగా చేసినా నిజం బయటపడుతుందనే విషయం ప్రతి ఒక్కరు గుర్తుంచుకోవాలి. ఈ కేసును చేదించడంలో కీలకపాత్ర పోషించిన,వనపర్తి సీఐ,



కృష్ణయ్య, వనపర్తి పట్టణ ఎస్సైలు, హరిప్రసాద్, శశిధర్, చిన్నంబావి ఎస్సై, జగన్,ఎస్పీకార్యాలయం ఎస్సై, రాము, మరియు పోలీసుకానిస్టేబుళ్లు, నవీన్ గౌడ్, అభిషేక్ లను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి నగదు రివార్డులు అందజేశారు.ఈ సమావేశంలో వనపర్తి డిసిఆర్బి డిఎస్పి, ఉమామహేశ్వరరావు, వనపర్తి డిఎస్పి, వెంకటేశ్వరరావు, వనపర్తి సిఐ, కృష్ణయ్య, వనపర్తి పట్టణ ఎస్సైలు, హరిప్రసాద్, శశిధర్, ఎస్పీ కార్యాలయం ఎస్సై, రాము, పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## జర్నలిస్టుల సంక్షేమానికి టిడబ్ల్యూజేఎఫ్ కృషి

• రాష్ట్ర కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్

**హైదరాబాద్, నవంబర్ 4 (జనంసాక్షి) :** జర్నలిస్టుల సంక్షేమానికి తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్) కృషి చేస్తుందని రాష్ట్ర కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్ అన్నారు. మంగళవారం జీడిమెట్ల పరిధిలోని లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం వద్ద ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ 75వ ఆవిర్భావ దినోత్సవాలను పురస్కరించుకొని ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని జర్నలిస్టులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యలపై చిత్తశుద్ధితో కృషి చేసేది తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ మాత్రమేనని అన్నారు. ఏ రాజకీయ పార్టీలకు అనుబంధంగా లేకుండా ఒక స్వతంత్ర వ్యవస్థలాగా జర్నలిస్టు ఫెడరేషన్ పనిచేస్తుందని అన్నారు. కుత్బుల్లాపూర్ లోని జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ప్రణాళిక బద్ధంగా టిడబ్ల్యూజేఎఫ్ పాటుపడుతుందని ఆయన అన్నారు. రాష్ట్రంలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్



జాతీయ స్థాయిలో ఐఎఫ్‌డబ్ల్యుజె యూనియన్‌కు అనుబంధంగా కొనసాగుతుందని అన్నారు. అనంతరం ఐఎఫ్ డబ్ల్యు జె 75వ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని కేకులు కట్ చేసి జర్నలిస్టులు పరస్పరం తినిపించారు. ఈ కార్యక్రమంలో టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా నాయకులు దామెర జగదీశ్వర్ గుప్తా, గడ్డమీది అశోక్, కుత్బుల్లాపూర్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు శంకర్, గోవిందరావులు ప్రసంగించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో జర్నలిస్టులు పాల్గొన్నారు.

## జానపద ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ




**మల్కాజిగిరి, నవంబర్ 4 (జనంసాక్షి) :** ప్రజానాట్యమండలి తెలంగాణ రాష్ట్ర మూడవ మహాసభల సందర్భంగా నిర్వహించనున్న జానపద ఉత్సవాల పోస్టర్, బ్రోచర్‌ను ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో నేరెడ్ మెట్ లోని డాక్టర్ బిఆర్. అంబేద్కర్ భవనం లో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రజానాట్యమండలి రాష్ట్ర సహాయ కార్యదర్శి కొండూరు భాస్కర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో జానపద కళలకు ప్రత్యేకత ఉందని, ఈ కళారూపాలను ప్రోత్సహించేందుకు జానపద ఉత్సవాలను నిర్వహించడం గొప్ప కార్యక్రమమని కొనియాడారు. ప్రజానాట్యమండలి ఆనాటి కాలం నుండి నేటి వరకు ప్రజలను చైతన్యవంతులను చేస్తూ, ఎన్నో ఉద్యమాలు, పోరాటాలకు తన కలాన్ని, గళాన్ని ఉపయోగించిందని పేర్కొన్నారు. పీడిత ప్రజల విముక్తి, ప్రజా సమస్యల పరిష్కారం కోసం, నేటి కార్పొరేట్ వ్యవస్థకు వ్యతిరేకంగా నాటకాలు, నృత్యరూపకాల ద్వారా ప్రజా బాధలు, కష్టసుఖాలను ప్రదర్శిస్తోందని వివరించారు, ప్రజానాట్యమండలి మహాసభల్లో కొత్త కార్యక్రమాలకు శ్రీకారం చుట్టి, భవిష్యత్తులో అనేక రకాలుగా కొత్త రూపాంతరం చెందబోతోందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రజాతంత్ర ఉద్యమ నాయకులు లక్ష్మణ్, అడ్వకేట్ రవి,రాష్ట్ర కమిటీ సభ్యులు మల్లెల రాము, టీవైఎఫ్ఐ జిల్లా నాయకులు శ్రీనివాస్, అంబేద్కర్ యువజన సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## 2026లో ప్రో రెజ్లింగ్ లీగ్ పునరాగమనం

• రెజ్లింగ్‌లో విప్లవం కోసం ఐపీఎల్ తరహా ప్రణాళిక

**ఖైరతాబాద్, నవంబర్ 4 (జనం సాక్షి) :** భారత క్రీడా రంగంలో కీలక అడుగు పడిందని భారత రెజ్లింగ్ సమాఖ్య(డబ్ల్యూఎఫ్ఐ) అధ్యక్షుడు సంజ య్ కుమార్ సింగ్ తెలిపారు. 2019లో చివరి సారి గా జరిగిన ప్రో రెజ్లింగ్ లీగ్, 2026 జనవరి మధ్య లో 'ప్రో రెజ్లింగ్ లీగ్(పీడబ్ల్యూఎల్)-2026' పేరుతో తిరిగి రానుందని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మంగళవారం డబ్ల్యూఎఫ్ఐ మాజీ అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ ముఖ్య అతిథిగా హాజరై ఈ



నూతన అధ్యాయాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. భారత రెజ్లర్లకు ప్రపంచ వేదికను అందించడం, ఒలింపిక్ కలలను సాకారం చేయడం, భారత రెజ్లింగ్‌లోని 'మాతృ శక్తి'కి సాధికారత కల్పించడం ఈ లీగ్ లక్ష్యం అన్నారు. లింగ సమానత్వానికి ఈ లీగ్ పెద్ద పీట వేస్తుందన్నారు. అగ్రశ్రేణి భారత రెజ్లర్లతో పాటు రష్యా, కజకిస్తాన్ క్రీడాకారులు పోటీ పడతారని తెలిపారు. లీగ్ ఛైర్మన్ దయాన్ ఫరూఖీ మాట్లాడుతూ ఇది ఫ్రాంచైజీ ఆధారిత వ్యవస్థ అని, ప్రైవేట్ సంస్థలు, పెట్టుబడి దారులు జట్లను సొంతం చేసుకునేలా వేదికను సృష్టిస్తున్న ట్లు తెలిపారు. సీఈఓ అఖిల్ గుప్తా మాట్లాడుతూ రెజ్లర్లకు ఆర్థిక స్థిరత్వంతో పాటు దేశం కోసం పత కాలు గెలవడంపై దృష్టి పెట్టేలా చూస్తామన్నారు. లీగ్ ముఖ్య కార్యాచరణ అధికారి సుమిత్ మాట్లాడుతూ త్వరలోనే పూర్తి షెడ్యూల్ ఫ్రాంచైజీ, క్రీడాకారుల వివరాలను ప్రకటిస్తామని తెలిపారు.

## ప్రజలకు సేవలు అందించినప్పుడే గుర్తింపు..



**మొయినాబాద్, నవంబర్ 4 (జనం సాక్షి) :** ఉద్యోగరీత్యా ప్రజలకు సక్రమంగా విధులు నిర్వహిస్తూ సేవలందించినప్పుడే ప్రజలు ఉద్యోగులను గుర్తిస్తారని మొయినాబాద్ మున్సిపల్ కమిషనర్ కాజా ముయుజుద్దీన్ అన్నారు. మొయినాబాద్ మున్సిపల్ పరిధిలో వార్డ్ ఆఫీసర్ గా పనిచేసిన వెంకయ్య శంకర్ పల్లి కి బదిలీ కావడంతో ఆయనకు మన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మొయినాబాద్ మండలంలో లో పంచాయతీ కార్యదర్శిగా మూడు సంవత్సరాలుగా పనిచేసిన వెంకయ్యను మొయినాబాద్ మున్సిపల్ కావడంతో మున్సిపల్ వాడు అధికారిగా సంవత్సరం పాటు విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన శంకర్పల్లికి బదిలీ కావడంతో సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కాజా మొయిజుద్దీన్ పాల్గొని సిబ్బందితో కలిసి అధికారులతో కలిసి సన్మానాన్ని నిర్వహించి ఆయన మాట్లాడుతూ ఉద్యోగరీత్యా ప్రజలకు సేవలు అందించిన వారిని అధికారిగా గుర్తిస్తూ ఎన్నటికీ మర్చిపోలేరని తెలిపారు. అందులో భాగంగా వెంకయ్య చేసిన సేవలు ప్రజలకు మర్చిపోలేక ఉంటాయని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఇ చిరంజీవిలు, వార్డ్ ఆఫీసర్ జమీల్ అమర్ నరేందర్ సంధ్యారాణి, శ్రీనివాసరావు, సుదర్శన్ వెంకటేశ్వర రెడ్డి, కుమార్, అశోక్ వెంకటేశం బిల్ కలెక్టర్ శ్రావణ్ కుమార్, రాజేష్, రజిత మాధవి, రాణి, కంప్యూటర్ ఆపరేటర్స్ రాఘవేందర్, శేఖర్, మహేందర్, మల్లేష్, వీరేష్, నరేష్, ఆదోని అనార్, సుధాకర్ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదాలను నివారించడంలో అధికారులు, ప్రభుత్వం విఫలం

• సిపిఐ జిల్లా కార్యదర్శి ఈ. ఉమామహేష్

**కుత్బుల్లాపూర్, నవంబర్ 4 (జనం సాక్షి) :** ఘోర రోడ్డు ప్రమాదాల నివారించడంలో అధికారులు, ప్రభుత్వం ఘోరంగా విఫలమైందనివ సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ అన్నారు. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల పరిధిలోని మీర్జాగూడ గేటు వద్ద సోమవారం ఉదయం జరిగిన బస్సు ప్రమాదంలో మృతి చెందిన వారికి మంగళవారం సిపిఐ కుత్బుల్లాపూర్ మండల సమితి ఆధ్వర్యంలో రంగారెడ్డి నగర్ డివిజన్ పరిధి, గాంధీనగర్ ఏఐటీయూసీ కార్యాలయ ప్రాంగణంలో వారి చిత్రపటాలకు నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ కొద్ది రోజుల్లోనే బస్సు ప్రమాదాలు జరగడం అందులో మృతుల సంఖ్య ఎక్కువగా ఉండడం సమాజాన్ని కలిచి వేస్తుందని విచారం వ్యక్తం చేశారు. ప్రమాదం జరిగిన సమయంలో ప్రజా ప్రతినిధులు,అధికారులు హడావుడి చేయడమే గాని ఆ తర్వాత



రెగ్యులర్ చెకప్‌లు లేకపోవడం వల్ల ఇలాంటి ప్రమాదాలు తరచుగా జరుగుతున్నాయన్నారు.ఇది ముమ్మాటికి అధికారుల నిర్లక్ష్యం వల్లనే జరిగిన సంఘటనగా కనిపిస్తుందని ఒకవేళ అక్కడ భారీ గుంత లేకుండా ఉండి ఉంటే ఇలాంటి సంఘటన జరగకపోయేదని తెలిపారు.ప్రభుత్వం ఎక్స్ గ్రేషియాల పేరుతో డబ్బులు ఇచ్చి చేతులు దులుపు కోకుండా రోడ్డు ప్రమాదాలకు కారణమైనటువంటి అధికారులను సస్పెండ్ చేయాలన్నారు. రవాణా శాఖ అధికారులు నిత్యం వాహనాలు చెకప్‌లు చేసుకుంటూ ఉంటే భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు జరగవు అని అన్నారు. ఈ ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన వాళ్లు చనిపోవడం, అనేకమంది తమ కుటుంబ సభ్యులను కోల్పోవడం వారి ఆవేదనలు, ఆక్రందనలు తీర్చలేమని ప్రభుత్వం ఇప్పటికైనా అధికారులతో సక్రమంగా పని చేయించాలని డిమాండ్ చేశారు.బాధిత కుటుంబాలకు సిపిఐ తరఫున ప్రఘాఢ సంతాపాన్ని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి కే స్వామి, సహాయ కార్యదర్శి వి. హరినాథ్ రావు,ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వంగాల శ్రీనివాస్, నాయకులు హరీష్ రెడ్డి,మల్లారెడ్డి,గౌస్,ఎల్లయ్య, వెంకటేష్, జంబు, నారాయణ. తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలోని అన్ని జిన్నింగ్ మిల్లుల ద్వారా పత్తి కొనుగోళ్లు చేయాలి

● జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను




**నారాయణ పేట జిల్లా బ్యూరో, నవంబర్ 4 (జనం సాక్షి) :** జిల్లాలోని అన్ని జిన్నింగ్ మిల్లులలో సీసీఐ కొనుగోలు కేంద్రాల ద్వారా పత్తి కొనుగోలు చేయాలని జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను సూచించారు. తెలంగాణ కాటన్ జిన్నింగ్ మిల్లుల సంఘం ఈ నెల 6 మార్కెట్ యార్డులలో మిల్లులు మరియు ప్రైవేట్ కొనుగోళ్లను మూసివేయాలని పిలుపునిచ్చిన నేపథ్యంలో మంగళవారం జిల్లా కలెక్టరేట్ లోని వీసీ హాల్ లో నారాయణ పేట జిల్లా లోని జిన్నింగ్ మిల్లుల యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను మాట్లాడుతూ.. జిల్లాలో మొత్తం7 జిన్నింగ్ మిల్లులు ఉన్నాయని, వాటిలో ఇప్పటివరకు 5 మిల్లులలో సీసీఐ కొనుగోలు కేంద్రాల ద్వారా పత్తి కొనుగోళ్లు జరుగుతున్నాయని, పత్తి రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని మిగతా 2 మిల్లులలో కూడా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి పత్తిని కొనుగోలు చేయాలని అదనపు కలెక్టర్ సీసీఐ సంస్థ ప్రతినిధులను కోరారు. దీనిపై స్పందించిన సీసీఐ జిల్లా ప్రతినిధులు తమ ఉన్నతాధికారుల కు సమాచారం ఇస్తామని, తప్పనిసరిగా మిగతా రెండు మిల్లులలో కూడా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. జిల్లా వ్యవసాయ శాఖ అంచనా ప్రకారం ఎకరాకు 12 క్వింటాళ్ల పత్తి వస్తుందని, కపాస్ కిసాన్ యాప్‌లో కూడా మొన్నటి వరకు 12 క్వింటాళ్ల లెక్కనే చూపించిందని, కానీ తాజాగా 12 క్వింటాళ్ల కు బదులు కేవలం 7 క్వింటాళ్ల లెక్క చూపుతోందని ఇది అటు రైతులకు, ఇటు పత్తి రైతులకు సమస్యగా మారిందని మిల్లర్లు అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. కొనుగోళ్లలో స్లాట్ బుకింగ్ పద్ధతిని కూడా ఎత్తివేయాలని మిల్లర్లు కోరారు. స్పందించిన రెవెన్యూ కలెక్టర్ అది కేంద్రం పరిధిలోని వ్యవహారమని ఏమీ చేయలేమని, కానీ ఈ సీజన్ లో కపాస్ కిసాన్ మొబైల్ యాప్, స్లాట్ గురించి జిల్లా రైతులకు అవగాహన కల్పిస్తే, వచ్చే సీజన్ లో రైతులకు స్లాట్ బుకింగ్ ఇంకా సులువు అవుతుందన్నారు. రైతులు మంచి నాణ్యత గల పత్తిని ఆరబెట్టుకొని 8% నుండి 12 తేమ శాతం ఉండేలా సి. సి. ఐ కొనుగోలు కేంద్రాలకు తీసుకొని వచ్చి మద్దతు ధర పొందాలని అదనపు కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో డిప్యూటీ కలెక్టర్ శ్రీరామ్ ప్రణీత్, మార్కెట్ చైర్మన్ శివారెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జాన్ సుధాకర్, సిపిఓ యోగానంద్, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారిని బాలామణి, అగ్నిమాపక శాఖ అధికారి సురేష్ రెడ్డి, ఎస్.ఐ. గాయత్రి, సీసీఐ ప్రతినిధులు అనూప్ మిశ్రా, శ్రీనివాస్ రావు, మార్కెట్ కార్యదర్శి భారతి, సూపర్ వైజర్ లక్ష్మణ్, మిల్లర్లు శ్రీనివాస్, పవన్ లాహెూటీ, తమన్న, రాహుల్ జై, ప్రవీణ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

## ఫీజు రీయంబర్స్‌మెంట్స్, స్కాలర్‌షిప్స్ విడుదల చేయాలి




**మక్తల్, నవంబర్ 4 (జనం సాక్షి) :** ఫీజు రియింబర్స్ మెంట్స్-స్కాలర్ షిప్స్ విడుదల చేయాలని భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా మంగళవారం మక్తల్ నియోజకవర్గ కేంద్రంలో స్థానిక మంత్రి కార్యాలయంలో ఎస్ ఎఫ్ ఐ నాయకులు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర నాయకులు నరహరి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వం విద్యార్థులకు ఇవ్వవలసిన ఫీజు రీయంబర్స్‌మెంట్స్, స్కాలర్‌షిప్స్ గత ఆరేళ్ల నుండి ప్రభుత్వం చెల్లించడం లేదన్నారు. ఫలితంగా విద్యార్థులే ఫీజులు చెల్లించుకుంటున్నారు. ప్రభుత్వ కళాశాలలో, హస్టల్స్ ఫీజులను కూడా వారే చెల్లిస్తున్నారు. ఇంకో పక్క ప్రైవేటు యాజమాన్యాలు కూడా వారి ఇబ్బందులు రీత్యా సమ్మెలోకి వెళ్ళారు. కావున ప్రభుత్వంతో చర్చించి ఫీజులను విడుదల చేయించేలాగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పవన్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు మహేష్, మహేందర్, చింటూ పాల్గొన్నారు.

## పత్తి రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు

● జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



**టేక్మాల్, నవంబర్ 4 (జనం సాక్షి) :** టేక్మాల్ రైతు వేదికలో శంకరంపేట్ - అ డివిజన్ పరిధిలోని వ్యవసాయ శాఖ అధికారులకు కాటన్ కాపాస్ అప్ గురించి సమీక్ష సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమీక్ష సమావేశానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శంకరంపేట్ - అ డివిజన్ పరిధిలో మొత్తం 21193 మంది రైతులు 34903 ఎకరాలలో ప్రత్తి పంట సాగుచేసారాని ప్రతి గ్రామంలో రైతులకి వ్యవసాయ అధికారులు కాటన్ కపాస్ అప్ గురించి అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలని రైతులు ఎవరు కూడా దళారులకి అమ్మి మోసపోకుండా ఈ కపాస్ అప్‌లో అందరు స్లాట్ బుక్ చేసుకొని జీన్నింగ్ మిల్ కు తీస్కొని వచ్చి మద్దతు ధర పొందాలని సూచించారు. పత్తి కొనుగోలు కేంద్రాలను మానిటరింగ్ చేసేందుకు... ఏఎంసీలా వారీగా లోకల్ కమిటీ లను నియమించి. ఎప్పటికప్పుడు రైతులు మద్దతు ధర పొందెల కృషి చేయాలన్నారు. అదేవిధంగా లీగల్ మెట్రాలాజి అధికారులు తేమ కొలిచే యంత్రాలను పరిశీలించాలన్నారు సీసీఐ అధికారుల పర్యవేక్షణ ఉండాలని, అగ్ని ప్రమాదాలు జరగకుండా జీన్నింగ్ మిల్లు యాజమాన్యం తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు ఏ చిన్న ప్రమాదం జరగకుండా అగ్ని మాపాక శాఖ అధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు. అనంతరం కలెక్టర్ జాతీయ ఆహార భద్రత పథకం కింద జొన్న విత్తనాలని 100 శాతం రాయితీ పై రైతులకి అందించడం జరిగింది..ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి దేవ్ కుమార్ ఇంచార్జి ఏడిఏ రాంప్రసాద్ ఆయా మండలాల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు రైతులు పాల్గొన్నారు.

# నేరాల నియంత్రణపై దృష్టి సారించాలి

● ఎస్పీ డాక్టర్ వినీత్




**నారాయణపేట జిల్లా బ్యూరో, నవంబర్ 4 (జనం సాక్షి) :** జిల్లా పోలీస్ కార్యాలయంలోనీ కాన్ఫరెన్స్ హాల్లో మంగళవారం జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి క్రైమ్ రివ్యూ మీటింగ్ నిర్వహించడం జరిగింది. జిల్లాలోని అన్ని సర్కిల్స్, పోలీస్ స్టేషన్లలో పెండింగ్ కేసులు, దర్యాప్తు నాణ్యత, నేరల నియంత్రణపై చర్యలు తీసుకొని ప్రజలకు మెరుగైన సేవలుఅందించాలి అని ఎస్పి తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... ప్రతి కేసులో 'క్వాలిటీ ఆఫ్ ఇన్వెస్టిగేషన్' ద్వారా నేరస్తులకు శిక్ష పడే విధంగా చేసి బాధితులకు న్యాయం చేకూర్చాలని సూచించారు. కేసుల విచారణలో జాప్యం చేస్తే సహించేది లేదని, పోలీస్ అధికారులంతా బాధ్యతగా పని చేయాలని సూచించారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే క్రమశిక్షణా చర్యలు తప్పవని అన్నారు. పెట్రోలింగ్, బ్లూ కోల్ట్స్ వాహనాలతో అధికారులు, సిబ్బంది ఎల్లప్పుడూ రోడ్లపై తిరుగుతూ ప్రజలకు అందుబాటులో ఉండాలని, విసబుల్ పోలీసింగ్ విధులు నిర్వర్తించాలని తెలిపారు. నిషేధిత గంజాయి అక్రమరవాణా, మట్కా,జూదం లాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోని కొత్త సీసీ కెమెరాలను ఏర్పాటు, అవి నిరంతరం పనిచేసే విధంగా మానిటర్ చేయాలని సూచించారు. దొంగతనల కేసుల్లో ప్రస్తుతం పోలీసు శాఖ వినియోగిస్తున్న సాంకేతికతను ఉపయోగించి లాంగ్ పెండింగ్ కేసులలోని నేరస్తులను పట్టుకుని సొత్తును రికవరీ చేసి భాదితులకు త్వరతగతిన అందేలా చూడాలని తెలిపారు. సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ అవగాహనా కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని కోరారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి(బ్లాక్ స్పాట్స్),వాటి నివారణకై సంబంధిత అధికారులతో సమన్వయం పాటిస్తూ ప్రమాద నివారణకు చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లా పరిధిలో మండల కేంద్రాల్లో ట్రాఫిక్ పోలీసులను నియమించి ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడాలని అలాగే ట్రాఫిక్ నియమాలను పాటించకుండా మద్యం సేవించి వాహనాలను రాష్ గా నడుపుతూ డ్రైవింగ్ చేస్తూ రోడ్డు ప్రమాదాలకు కారణమయ్యే వారిపై చట్టపరంగా కేసులు నమోదు చేయాలని సూచించారు. విలేజ్ పోలీసు అధికారులు గ్రామలలో పర్యటిస్తూ ప్రజలతో మమేకమవుతూ సామాజిక అంశాలపై అవగాహన కల్పించాలని తెలిపారు. జిల్లా పోలీస్ వ్యవస్థ పటిష్టతపై దృష్టి సారించాలనీ, ప్రతి అధికారి తాను బాధ్యత వహిస్తున్న ప్రాంతంలో నేరాలు జరగకుండా కృషి చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో డీఎస్పీలు నల్లపు లింగయ్య, మహేష్, సీఐ లు శివశంకర్, రామ్ లాల్, రాజేందర్ రెడ్డి, సైదులు ఎస్సైలు వెంకటేశ్వర్లు, రాముడు, నవీద్, భాగ్యలక్ష్మి రెడ్డి, అశోక్ బాబు, రాజు, విజయ్ కుమార్, బాలరాజు, రమేష్, రాము, రాజశేఖర్, రమేష్, పురుషోత్తం, నరేష్, సునీత, సురేష్, విజయ్ భాస్కర్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

# విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో చదవాలి



**గట్టు, నవంబర్ 4 (జనం సాక్షి) :** జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ బి. ఎం. సంతోష్ ఆదేశాల మేరకు మంగళవారం గట్టు మండలం మాచర్ల, ఇందువాసి గ్రామాల్లోని జడ్పీహెచ్ఎస్ తొమ్మిది, పదో తరగతి విద్యార్థులకు ఆయా పాఠశాలల్లో ప్రత్యేక ప్రేరణాత్మక తరగతుల నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ప్రతిరోజు తరగతులకు హాజరై ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను శ్రద్ధగా విని అర్థం చేసుకోవాలన్నారు. ప్రతి పాఠాన్ని కేవలం ఒక సబ్జెక్టుగా చూడకుండా తమ భవిష్యత్తును మార్చే గొప్ప అవకాశంగా భావించాలని సూచించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు తాము అనుకున్న రంగాల్లో రాణించేందుకు ఉన్నత లక్ష్యాలతో చదువుకోవాలని జిల్లా ఉపాధి కల్పన అధికారి ప్రియాంక పిలుపునిచ్చారు. ఉపాధ్యాయులు రేపు చెప్పబోయే పాఠాన్ని ఒకరోజు ముందుగానే విద్యార్థులు ఇంటి వద్ద చదువుకుని వస్తే ఆ పాఠంపై విద్యార్థులకు శ్రద్ధ పెరిగి సులభంగా అర్థమవుతుందన్నారు. తరగతి గదిలో ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను వినకుండా ఇతర విషయాలు ఆలోచిస్తే ఏకాగ్రత కోల్పోవాల్సి వస్తుందన్నారు. క్రమశిక్షణ అలవర్చుకొని, సమయపాలన పాటిస్తూ, ఉపాధ్యాయులు ఇచ్చిన హెూంవర్క్‌ను ఎప్పటికప్పుడు పూర్తి చేసుకోవాలన్నారు. చదువులో చురుగ్గా రాణించాలంటే శారీరకంగా, మానసికంగా ఉల్లాసంగా ఉండేందుకు వ్యాయామం చేసేందుకు, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనేందుకు కూడా కొంత సమయం కేటాయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

# లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

● జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు



**మెదక్ జిల్లా బ్యూరో, నవంబర్ 4 (జనం సాక్షి) :** పెండింగ్లో ఉన్న కేసులను వేగంగా పరిష్కరించేందుకు న్యాయాధికారులతో సమన్వయం పాటిస్తూ, ప్రతి పోలీస్ అధికారి బాధ్యతతో వ్యవహరించాలని జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు సూచించారు. పోలీస్ కార్యాలయంలోని మీటింగ్ హాల్‌లో మంగళవారం జిల్లా పోలీసు అధికారులు, కోర్ట్ డ్యూటీ సిబ్బందితో జిల్లా ఎస్పీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పెండింగ్లో ఉన్న కేసులను సమర్థవంతంగా పరిష్కరించేందుకు న్యాయవ్యవస్థతో సమన్వయం అవసరమని అన్నారు. ప్రతి అధికారి బాధ్యతతో వ్యవహరిస్తే మాత్రమే బాధితులకు త్వరిత న్యాయం అందుతుందని పేర్కొన్నారు. పోలీస్ స్టేషన్ల వారీగా పెండింగ్లో ఉన్న కేసుల వివరాలను సమీక్షించిన ఎస్పీ, రాజీపడదగిన కేసులను గుర్తించి, ఈ నెల 15వ తేదీన జరగనున్న స్పెషల్ లోక్ అదాలత్‌లో పరిష్కారమయ్యేలా కృషి చేయాలని సూచించారు. చిన్న చిన్న వివాదాలపై కోర్టుల చుట్టూ తిరగడం కన్నా పరస్పర అవగాహనతో రాజీ పడటం సమాజానికి మేలు చేస్తుందని, అట్టి కేసులను పరిష్కారం దిశగా తీసుకెళ్లేందుకు పోలీస్ అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలని ఎస్పీ అన్నారు. కేసుల పురోగతిని నిరంతరం పరిశీలిస్తూ, అవసరమైతే ఉన్నతాధికారుల సలహాలు తీసుకుని ముందుకు సాగాలని తెలిపారు. బాధితులకు న్యాయం చేకూర్చడమే మన ప్రధాన లక్ష్యమని, కేసుల పరిష్కారంలో ఏవైనా సమస్యలు తలెత్తిన వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని ఎస్పీ అన్నారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ ఎస్. మహేందర్, డీఎస్పీలు ప్రసన్న కుమార్ , నరేందర్ గౌడ్, సీఐలు , వెంకట రాజా గౌడ్, రేణుక రెడ్డి, సందీప్ రెడ్డి, కృష్ణ మూర్తి, జర్జ్, మహేష్, రాజ శేఖర్ రెడ్డి, జిల్లా స్టేషన్ హౌస్ ఆఫీసర్ లు, కోర్ట్ డ్యూటీ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమమే లక్ష్యం



**పటాన్‌చెరు, నవంబర్ 4 (జనంసాక్షి) :** నియోజకవర్గ ప్రజల సంక్షేమం ఆర్థిక అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్నామని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తున్నామని తెలిపారు. మంగళవారం పటాన్చెరు డివిజన్ పరిధిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నియోజకవర్గ పరిధిలో వివిధ గ్రామాలు, పట్టణాలు, డివిజన్లకు సంబంధించిన సంబంధించిన 19 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి పథకం ద్వారా మంజూరైన 7 లక్షల 22 వేల రూపాయల విలువైన చెక్కులను ఎమ్మెల్యే జిఎంఆర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ వైద్య చికిత్సల నిమిత్తం ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందిన వారికి ఆర్థిక భరోసా కల్పిస్తూ ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా అండగా నిలుస్తుందని తెలిపారు. దీని ద్వారా ప్రతి నెల లక్షలాది రూపాయల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు, ఎల్ఓసిలు పారదర్శకంగా పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు నరసింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## పాలిటెక్నిక్ వసతి గృహ నిర్మాణాలకు 13.15 కోట్లు మంజూరు



**వనపర్తి బ్యూరో, నవంబర్ 4 (జనంసాక్షి) :** వనపర్తి పాలిటెక్నిక్ వసతి గృహ నిర్మాణాలకు (హైయ్యర్ ఎడ్యుకేషనల్ డిపార్ట్మెంట్ నుంచి) జిఓ 169 ప్రకారం 13.15 కోట్లను, తెలంగాణ సర్కార్ మంజూరు చేసింది.తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి,ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ నిధుల మంజూరుకి సహకరించిన ఇంచార్జ్ మంత్రివర్యులు దామోదర్ రాజనర్సింహ, జిల్లా మంత్రివర్యులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి, ఎమ్మెల్యే ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ నిధులను మంజూరు చేయించిన వనపర్తి శాసనసభ్యులకు, వనపర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## తడిసిన దాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలి



**నంగునూర్, నవంబర్ 4 (జనం సాక్షి) :** అకాల వర్షాలతో తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని మాజీ ఎంపిపి జాప శ్రీకాంత్ రెడ్డి, మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ రాగుల సారయ్య డిమాండ్ చేశారు. కొనుగోలు కేంద్రాలలో ధాన్యం తడిసి మొలకలు రావడానికి కారణం పూర్తిగా ప్రభుత్వ నిర్లక్ష్యమే అని అన్నారు. మంగళవారం నంగునూరు మండలంలోని అక్కెనపల్లి, ఖాతా కొనుగోలు కేంద్రాలలో అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని బీఆర్ఎస్ నాయకులు కిష్టారెడ్డి, రంగు రాజు గౌడ్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుల పై కాంగ్రెస్ ప్రభుత్వం సవితి ప్రేమ వలకపోస్తుందని ఆరోపించారు. కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి కొనుగోళ్లను ప్రారంభిచడంలో జాప్యం మూలంగానే నేడు రైతులు తీవ్ర నష్టాన్ని చవిచూడాల్సిన పరిస్థితి నెలకొందని మండిపడ్డారు. రైతులు ఆరుగాలం శ్రమించిన పంట నష్టపోతే ఇప్పటివరకు ప్రభుత్వ సమీక్షించకుండా నిర్లక్ష్యం వ్యవహరిస్తూ రైతుల జీవితాలతో ఆడుకుంటున్నారని మండిపడ్డారు బిఆర్ఎస్ ప్రభుత్వంలో రైతులను కంటికి రెప్పలా కాపాడుకున్నామని కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రైతుల జీవితాల్లో శాపంగా మారారని అన్నారు కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే బాధ్యత వహించి కొనుగోలు చేయాలని అలాగే పంట నష్టపరిహారం 25 వేల రూపాయలు తగ్గకుండా అందించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రైతులతో కలిసి నిరసనలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు మాజీ సర్పంచ్ దశమంత రెడ్డి పాలెపు నరసింహులు గౌడ్ ఆరేపల్లి రాజు ఉల్లి చిన్న మల్లయ్య, చెలికాని మల్లేశం, దేవులపల్లి కనకయ్య పాల్గొన్నారు.

# పౌష్టికాహారం రాజ్యాంగ హక్కు



**మెదక్ జిల్లా బ్యూరో, నవంబర్ 4 (జనం సాక్షి) :** పౌష్టికాహారం రాజ్యాంగ హక్కు, తూచా తప్పకుండా మెనూ పాటించాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మెదక్ జిల్లాలోని పలు గ్రామాల్లో చైర్మన్ గోల్ శ్రీనివాస్ రెడ్డి, సభ్యులు ఓరగంటి ఆనంద్,మూలుకుంట్ల భారతి, రంగినేని శారద లు క్షేత్రస్థాయిలో నర్సాపూర్ పట్టణంలోని రేషన్ షాప్ నెంబర్ 1741014 ను, ఎమ్ ఎల్ ఎస్ పాయింట్ ను రెడ్డిపల్లి గ్రామంలోని అంగన్వాడి కేంద్రాన్ని, కౌడిపల్లి మండలం లోని ఆశ్రమ పాఠశాలను మంగళవారం తనిఖీ చేశారు. పర్యటన అనంతరం కలెక్టర్ కార్యాలయంలోని మినీ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ , అదనపు కలెక్టర్ నగేష్, జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ పౌష్టికాహారం అనేది ఏ ప్రభుత్వ పథకం కాదని, ఇది రాజ్యాంగమైన హక్కు అన్నారు. రేషన్ షాపుల్లో ఫిర్యాదుల బాక్సులను, ఫిర్యాదులు స్వీకరించే అధికారుల పేరు హెూదా ఫోన్ నెంబర్లను నోటీస్ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. అంతోధ్యాయ కార్డు కలిగిన వారికి చక్కెర ఇవ్వడం లేదని, తూకంలో తేడాలు ఉన్నాయని, ఎంఎల్ఎస్ పాయింట్‌లో సిబ్బంది సరిగా ప్రవర్తిస్తలేరనే రాతపూర్వక ఫిర్యాదులు అందాయన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకి ఇచ్చే గుడ్డు సైజు చాలా చిన్నగా ఉందని, పిల్లలు ఆడుకునే ఆట వస్తువులను అధికారుల పర్యటన వచ్చినప్పుడు మాత్రమే చూపించకుండా, అంగన్వాడి సమయాల్లో పిల్లలకు ఆట వస్తువులు ఇవ్వడం ద్వారా మానసిక పరిపక్వత వస్తుందన్నారు. రెడ్డిపల్లి హైస్కూల్లో మధ్యాహ్న భోజనం సరిగా లేదని, మధ్యాహ్న భోజనం పంపిస్తున్న నిర్వాహకులకు అధికారులు నోటీసులు ఇచ్చి, రాతపూర్వక సమాధానం ఇవ్వాలన్నారు. అక్షయపాత్ర నుండి వచ్చే మధ్యాహ్న భోజనం పాఠశాలకు వచ్చేసరికి చల్లారిపోయి, గడ్డలు గా మారిపోతుండడంతో పిల్లలు ఎవరు తినడం లేదనీ దీనిపై అక్షయపాత్ర సంస్థ సమాధానం చెప్పాలన్నారు. ఆశ్రమ పాఠశాలలో మెనూ పాటించడం లేదని, నాన్ వెజ్ పిల్లలకు అందడం లేదని దాన్ని సరిచూసుకోవాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఉన్న దాదాపు లక్ష మంది విద్యార్థులకు అన్ని రకాల ఆరోగ్య పరీక్షలు చేసి రిపోర్ట్ అందించాలన్నారు. అన్ని శాఖల సమన్వయంతో మరింత ముందుకెళ్లాలని తెలిపారు. ఫుడ్ కమిషన్ సభ్యులు ఓరుగంటి ఆనంద్ మాట్లాడుతూ ఆహారం ఒక హక్కుగా రాజ్యాంగం కల్పించిందన్నారు. ప్రతి పాఠశాల ,అంగన్వాడీలలో తల్లిదండ్రులతో సమావేశ ఏర్పాటు చేయాలన్నారు. తల్లిదండ్రుల కమిటీలు కూడా వేసి పాఠశాల అభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. వంటగదిని పూర్తిగా శు భ్రపరిచి దుమ్ము ధూళి లేకుండా పరీక్షించి మధ్యాహ్న భోజనం వండాలని అధికారులకు సూచించారు. గర్భిణీ స్త్రీలకు, ప్రసూతి స్త్రీలకు ప్రభుత్వ నుంచి వచ్చే ఆహార పదార్థాలు అందించాలన్నారు. వారికి నగదు రూపంలో వచ్చే ఆరువేల రూపాయలు పథకాన్ని అమలు చేసి పేదవారికి సహాయం చేయాలన్నారు. జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ ఫుడ్ కమిషన్ చైర్మన్, సభ్యులు చేసిన ఆదేశాలను తూచ తప్పకుండా పాటించి, అధికారుల సమన్వయంతో పనిచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి శ్రీరామ్ ,డి ఈ ఓ రాధకిషన్, బి డబ్ల్యు ఓ హేమ భార్గవి, సివిల్ సప్లై అధికారి నిత్యానంద, నర్సాపూర్ ఆర్డిఓ మైపాల్ రెడ్డి, డి ఆర్ డి ఏ పి డి శ్రీనివాసరావు,తహసిల్దార్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్లపైనే లారీల పార్కింగ్

- ఇసుక లారీలను రాంగ్ రూట్లో నిలుపుదల చూపిస్తున్న నిర్వాహకులు...
- వాహనదారులకు, ప్రయాణికులకు తప్పని తిప్పలు....



**మంగపేట నవంబర్ 03(జనంసాక్షి) :** నిత్యం వేలాది వాహనాలు ఈ జాతీయ రహదారి వెంటేనే ప్రయాణాన్ని కొనసాగిస్తున్నాయి.కానీ అలాంటి జాతీయ రహదారిపైనే ఇష్టానుసారంగా ఇసుక లారీల డ్రైవర్లు, ఇసుక క్వాంటలు వేస్తున్న నిర్వాహకులు లారీలను అడ్డగోలుగా రాంగ్ రూట్లో నిలుపుదల చేపిస్తూ ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారు. వీరి వ్యవహారం ఎలా మారిందంటే... అంతా మా ఇష్టం.... అంత మా ఇష్టం ఆపేదెవర్రా మా ఇష్టం... అనే రీతిలో వీరి ఆగడాలు రోజురోజుకు శృతిమించి పోతున్నాయని ప్రజలు తీవ్రంగా ఆరోపిస్తున్నారు. వీరి ఆగడాలకు హద్దు పద్దు లేకుండా పోతున్నాయని వీరిని నిలుపుదల చేసే వారు లేరా అని వారు ప్రశ్నిస్తున్నారు. ఇంత జరుగుతున్నా కూడా సంబంధితశాఖ అధికారులు కన్నెత్తి చూడకపోవడం విడ్డూరంగా ఉందంటూ వాహనదారులు ఆరోపిస్తున్నారు. ఇలా అడ్డగోలుగా ఇసుక లారీలను ఇష్టానుసారంగా రోడ్లకు ఇరువైపులా నిలుపుదల చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని ప్రజలు మండిపడుతున్నారు. ప్రభుత్వానికి గాని ప్రభుత్వాధికారులకు గాని ప్రజల ప్రాణాలు అంటే అంత విలువ లేకుండా పోయాయని వారు తమ ఆవేదనను వ్యక్తపరిచారు. మంగళవారం ఉదయం కమలాపురం పెట్రోల్ బంక్ దగ్గర లో గల వేబ్రిడ్జ్ నిర్వాహకులను ఇలా రోడ్లపై రాంగ్ రూట్లో ఇసుక లారీలను నిలుపుదల చేయడం ఏంటి అని అనే విషయాన్ని 'జనంసాక్షి' ప్రశ్నించగా వారు సమాధానమిస్తూ ఇలా చేయడం వలనే వే బ్రిడ్జి దగ్గరకు వెళ్లడానికి ప్రయాణం సులభతరం అవుతుందని ఈ విషయాన్ని అధికారులే తమకు చెప్పడం జరిగిందని వారు సమాధానం ఇచ్చారు. రోడ్డుపై ఇసుక లారీలు బారులుతీరి నిలిపి ఉంచడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. మంగపేట కమలాపురం గ్రామాల మధ్య ఇది నిత్యకృత్యమైంది. ఇలాంటి దృశ్యమే మంగళవారం కూడా కనిపించింది. ఇసుక లారీలు రోడ్డుపై ఇష్టానుసారంగా రాంగ్ రూట్లో నిలపడంతో ఇతర వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మండలంలోని వాడగూడెం ఇసుక క్వారీ నుంచి వందలాదిగా వస్తున్న ఇసుక లారీలు కమలాపురం హెచ్పి పెట్రోల్ బంకు వద్ద వేబ్రిడ్జిలో తనిఖీ చేస్తుండటంతో భారీగా ట్రాఫిక్ ఇబ్బందులు తప్పడం లేదు. కొంత కాలంగా మండలంలోని చుంచుపల్లి, వాడగూడెం కేంద్రంగా నడుస్తున్న ఇసుక క్వారీల్లో లోడింగ్ కోసం వస్తున్న వందలాది లారీలను ఏటూరునాగారం బూర్గంపహాడ్ ప్రధాన రహదారి రమణక్కపేట గ్రామం వరకు సుమారు నాలుగు కిలో మీటర్ల మేర నిలుపుదల చేయడంతో వాహనదారులకు నిత్యం అంతరాయం కలుగుతుందని వారు ఆవేదన వ్యక్తపరుస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి ఇష్టానుసారంగా ఇసుక లారీలను నిలుపుదల చేయకుండా చేయాలని అలాగే ప్రజలకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ప్రయాణాన్ని కొనసాగించే విధంగా చర్యలు చేపట్టాలని వారు కోరారు.

## నేషనల్ హైవే పనుల పురోగతిపై సమీక్ష




**వరంగల్ ప్రతినిధి, నవంబర్ 4(జనంసాక్షి):** గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే పనుల ల్యాండ్ ఆక్విజేషన పురోగతి పై వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద,అదనపు కలెక్టర్ జి సంధ్యారాణి, డిఆర్వో విజయ లక్ష్మి , ఆర్డిఓ నర్సంపేట ఉమారాణి నేషనల్ హైవే బ్రిడ్జ్ మేనేజర్ తదితరుల తో పాటు సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మంగళవారం వరంగల్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే 163జీ మంచిర్యాల్ వరంగల్ ఖమ్మం జిల్లాల ను కలుపుతూ ఏర్పాటు చేసిన నేషనల్ హైవే మొత్తం 176.52 హెక్టార్ల ల్యాండ్ అక్విజేషన్ కు గాను ఇప్పటివరకు 171.34 హెక్టార్ల ల్యాండ్ ఎక్విజేషన్ పూర్తి అయిందని, పెండింగ్ అవార్డును నవంబర్ 10 వరకు పూర్తి చేయాలని సంబంధిత ఆర్డీవోలను అధికారులను ఆదేశించారు. 22.02 హెక్టార్ల ల్యాండ్ ఎక్విజేషన్ కోర్టు కేసుల తో పెండింగ్లో ఇప్పటివరకు పేమెంట్ అయి అవార్డ్ పాస్ అయిన కేసులలో మ్యుటేషన్ పూర్తి చేయాలని, ఆదేశించారు. పెండింగ్ లో ఉన్న చెల్లింపులను త్వరగా చెల్లించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. భూమి కోల్పోయిన రైతుల నష్టపరిహారం త్వరిత గతిన చెల్లించి ల్యాండ్ ఆక్విజేషన్ త్వరగా పూర్తిచేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ విజయలక్ష్మి వరంగల్ నర్సంపేట ఆర్డీవోలు సుమా ఉమారాణిలు, వరంగల్తో తాసిల్దార్ శ్రీకాంత్, ఏ డి సర్వే ల్యాండ్ శ్రీనివాస్, సంబంధిత పాల్గొన్నారు.

## ఫోక్సో కేసులో నిందితుడికి 20 ఏండ్ల జైలు

**నిర్మల్ బ్యూరో, నవంబర్ 4 (జనంసాక్షి) :** ఫోక్సో కేసులో నిందితుడికి 20 సంవత్సరాల జైలు శిక్ష, రూ.5,000 జరిమానా విధించినట్టు నిర్మల్ జిల్లా ప్రిన్సిపల్ జడ్జి శ్రీవాణి తీర్పు వెలువరించారు. 2020లో కడెం మండలం చిన్న క్యాంపు కన్నాపూర్ గ్రామానికి చెందిన గట్టు గంగారం అనే వ్యక్తి 9 ఏళ్ల బాలికపై అసభ్యకర ప్రవర్తనకు పాల్పడగా, కడెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. విచారణ అనంతరం కోర్టు నిందితుడిని దోషిగా తేల్చింది. ఈ సందర్భంగా ఎస్పీ డాక్టర్ జి.జానకి షర్మిల మాట్లాడుతూ నేరం చేసిన వారు ఎంతటి వారైనా శిక్ష నుండి తప్పించుకోలేరని. ప్రజల భద్రతకే పోలీస్ శాఖ కట్టుబడి ఉందని ఆమె అన్నారు. నిందితుడి శిక్షలో కృషి చేసిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె. వినోద్ రావు, విచారణ అధికారులు ఉపేందర్ రెడ్డి, రాజ్ కుమార్, అలాగే డ్యూటీ ఆఫీసర్లు ఏఎస్ఐ దల్లు సింగ్, ప్రభాకర్ హెచ్సీలను ఎస్పీ అభినందించారు.

## బీటెక్ విద్యార్థి అదృశ్యం



**చెన్నారావుపేట, నవంబర్ 4(జనంసాక్షి) :** బీటెక్ విద్యార్థి అదృశ్యమైన సంఘటన మండలంలోని తిమ్మరాయిని పహాడ్ గ్రామంలో సోమవారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం... ఇదే గ్రామానికి చెందిన గుండెబోయిన సాంబయ్య కుమారుడు గణేష్ నర్సంపేటలోని బిట్స్ కళాశాలలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఆదివారం కళాశాలకు వెళుతున్నానని చెప్పి ఉదయం 9 గంటలకు ఇంట్లో నుండి వెళ్ళాడు. సాయంత్రం 6 గంటల వరకు కూడా ఇంటికి తిరిగి రాలేదు. అతనికి ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ వస్తుంది. చుట్టుపక్కల గ్రామాలలో, బంధువుల ఇళ్లలో వెతికిన అతని ఆచూకీ దొరకలేదు. దీంతో సోమవారం పోలీస్ స్టేషన్ లో తమ కుమారుడి ఆచూకి తెలుపాలని కోరుతూ ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. విద్యార్థి తండ్రి సాంబయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు చెన్నారావుపేట ఎస్సై రాజేష్ రెడ్డి తెలిపారు.


## ఇంటర్ బోర్డు ఆదేశాలను పాటించాలి: డీఐఈఓ



**నెక్కొండ, నవంబర్ 4 (జనంసాక్షి) :** నెక్కొండ మండల కేంద్రంలోని ఇంటర్మీడియట్ జూనియర్ కళాశాలల్లో ఇంటర్ బోర్డు ఆదేశాలను తప్పక పాటించాలని జిల్లా మాధ్యమిక విద్యాధికారి డా.శ్రీధర్ సుమన్ అన్నారు. మంగళవారం వరంగల్ జిల్లాలోని పర్వతగిరి మాడల్ జూ. కళాశాల, నెక్కొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలను సందర్శించారు. ఆయా కళాశాలల్లో తనిఖీ నిర్వహించి అడ్మీషన్ల ప్రక్రియ, తరగతుల నిర్వహణ, ఆన్ జాబ్ ట్రైనింగ్, భౌతిక వసతులు, అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు, అంతర్గత పరీక్షలు తదితర అంశాలను పరిశీలించారు. ఇంటర్ బోర్డు ఆదేశాల మేరకు అడ్మీషన్లకు టీ.సీ తప్పనిసరని, నియమ నిబంధనలు పాటించని కళాశాలలపై తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అంతర్గత పరీక్షలు, ప్రమాణాల పెంపు తదితర అంశాలపై చర్చించారు. విద్యార్థుల సర్వతోముఖా భివృద్ధికి, మానసిక వికాసానికి కృషి చేయాలని అన్నారు. డీఐఈఓ పర్యటనలో కార్యాలయ సిబ్బంది శేఖర్, కొలంబో తదితరులు పాల్గొన్నారు.

## వదలని వర్షాలు

- రైతులు ఆగమాగం



**మల్హర్, నవంబర్ 4 (జనంసాక్షి) :** రైతులను వర్షాలు వదలడం లేదు. మొన్నటి వరకు భారీ వర్షాలకు రైతులు ఆగమాగం అయ్యారు. మళ్ళీ మంగళవారం నుంచి వర్షాలు పడుతున్నాయి. వరి, పత్తి, మిర్చి,కూరగాయలు పండించే రైతులకు ఏమి చెయ్యాలో అర్థం కావటం లేదు. ఇప్పటికే రైతులు అధిక పెట్టుబడులు పెట్టి ఆర్థికంగా నష్టపోయినారు.పంట చేతికి వచ్చే సమయానికి ప్రకృతి పగ పట్టినట్లు భారీ వర్షాలు కురుస్తు వ్యవసాయరంగన్ని కోలుకోలేని స్థితి లోకి నెట్టాశాయి. వరి ఎకరానికి అయ్యే ఖర్చు దాదాపు ముప్పై నుంచి ముప్పై ఐదు వెయ్యిల ఖర్చు అవుతుంది. అంత పెట్టుబడి పెట్టిన రైతులకు ఈ సంవత్సరము వర్షాల రూపంలో భారీ నష్టం చేస్తున్నాయి. ప్రభుత్వం నష్ట పరిహారం ఇచ్చి రైతులను ఆదుకోవాలి అని రైతులు కోరుచున్నారు.

## పరిసరాల పరిశుభ్రతకు పాటుపడాలి

- విధుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు
- జిల్లా ప్రభుత్వాసుపత్రిని పరిశీలించిన కలెక్టర్



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** పారిశుద్ధ్య కార్యక్రమాల నిర్వహణలో అలసత్వం వహించేవారికి వేతనాల్లో కోత విధించాలని జిల్లా ప్రభుత్వాసుపత్రి పర్యవేక్షకులను జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ హెచ్చరించారు. మంగళవారం జిల్లా ప్రభుత్వాసుపత్రిని ఆకస్మికంగా పరిశీలించిన కలెక్టర్, సాధారణ వార్డులు, ఐసీయూ వార్డులు, రోగులకు అందిస్తున్న ఆహార పదార్థాల నాణ్యత, ఓపి సేవలు, సహాయక కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం అన్ని విభాగాల ప్రధాన వైద్యులతో సమావేశం నిర్వహించారు. సిబ్బంది సమయపాలన పాటించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి రోజు రోగులకు వేస్తున్న బెడ్షీట్లను మార్చాలని, రోగులకు అందించే ఆహారానికి స్పష్టమైన మెనూ ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం వార్డుల్లో పర్యటించిన కలెక్టర్, చికిత్స పొందుతున్న రోగుల దగ్గరకు వెళ్లి వైద్య సేవలపై స్పందనను అడిగి తెలుసుకున్నారు. రక్షణ చర్యల్లో భాగంగా ఫైర్ ఎస్టింగ్విషర్ల గడువు ముగిసినట్లు గుర్తించిన కలెక్టర్, ఇప్పటి వరకు ధృవీకరణ ఎందుకు తీసుకోలేదని పర్యవేక్షకునిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి రోజు ఆసుపత్రికి వచ్చే రోగుల వివరాలను అడిగి తెలుసుకున్న కలెక్టర్, రోజుకు దాదాపు వెయ్యి . ప్రసూతి విభాగాన్ని సందర్శించిన కలెక్టర్, అందులో సాధారణ ప్రసవాలు, సిజేరియన్ల వివరాలు, ప్రమాదకర కేసులను ఎక్కడికి రిఫర్ చేస్తున్నారన్న అంశాలను కూడా వివరంగా అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదలకు ప్రతిపాదనలు పంపాలని సూచించారు. జిల్లా ఆసుపత్రిలో పారిశుద్ధ్యం, రోగుల భద్రత, నాణ్యమైన వైద్యసేవలు నిర్దేశిత విధానంలో అమలు కావాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

### వివి ప్యాట్, ఈవీఎం గోదాముల తనిఖీ

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ శర్మ మంగళవారం జిల్లా కేంద్రంలోని వివి ప్యాట్, ఈవీఎం గోదామును తనిఖీ చేశారు. బందోబస్తు, తనిఖీ రిజిష్టర్ లలో సంతకాలు చేశారు. గోదాము వద్ద ఎలాంటి లోపాలు లేకుండా పటిష్టమైన భద్రత ఉండాలని, పర్యవేక్షణ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

### శాఖల వారిగా సమగ్ర నివేదికలు తయారు చేయాలి

జిల్లాలో ప్రభుత్వ పథకాల అమలు, పరిపాలనా విధానాలు, అభివృద్ధి కార్యక్రమాల పురోగతి, ప్రజా సంక్షేమ పథకాల అమలు పరిశీలనకు ట్రైనీ

ఐఎఎస్ అధికారుల బృందం జిల్లా పర్యటనకు వస్తున్నందున శాఖల వారిగా సమగ్ర నివేదికలు తయారు చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. ట్రైని అధికారుల పర్యటన సందర్భంగా మంగళవారం ఐడిఓసి కార్యాలయంలో రెవెన్యూ, పోలీస్, పంచాయతీరాజ్, వైద్య, విద్య, మిషన్ భగీరథ, సంక్షేమ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ ట్రైనీ అధికారులు విద్యా, వైద్య, అంగన్ వాడి కేంద్రాలు, స్వయం సహాయక సంఘాల నిర్వహణ, నర్సరీలు, డంపింగ్ యార్డులు, మిషన్ భగీరథ వంటి పథకాల అమలుపై వివరాలు అందించాలని ఆదేశించారు. పలిమెల మండలం లెంకల గడ్డ, మహాముత్తారం మండలం ములుగుపల్లిలో పంచాయతిలలో పర్యటన ఉంటుందని తెలిపారు. గ్రామ, మండల, జిల్లా స్థాయి ప్రణాళికలు తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. అధికారుల పర్యటనకు సంబంధించి ప్లాన్ ఆఫ్ యాక్షన్ తయారు చేయాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీస్ బందోబస్తు చేయాలని తెలిపారు. వేర్వేరుగా జరిగిన ఈ కార్యక్రమాల్లో ఆసుపత్రి పర్యవేక్షకులు డాక్టర్ రాజేంద్రప్రసాద్, ఆర్ఎంఓ దివ్య, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు అబ్బాస్, సిబ్బంది నవీన్ తదితరులు పాల్గొన్నారు.



## నేడు మల్లంపల్లి కెనాల్ దగ్గర జాతీయ రహదారి మూసివేత

**ములుగు,నవంబర్ 4(జనం సాక్షి):** మల్లంపల్లి సమీపంలోని ఎస్సారెస్పీ కెనాల్ వద్ద జాతీయ రహదారి (ఎన్హెచ్) బ్రిడ్జి నిర్మాణం సందర్భంగా బుధవారం ఉదయం 5 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు జాతీయ రహదారిని తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు వాన దారులు సహకరించాలని నేషనల్ హైవే ఏఈ చైతన్య మంగళవారం తెలిపారు.కెనాల్ వద్ద రోడ్డు నిర్మాణం చేపడుతున్న దృష్ట్యా వాహనాల రాకపోకలతో ఇబ్బందులు జరుగుతున్నందున ఒక్కరోజు బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ములుగు నుండి హనుమకొండ వెళ్లే వాహనాలు భారీ వాహనాలు అబ్బాపూర్ మీదుగా చిన్న వాహనాలు భూపాల్ నగర్ మీదుగా వెళ్లాలని,అదేవిధంగా హనుమకొండ నుంచి వచ్చే భారీ వాహనాలు గూడెపాడ్ వయా పరకాల మీదుగా చిన్న వాహనాలు శ్రీనగర్ భూపాల్ నగర్ మీదుగా ములుగు వెళ్లాలని ఆయన తెలిపారు.వాహనాలదారులు సహకరించాలని ఆయన కోరారు.



## కోటగుళ్లలో ఫ్రాన్స్ దేశస్తుల సందడి

- స్వామివారికి ప్రత్యేక పూజలు

**గణపురం, నవంబర్ 04(జనం సాక్షి):** కాకతీయుల కళా క్షేత్రం శ్రీ భవాని సహిత గణపేశ్వరాలయం కోటగుళ్ళ లో మంగళవారం ఫ్రాన్స్ దేశస్థులు సందడి చేశారు. ఫ్రాన్స్ దేశానికి చెందిన ఎరిఫ్, ఎలిక్ లు ఆలయాన్ని సందర్శించారు. మొదట స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల అనంతరం ఆలయ పరిసరాలను ఫోటోలు వీడియోలు చిత్రికరించుకున్నారు కోటగుళ్ళ చరిత్రను ఆలయ అర్చకులు జూలపల్లి నాగరాజును అడిగి తెలుసుకున్నారు. ఆలయ నిర్మాణం అద్భుతమని కొనియాడారు.

## దళారుల ప్రమేయంతో మళ్లీ మొదలైన రేషన్ దందా

- రేషన్ మాఫియాపై అధికారుల చర్యలేవి?
- ప్రశ్నిస్తున్న ప్రజానీకం

**కాళేశ్వరం, నవంబర్ 04 (జనం సాక్షి) :** నిరుపేద ప్రజలు కడుపునిండా అన్నం తినాలనే సదుద్దేశంతో రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రేషన్ లబ్ధిదారులకు దొడ్డ బియ్యం స్థానంలో సన్న బియ్యం ఇస్తుంది. అయిన కొందరు నాయకులు , అధికారులు రేషన్ మాఫియా దందాను ప్రోత్సహిస్తున్నారని, దీంతో మంచి సంకల్పంతో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకొచ్చిన సన్న బియ్యం పథకం నీరుగారిపోతుందని ప్రజలు చర్చించుకుంటున్నారు. మహారాష్ట్రలోని సిరోంచను అడ్డాగా చేసుకొని రేషన్ మాఫియా దందాను ఒక వ్యక్తి నడుపుతున్నాడు. ఆ వ్యక్తి మండలాల వారిగా ఏజెంట్లను నియమించుకొని రేషన్ డీలర్ల ద్వారా కొనుగోలు చేసిన బియ్యాన్ని సీరోంచకు తరలిస్తూ తెలంగాణ రాష్ట్ర ఆదాయానికి గండి కొడుతూ వేలకోట్ల రూపాయలను సొమ్ము చేసుకుంటూ తనకు అధికారులు అడ్డు రాకుండా దళారీ వ్యవస్థను ప్రోత్సహిస్తున్నట్లు జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో పలువురు బహిరంగంగానే చర్చించుకోవడం గమనార్హం. ఈ దందాపై నిఘా పెట్టి పట్టించుకోవాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరించడం, ఈ రేషన్ దందా వెనుక కొంతమంది అధికార పార్టీ నాయకుల హస్తం ఉండడంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేరు ప్రఖ్యాతలు దిగజారిపోతున్నాయని అంటున్నారు మేధావులు. ఇప్పటికైనా సంబంధిత జిల్లా శాఖ అధికారులు, మండల అధికారులు ఈ దందాపై నిరంతరం నిఘా పెడుతూ..రేషన్ దందాను అడ్డుకోకపోతే..తెలంగాణ రాష్ట్ర ఖజానా బంగాళాఖాతంలో పోసినట్లు మహారాష్ట్ర పాలవుతుందని మేధావులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు మేల్కొని చర్యలు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అదేవిధంగా రైస్ మిల్లర్లు సైతం తక్కువ ధరకు సన్నబియ్యం కొనుగోలు చేసి రీసైక్లింగ్ తో అదే బియ్యాన్ని పేద ప్రజలకు ఎక్కువ ధరలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని ఈ దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా విరాజిల్లుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

## టీ డయాగ్నొస్టిక్‌లో అందని సేవలు!

- నిర్ధారణ పరీక్షల్లో నిర్లక్ష్యం
- మిషన్లు పనిచేయడం లేదని తిప్పి పంపుతున్న వైనం...
- జనరేటర్ రిపేర్ కు నోచుకోకుండా ఉన్నది
- పట్టించుకోకుండా ఉన్న మెడికల్ అధికారులు




**నర్సంపేట నవంబర్ 4 (జనం సాక్షి) :** నర్సంపేట పట్టణంలో రూ.కోటి25 లక్షలతో ఏర్పాటు చేసిన టీ డయాగ్నొస్టిక్ కేంద్రంలో వైద్య పరీక్షల కోసం వచ్చే రోగులకు నిరాశే ఎదురవుతోంది. వాస్తవానికి 24 గంటల్లో మెడికల్ రిపోర్టులు సదరు వ్యక్తుల ఫోన్ కు మెసేజ్ రూపంలో అందాల్సిన సేవలు అందని ద్రాక్షగా మిగిలిపోతున్నాయి. వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఉన్న సీ.హెచ్.సీ లు, పీ.హెచ్.సీ(13) ల నుండి రోజు వారీగా సేకరించే రక్త నమూనాలను పరీక్షలు చేసి, హైద్రాబాద్ లోని దయాగ్నొస్టిక్ సెంట్రల్ కేంద్రం నుండి రిజిస్ట్రేషన్ చేసుకున్న రోగుల ఫోన్ లకు రోగ నిర్ధారణకు సంబంధించి సమాచారం మెసేజ్ రూపంలో రావాల్సి ఉంటుంది. అధికారుల నిర్లక్ష్యం కారణంగా గత కొన్ని రోజులుగా రావట్లేదన్నది ప్రధాన ఆరోపణ. దీనికి అధికారుల నిర్లక్ష్యం, సిబ్బంది పనితనం కారణంగా తెలుస్తోంది. వెరసి ప్రభుత్వం సదుద్దేశ్యంతో ఏర్పాటు చేసిన టీ దయాగ్నొస్టిక్ సెంటర్ కి అపవాదును తీసుకొస్తుంది.

నిత్యం ఉరవనిర్ధనం కోసం నర్సంపేట పట్టణంలో టీ డయాగ్నోర్ సెంటర్ కేంద్రానికి వచ్చే రోగుల సిబ్బంది ప్రవర్తన విస్కీ చెందినట్లు ఆరోపణలు వెలువెత్తుతున్నాయి మిషన్ మోరాయించడంతో ఒక కారణమైతే సిబ్బంది ప్రవర్తన మరొక కారణమవుతుంది వచ్చే వారికి ముందుగానే డేటు ఇస్తున్నప్పటికీ తీరా గడువులోపు వచ్చిన పలు కారణాలు చూపుతో టెస్టులకు మరొక కారణం తెలుస్తుంది జిల్లా వ్యాప్తంగా ఉన్నప్పల ఆరోగ్యంద్రాలు నుంచి వచ్చే రోగులు టీ టెక్నో సెంటర్ సిబ్బంది తీరును విసుకు చెందుతున్నారు ప్రైవేట్ ఆసుపత్రులకు వెళు_న్నారు. కరెంటు లేని టైంలో జనరేటర్ కూడా పనిచేయటం లేదు సిబ్బందిని అడగగా జనరేటర్ రిపేర్ లో ఉందని నెలరోజులు అవుతుందని రిపేర్ చేసేవారు లేరని సమాధానం చెప్పారు. మెడికల్ కాలేజ్ సూపర్డెంట్ వివరణ కోరెందుకు ప్రయత్నించగా ఫోన్ లిఫ్ట్ చేయలేదు. వెంటనే పై అధికారులు స్పందించి సిబ్బందిపై చర్యలు తీసుకుంటారని ప్రజలు కోరుతున్నారు

## ప్రభుత్వ ఆసుపత్రి నర్సింగ్ అధికారిణి ఆత్మహత్య



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** జయశంకర్ భూపాలపల్లి జిల్లాకేంద్రంలోని 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రిలో నర్సింగ్ ఆఫీసర్గా విధులు నిర్వహిస్తున్న ఇరుప అనిత(30) సోమవారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నట్లు సీఐ డి.నరేష్ కుమార్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. ములుగు జిల్లా, తాడ్వాయి మండలం రంగాపూర్ కు చెందిన ఇరుప అనిత గత ఏడాది కాలంగా భూపాలపల్లి ప్రభుత్వ 100 పడకల ఆసుపత్రిలో నర్సింగ్ ఆఫీసర్గా పనిచేస్తోంది. ఇటీవలి కాలంలో ఆమె ఆరోగ్యం సహకరించడం లేదు. ఈ క్రమంలో ఈ నెల 3న రాత్రి, భూపాలపల్లి లోని మంజూరునగర్ ప్రాంతంలో తాను అద్దెకు ఉంటున్న నివాసంలో చున్నీతో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటనపై మృతురాలు తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి వివిధ కోణాలలో దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు సిఐ నరేష్ కుమార్ తెలిపారు.

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
05 నవంబర్ 2025

# హైదరాబాద్ బీజాపూర్ జాతీయ రహదారి నిర్మాణం కోసం కృషి

- మిర్జాగూడ రోడ్డు ప్రమాదంలో 19 మంది మృతి చెందడం చాలా బాధాకరం
- చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య

**చేవెళ్ల, నవంబర్ 4 (జనంసాక్షి) :** హైదరాబాద్ బీజాపూర్ జాతీయ రహదారి నిర్మాణం కోసం 2005 నుంచి కృషి చేస్తున్నట్లు చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య వెల్లడించారు. మంగళవారం చేవెళ్ల ఎమ్మెల్యే కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... మిర్జా గూడ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో 19 మంది మృతి చెందడం పలువురు గాయపడడం చాలా బాధాకరమన్నారు. ఈ ప్రమాదంలో కుటుంబాలకు, క్షతగాత్రులకు సానుభూతిని తెలిపారు. నాటి ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ జాతీయ ఉపాధి పథకం ప్రారంభం చేసేందుకు రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం ఆలూరు గ్రామానికి వచ్చినప్పుడు వినతి పత్రం అందించినట్లు గుర్తు చేశారు. నాటి నుంచి నేటి వరకు ఈ రహదారి నిర్మాణం కోసం నిరంతరం కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి చేవెళ్లకి వచ్చినప్పుడు చేవెళ్ల జాతీయ రహదారి నిర్మాణం కోసం ప్రతి పాదనలు పెట్టినట్లు వెల్లడించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఈ రోడ్డు నిర్మాణంకు నిరంతరం కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. కేంద్రంలో ఉన్న నాటి కాంగ్రెస్ ప్రభుత్వం, కేంద్ర మంత్రులు



హైదరాబాద్ బీజాపూర్ జాతీయ రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు చేశారని అన్నారు. కేంద్రంలో వచ్చిన బిజెపి ప్రభుత్వం, తెలంగాణలోని బిఆర్ఎస్ ప్రభుత్వం కేంద్ర రవాణా శాఖ మంత్రి కలిసి తర్వాత నేషనల్ హైవేగా రూపాంతరం చెందిందన్నారు. అన్ని అనుకున్న సమయానికి వచ్చే సమయంలో పర్యావరణ ప్రేమికులు ఎన్జీటీలో కేసు వేయడంతో కాలయాపన జరగడం మీ అందరి తెలిసిందే. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి ఇటీవల స్టే వికెట్ చేయించడం జరిగిందన్నారు పలుమార్లు పర్యావరణ ప్రేమికులతో స్పెషల్ సెక్రటరీ శ్రీనివాసరాజుతో కలిసి నేను, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి పలుమార్లు సమావేశం నిర్వహించి పర్యావరణ ప్రేమికులతో చర్చించి స్టే వికెట్ చేసే విధంగా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు సీఎం కృషి వల్ల అక్టోబర్ 31న ఎన్జీటీలో ఉన్న కేసు ను వికెట్ చేసినట్లు తెలిపారు. వికారాబాద్ రంగారెడ్డి జిల్లాలోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గాలకు వెళ్లే ప్రధాన రహదారి ఇదే అని గుర్తు చేశారు. అప్ప జంక్షన్ నుంచి చేవెళ్ల మీదుగా చిట్టెంపల్లి గేటు వరకు నా పరిధి, చిట్టెం పల్లి గేట్ నుంచి మన్నెగూడ పరిగి వరకు రామ్మోహన్ రెడ్డి పరిధిని ఇద్దరం కలిసి చేవెళ్ల, పరిగి, వికారాబాద్, తాండూర్, కొడంగల్ నియోజకవర్గం తోపాటు కర్ణాటక రాష్ట్రంలోకి ఈ రహదారి కుండా రాకపోకలు సాగిస్తున్నట్లు చెప్పారు. అయితే సోమవారం జరిగిన దుర్ఘటన నన్ను ఎంతో కలిసిందని ఆ కుటుంబాలకు తీరని అన్యాయం జరిగిందని ప్రభుత్వపరంగా వచ్చే ఆర్థిక సాయం అందించే విధంగా చర్యలు తీసుకుంటామని అని అన్నారు. యూట్యూబ్ ఛానల్ పేరుతో, ఆన్లైన్ పత్రికలు పేరుతో తప్పుడు ప్రచారం చేస్తున్నట్లు అది మంచి పద్ధతి కాదని సూచించారు. ఆన్లైన్ పత్రికలు కొన్ని యూట్యూబ్ ఛానల్ తప్పుడు ప్రచారాన్ని మానుకోవాలని ప్రజలను తప్పుదోవ పట్టించే విధంగా ఉంటుందని అన్నారు. ఈ సమావేశంలో చేవెళ్ల పిఎసిఎస్ చైర్మన్ దేవర వెంకట్ రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు బండారు అగి రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్య గౌడ్, వైస్ చైర్మన్ రాములు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వీరేందర్ రెడ్డి, మాజీ సర్పంచ్ పడాల ప్రభాకర్, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పాండు యాదవ్, కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా మహేష్ తదితరులున్నారు.

## జాతీయ లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకోవాలి

- ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.శిరీష



**రామన్నపేట, నవంబర్ 4 (జనంసాక్షి) :** పెండింగ్ కేసుల సత్వర పరిష్కారం కోసం ఈ నెల 15న నిర్వహించే ప్రత్యేక లోక్ అదాలత్ ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్. శిరీష కోరారు. మంగళవారం రామన్నపేట సర్కిల్ పరిధిలోని పోలీసు అధికారులతో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ఎస్.శిరీష సమక్షంలో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జడ్జీ మాట్లాడుతూ పెండింగ్ లో ఉన్న కేసులు వేగవంతంగా పరిష్కారం అయ్యేలా అన్ని విభాగాల అధికారులు, న్యాయవాదులు, సంబంధిత సిబ్బంది సమన్వయంతో పని చేయాలని సూచించారు. లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరించుకోవడానికి కక్షిదారులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎన్. వేంకటేశ్వర్లు, రామన్నపేట, వలిగొండ, ఎస్ఐలు డి.నాగరాజు, యుగేందర్ గౌడ్, నాగరాజు, తెలంగాణ గ్రామీణ వికాస్ బ్యాంక్ మేనేజర్, పోలీస్ సిబ్బంది, కోర్టు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# బాల్య వివాహాలు అక్రమ దత్తత చట్టరీత్యా నేరం

**వేములపల్లి/మాడ్గులపల్లి నవంబర్ 4 (జనంసాక్షి) :** బాల్య వివాహాలు అక్రమ దత్తతచట్టరీత్యా నేరమని ఐసిడిఎస్ వేమనపల్లి సెక్టార్ సూపర్వైజర్ పరిమి రజిని అన్నారు. మంగళవారం ఐసిడిఎస్ దామర చర్ల ప్రాజెక్టు పరిధిలోనివేములపల్లి మండలం రావులపెంట గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన భేటీ బచావో బేటి పడావో కార్యక్రమంలో సూపర్వైజర్ పరిమి రజిని పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలు ,అక్రమ రవాణా , అక్రమ దత్తత, భ్రూణ హత్యలు,చట్టరీత్యానేరమని అందుకు శిక్ష అర్హులని విద్యార్థులకువివరించారు. విద్యార్థులు కష్టపడి చదువు చదువుకొని జీవితం లో ఉన్నత స్థాయికి ఎదగాలని సంపూర్ణఆరోగ్యాని కి పోషకాహారముతీసుకోవాలనివ్యక్తిగతపరిశుభ్రత పాటించాలని సూచించారు. ఆపద సమయంలో ఆడపిల్లలు 1098, 100 టోల్ ఫ్రీ నెంబర్లకు ఫోన్ నెంబర్లకు ఫోన్ చేసి తమను తామురక్షించుకోవాల న్నారు . ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు అమరేందర్ రెడ్డి ,ఉపాధ్యా యులు ఉపాధ్యాయులు శ్రీధర్, కృష్ణయ్య ,నిర్మల, వసుంధర, నాగమణి, అంగన్వాడీ టీచర్లు శారద, వెంకటరమణ బాలబాలికలు పాల్గొన్నారు.

మాడ్గులపల్లి మండలం కన్నెకల్ గ్రామంలో ఐసిడిఎస్ దామరచర్ల ప్రాజెక్టు పరిధిలోనిమాడ్గుల పల్లి మండలం కన్నేకల్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం బేటి బచావో బేటిపడావోకార్యక్రమంనిర్వహించారు. ఈసందర్భంగా ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు గౌతమి పది నిమిషాలు ధ్యానం చేయించారు అనంతరం ఐసిడిఎస్ మాడు ఐసిడిఎస్ మాడ్గులపల్లి సెక్టర్



సూపర్వైజర్ లక్ష్మి బాల్య వివాహాలు, భ్రూణ హత్యలలు నేరమని పౌష్టిక లోపంతో బరువు తక్కువ పిల్లలు పుడతారని తద్వారామానసికంగా శారీరకంగా ఎదుగుదల ఉండదన్నారు. పిల్లల అక్రమ దత్తత చట్టరీత్యా విరుద్ధమని జేజే యాక్ట్ 2015 సెక్షన్ 80.81 ప్రకారంగా పిల్లలను చట్టవిరుద్ధంగా పెంచుకోవడం దత్తత ఇవ్వడం నేరమని ఇందుకు మూడు సంవత్సరాల జైలు శిక్ష ఉంటుందని అదే విధంగా బాలికలపై లైంగిక చర్యలకు పాల్పడినట్లయితే పోస్కో 2012 ద్వారా కఠినంగా జైలు శిక్ష ఉంటుందన్నారు. విద్యార్థినిలు అప్రమత్తంగా ఉండాలని పిల్లలపై లైంగిక వేధింపులు జరిగినట్లు తెలిస్తే వెంటనే 100 కి కానీ 1098 కి డయల్ చేయాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కార్లే పాఠశాల ఉపాధ్యాయులు గౌతమి రవీందర్ రెడ్డి, అంగన్వాడీ టీచర్లు సోనీ,సుజాత,ధనమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# వరద ముంపు లేకుండా పక్కా ఏర్పాట్లు

- ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి

**చౌటుప్పల్, నవంబర్ 4 (జనం సాక్షి) :** భవిష్యత్తులో ఎంత పెద్ద వర్షం వచ్చినా ఎటువంటి వరద ఇబ్బందులు కలగకుండా, పక్కా ప్రణాళికలు రూపొందిస్తున్నామని మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తెలిపారు. చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని వరద ప్రభావిత ప్రాంతాలను స్థానిక నాయకులు, అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించారు. లోతట్టు ప్రాంతాలు నీట మునగకుండా ఉండేందుకు ఎమ్మెల్యే వరద ప్రవాహాన్ని దగ్గర నుండి పరిశీలించి, నీటిని మళ్లించడానికి తక్షణమే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని స్థానిక రెవెన్యూ డివిజనల్ అధికారి, మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ, అధిక వర్షాల కారణంగా చెరువులన్నీ నిండుకుండలా మారాయన్నారు. గతంలో, చెరువులు నిండిన తర్వాత వచ్చే వరదతో చౌటుప్పల్ మున్సిపాలిటీ ఎడమ వైపు ఉన్న ప్రాంతమంతా వారం రోజుల పాటు నీటిలోనే ఉండేదన్నారు. ఈ వరద ముప్పును ముందే గ్రహించి, నీరు



ముంచకుండా ఉండేందుకు వరద డైవర్షన్‌ను చేపట్టామని తెలిపారు. నేషనల్ హైవే అథారిటీ సర్వీస్ రోడ్డు పక్కన నిర్మించిన డ్రైనేజ్ కారణంగా కాలనీలలో కురిసిన భారీ వర్షాల నీరు కిందికి రాకుండా డ్రైన్ అడ్డంకిగా మారిందన్నారు. వరద నీరు, డ్రైనేజీ నీరు ఎక్కడ నిల్వ ఉండకుండా సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని ఆర్డీవోను ఆదేశించారు. తక్షణమే ప్రత్యామ్నాయ పనులను ప్రారంభించాలని,ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు.

## ప్రయివేట్ ట్రావెల్ బస్సు, ట్రాక్టర్ ఢీ

- తృటిలో తప్పిన పెను ప్రమాదం



**మాడ్గులపల్లి, నవంబర్ 4 (జనంసాక్షి) :** మండలంలోని కుక్కడం గ్రామ సమీపంలో మంగళ వారం తెల్లవారుజామున నార్కట్ పల్లి – అద్దంకి రహదారి పై ధాన్యం లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ ను వెనుక నుంచి అతివేగంగా వస్తున్న ప్రైవేట్ ట్రావెల్ బస్సు ఢీ కొట్టడంతో తృటిలోపెను ప్రమాదం తప్పింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ పై ప్రయాణిస్తున్న నలుగురికి గాయాలు అయ్యాయి. ప్రమాదంలో ఎలాంటి ప్రాణ నష్టంజరగపోవడంతోప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.క్షతగాత్రులను స్థానికులు పోలీసులు చికిత్స నిమిత్తం మిర్యాలగూడ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కావలి నుంచి ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు హైదరాబాదుకు వెళు ండగా ఘటన జరిగింది.ప్రమాద సమయంలో బస్సులో 45 మంది ప్రయాణికులు ఉన్నారు. స్థానిక ఎస్ఐ కృష్ణయ్య ప్రమాద స్థలానికి చేరుకొని ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా అవసరమైన చర్యలు తీసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## యువకుడు వేధింపులకు తట్టులేక మహిళ ఆత్మహత్య



**నేరేడుచర్ల, నవంబర్ 4 (జనంసాక్షి) :** ఓ యువకుడు వేధింపులకు తట్టులేక ఓ మహిళ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం నేరేడుచర్ల పట్టణంలో జరిగింది. ఎస్ఐ రవీందర్ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం...నేరేడుచర్లకు చెందిన తవుడోజు అనూషకు గత 9 సంవత్సరాల క్రితం వేములపల్లి కి చెందిన దాసోజు జితేందర్‌తో వివాహం అయ్యింది.ఎ వారికి ఒక కూతురు జన్మించింది. 7 సంవత్సరాల క్రితం భర్తతో విడిపోయింది. 4 సంవత్సరాల క్రితం తన తండ్రి మరణించడంతో నేరేడుచర్ల పట్టణంలోని మేనమామ సొల్లేటి సోమాచారి ఇంటి పక్కన ఓ ఇంట్లో కిరాయికి ఉంటూ,ఎస్ ఎస్ రెడీమేడ్ బట్టల షాపులో పనిచేస్తున్న సమయంలో నరసయ్య గూడెంకు చెందిన నన్నే పంగు మధుతో పరిచయం ఏర్పడింది. అనూష వేరే అతనితో మాట్లాడుతున్నదని అనుమానిస్తూ అతడు గత కొద్దిరోజులుగా ఆమెను వేధిస్తున్నాడు. వేదింపులు తట్టుకోలేక ఈనెల 2వ తేదీన మధ్యాహ్నం ఇంట్లో చున్నీతో సీలింగ్ ఫ్యాన్ కు ఉరివేసుకోగా,తన కూతురు చూసి సోమాచారికి సమాచారం అందించగా వెంటనే ఆమెను మిర్యాలగూడలోని మ్యాక్స్ కేర్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆమె మంగళవారం మరణించింది. మృతురాలి మేనమామ సొల్లేటి సోమాచారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

## బస్సు ప్రమాదంలో గాయపడిన వారికి భరోసా..



**తాండూరు, నవంబర్ 4 (జనంసాక్షి) :** బస్సు ప్రమాదంలో గాయపడిన వారికి మాజీ ఎమ్మెల్యే పైలెట్ భరోసా కల్పించారు.సోమవారం చేవెళ్ల బస్ ప్రమాదం లో మరణించిన కుటుంబాలను తాండూర్ మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి పరామర్శించారు, తాండూర్ పట్టణ ప్రాంత వాసులు ఖలీద్, ముస్కాన్,తబస్సుం, యాలల్ మండలం లక్ష్మి నారాయణపూర్‌లో అఖిల రెడ్డి అంత్యక్రియలో పాల్గొని కుటుంబాన్ని ఓదార్చారు, యాలాల మండలం పేర్కంపల్లి, గ్రామంలో నందిని,తానుష, సాయి ప్రియ, కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం తెలిపారు, యాలాల మండలం హాజీపూర్, గ్రామంలో తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారులను ఓదార్చి చిన్నారులకు ఎల్లవేళలా తోడ్పాటు అందిస్తానని ఆయన తెలిపారు, మృతుల కుటుంబాలకు పదివేల చొప్పున ఆర్థిక సహాయాన్ని అందించారు.

## రోడ్డు ప్రమాదం కలచివేసింది



**మొయినాబాద్, నవంబర్ 4 (జనంసాక్షి) :** రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం మిర్జగూడ స్టేజి వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తాండూర్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు, టిప్పర్ ఢీకొన్న ఈ దుర్ఘటనలో 20 మంది ప్రయాణికులు మృతి చెందిన ఈ విషాద రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను. వాళ్ల కుటుంబ సభ్యులకు దేవుడు మనోధైర్యం ఇవ్వాలని ప్రార్థిస్తున్నాను. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని వారి కుటుంబాలకు దేవుడు మనోధైర్యం ఇవ్వాలి అని ఆకాంక్షిస్తున్నాను. మృతుల కుటుంబాలను, గాయపడిన వారిని ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.. నగరానికి అతి సమీపంలో ఉన్న చేవెళ్ల అభివృద్ధి మాత్రం శూన్య హస్తంగా మిగిలింది. ఇలాంటి సంఘటనలు జరగకుండా ప్రభుత్వాలు సత్వర చర్యలు తీసుకొని ఈ రోడ్డు నిర్మాణానికి కృషి చేయగలరని మొయినాబాద్ బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు దారెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు.

## అయ్యప్ప దీక్షాపరులకు అన్నదానం చేసిన ముస్లిం సోదరుడు



**పి.ఏ.పల్లి, నవంబర్ 4 (జనంసాక్షి) :** పి.ఏ.పల్లి మండలంలోని అంగడిపేట సన్నిధానంలో అయ్యప్ప మండల దీక్ష చేపట్టిన స్వాములకు అంగడిపేటకు చెందిన ఎండి జహంగీర్ అన్నదానం చేశారు.గత కొంతకాలంగా కులమతాలకు భిన్నంగా ప్రతి యేటా అయ్యప్ప స్వాములకు ఒక్కరోజు బిక్ష ఏర్పాటు చేసి హిందూ సోదరులు,ముస్లిం సోదరులు ఒకటే అనే భావాన్ని సమాజానికి చాటిచెప్పుతున్నాడు.మంగళవారం అంగడిపేట అయ్యప్ప సన్నిధిలో 100 మంది స్వాములకు ఒక్కరోజు బిక్ష ఏర్పాటు చేశాడు.ఈ సందర్భంగా స్వాములు ఎండి.జహంగీర్ ను సన్మానించి,అయ్యప్ప ఆశీస్సులు ఎల్లప్పుడూ కలిగి ఉండాలని ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో గురు స్వాములు బైరా యాదగిరి స్వామి,కుక్కల గోవర్ధన్ రెడ్డి స్వామి,అలుగుబెల్లి శ్రీనివాస్ రెడ్డి స్వామి, స్వాములు బొల్లు సత్యనారాయణ,యాదయ్య,ధర్మపురం శ్రీను,చిరంజీవి, మల్లయ్య, కృష్ణారెడ్డి, పిల్లి రామయ్య ఉన్నారు.

# ఆరోగ్యంపై శ్రద్ధ పెంచడానికే మెడ్ ఎక్స్ 2025

**సూర్యాపేట ప్రతినిధి, నవంబర్ 4 (జనంసాక్షి) :** విద్యార్థులకు వైద్య విద్యపై ఆసక్తి, ఆరోగ్యంపై శ్రద్ధ పెంచడానికి మెడ్ ఎక్స్ 2025 దోహదపడుతుందని ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జయలత అన్నారు.రెండు రోజులుగా జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీలో నిర్వహించిన మెడ్ ఎక్స్ 2025 మెడికల్ ఎగ్జిబిషన్ ముగింపు సందర్భంగా మంగళవారం వివిధ రకాల మెడికల్ ఎగ్జిబిషన్లను పరిశీలించిన సందర్భంగా ఆమె మాట్లాడారు.మెడ్ ఎక్స్ 2025 ఎగ్జిబిషన్ కార్యక్రమంలో వివిధ పాఠశాలలు,ఫార్మసి, నర్సింగ్ కళాశాలల నుండి వేలాది మంది విద్యార్థులు పాల్గొని మెడికల్ కాలేజ్ నందు ఏర్పాటు చేసిన వివిధ విభాగాలను సందర్శించారని తెలిపారు. విద్యార్థులకు వైద్యరంగం పట్ల, ఆరోగ్యం పట్ల చెప్పాల్సిన అన్ని విషయాలను కూడా ప్రదర్శనలో సోదారణంగా, ప్రయోగాత్మకంగా వివరించినట్లు వెల్లడించారు.తరగతి గదులలో విద్యార్థులు పాఠ్యాంశాలలో నేర్చుకున్న విషయాలను మెడికల్ ఎగ్జిబిషన్ ద్వారా ప్రాక్టికల్ గా కళ్లకు కట్టినట్టుగా ప్రదర్శించడం జరిగిందన్నారు. నేడు వైద్యరంగంలో వస్తున్న వివిధ సాంకేతిక పరికరాలు, వాటి పనితీరు ఆపదలో ఉన్న వారికి ఏ విధమైన వైద్యం అందిస్తారనే విషయాలను ఈ ఎగ్జిబిషన్ ద్వారా విద్యార్థులకు తెలియజేసినట్లు తెలిపారు.చనిపోయిన మనిషి శరీరం చూపిస్తూ మానవ శరీరంలో ఉండే వివిధ భాగాలు



పనిచేసే విధానం వివరించారని తెలిపారు. ఆకస్మాత్తుగా గుండె ఆగిపోయిన వారికి సిపిఆర్ ద్వారా ఎలా బతికించాలి, నార్మల్ డెలివరీ ఎలా చేయాలి, పాముకాటుకి, కుక్క కాటు గురైన వారికి ఎటువంటి చికిత్స అందించాలి, పురుగుమందులు తాగిన వారికి ఎటువంటి ప్రాథమిక చికిత్స అందించాలనే విషయాలను విద్యార్థులకు అర్థమయ్యే విధంగా తెలియజేశామని చెప్పారు.రోడ్డు ప్రమాదాలకు గురైన వారికి తక్షణమే ఎటువంటి వైద్యం అందించాలనే విషయాల మీద ప్రాక్టికల్ గా అవగాహన కల్పించినట్లు తెలిపారు. విద్యార్థులకు వైద్య రంగం పట్ల ఆసక్తి కనపరచటానికి మెడ్ ఎక్స్ 2025 ఎంతగానో తోడ్పడిందని, విద్యార్థులు సద్వినియోగం చేసుకున్నారని తెలిపారు.డ్రగ్స్ కు బానిసలు కావడం వల్ల ఎటువంటి నష్టం జరుగుతుంది, మన శరీరం మీద డ్రగ్స్ ప్రభావం ఏమిటనే విషయాలను విద్యార్థులకు వివరించామని వెల్లడించారు.సెల్ ఫోన్ అధికంగా వాడటం వల్ల అది మన బ్రెయిన్ మీద, ఇతర విభాగాల మీద ఏ విధంగా దుష్ప్రభావం కలిగిస్తుందనే విషయాలను కూడా విద్యార్థులకు స్పష్టంగా వివరించినట్లు చెప్పారు. ఏదైనా క్రైమ్ జరిగినప్పుడు అక్కడికి ఫోరెన్సిక్ నిపుణులు వెళ్లి అక్కడ ఎలా క్లూస్ సేకరించాలనే విషయం విద్యార్థులకు ప్రయోగాత్మకంగా ప్రదర్శించడం జరిగిందని వివరించారు. మహిళలకు పోషకార లోపంతో వచ్చే ఆరోగ్య సమస్యలు, మహిళకు ఎక్కువగా వచ్చే గర్భాశయ క్యాన్సర్ బ్రెస్ట్ క్యాన్సర్ గురించి, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి కూడా తెలియజేస్తున్నట్లు చెప్పారు.ఈ మెడికల్ ఎగ్జిబిషన్ లో పలు వైద్య విభాగాల విభాగాల అధిపతులు, ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, డాక్టర్లు చిన్నం గీత, శ్రీకాంత్, బొల్లంపల్లి బాబురావు, జటావత్ వెంకట దుర్గా శివప్రసాద్, నిషాణం గురు రాజ్, తరుణి, జిమియా, ఈశ్వరమ్మ, జల్లి పద్మజ, బుక్కె ఆనంద్ కుమార్, పారుపల్లి సతీష్, అరుణ కుమారి, శ్రీకాంత్ బట్, రాధిక, పద్మావతి, జమీమా, ఈశ్వరమ్మ, రఘురామిరెడ్డి, అర్చన, యశ్వంత్, కిరణ్మయి, వివాస్వన్, సూపరింటెండెంట్ ఈశ్వర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.




## ధరలు పెరుగుతాయ్.. వెండికి ఫుల్ డిమాండ్!



భారతదేశంలో బంగారం ధరల మాదిరిగానే.. వెండి ధరలు కూడా గణనీయంగా పెరిగి, అక్టోబర్ నెలలో రూ. 2 లక్షలకు (కేజీ) చేరుకుంది. అయితే నేడు (నవంబర్ 4) సిల్వర్ రేటు రూ.1.65 లక్షల వద్ద ఉంది. అంటే ఏ స్థాయిలో వెండి రేటు తగ్గిందో స్పష్టంగా అర్థం చేసుకోవచ్చు. కానీ.. వెండి ధరలు భవిష్యత్తులో భారీ పెరిగే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు.భారీగా పెరిగిన వెండి ధరలు, కొనుగోలుదారులను కొంత కలవరపెట్టినా.. ఇటీవల కొంత తగ్గుముఖం పట్టినట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఎఎమ్‌సిలో ఇన్వెస్ట్‌మెంట్ స్ట్రాటజీ ప్రిన్సిపల్ 'చింతన్ హరియా' మాట్లాడుతూ.. వెండిని ఆభరణంగా మాత్రమే కాకుండా.. పారిశ్రామిక రంగంలో కూడా ఉపయోగిస్తారు. కాబట్టి వెండి వినియోగం పెరుగుతుంది. తద్వారా రేటు పెరుగుతుందని అన్నారు. వెండికి డిమాండ్ పెరుగుతూ ఉండటం వల్ల.. గత మూడేళ్ళలో సిల్వర్ రేటు 30శాతం పెరిగిందని పేర్కొన్నారు.వెండిని.. ఎలక్ట్రిక్ వాహనాలు, పునరుత్పాదక శక్తి, టెలికాం, వైద్య సాంకేతికత, బయోఫార్మా వంటి పరిశ్రమలలో విరివిగా ఉపయోగిస్తున్నారు. అంతే కాకుండా.. సౌర ఫలకాలు, బ్యాటరీలు, ఎలక్ట్రానిక్ భాగాలలో కూడా సిల్వర్ కీలకంగా మారింది. ఇవన్నీ వెండి డిమాండును అమాంతం పెంచడంలో దోహదపడ్డాయి. ఇది ధరలను భారీగా పెంచే అవకాశం ఉందని చేబడుతున్నారు.

ఈరోజు సిల్వర్ ధరలు:మంగళవారం వెండి రేటు రూ. 3000 తగ్గింది. దీంతో హైదరాబాద్, విజయవాడ, బెంగళూరు నగరాల్లో కేజీ సిల్వర్ రేటు రూ. 1.65 లక్షల వద్ద ఉంది. ఢిల్లీలో మాత్రం కేజీ వెండి ధర రూ. 1.51 లక్షల వద్ద ఉంది. దీన్నిబట్టి చూస్తే.. దేశంలోని ఇతర ప్రధాన నగరాలతో పోలిస్తే.. ఢిల్లీలో సిల్వర్ రేటు కొంత తక్కువ అని తెలుస్తోంది.

# దేశంలోనే ధనిక జిల్లాగా రంగారెడ్డి

**జనంసాక్షి:**తెలంగాణలోని రంగారెడ్డి జిల్లా తలసరి స్థూల జిల్లా ఉత్పత్తి (జీడీపీ పర్ క్యాపిటా) పరంగా భారతదేశంలో అత్యంత ధనిక జిల్లాగా అవతరించింది. పట్టణ అభివృద్ధి, మెట్రోపాలిటన్ మౌలిక సదుపాయాలు స్థానిక ఆర్థిక వ్యవస్థను ఎంతలా మార్చగలవో చెప్పడానికి ఇది ఒక ఉదాహరణ అని కొందరు భావిస్తున్నారు.కొన్ని సర్వేల్లో వెల్లడించిన వివరాల ప్రకారం రంగారెడ్డి జిల్లా తలసరి జీడీపీ సుమారుగా రూ.11.46 లక్షలుగా ఉంది. ఇది భారతదేశంలో ఇతర జిల్లాల కంటే అత్యధికం కావడం గమనార్హం. గతంలో అగ్రస్థానంలో ఉన్న గురుగావ్ (హరియాణా), బెంగళూరు అర్బన్ (కర్ణాటక) వంటి జిల్లాలు కూడా రంగారెడ్డి కంటే ఈసారి వెనుకబడ్డాయి. అయితే తలసరి జీడీపీ జనాభాను బట్టి మారుతుంటుందని గమనించాలి.

రంగారెడ్డి జిల్లా అగ్రస్థానంలో నిలవడానికి కారణాలు

ఐటీ కారిడార్, టెక్ పార్కులు

రంగారెడ్డి జిల్లాలో ఐటీ, ఐటీ అనుబంధ సేవల రంగం విపరీతంగా అభివృద్ధి చెందింది. సైబరాబాద్, గచ్చిబౌలి, మాదాపూర్ వంటి హైదరాబాద్‌లోని ప్రధాన ఐటీ హబ్‌లకు ఈ జిల్లా ఆనుకొని ఉండటం లేదా ఆ హబ్‌లలోని కొంత భాగం జిల్లా పరిధిలో ఉండటం దీనికి ముఖ్య కారణం. ఇక్కడ అనేక ప్రముఖ టెక్ పార్కులు, బహుళజాతి సంస్థల



కార్యాలయాలు, స్టార్టప్ కంపెనీలు నెలకొన్నాయి. ఈ ప్రాంతం అధిక వేతనాలు, నైపుణ్యం కలిగిన మానవ వనరుల ఆకర్షణకు కేంద్రంగా మారింది.

ఔషధ, బయోటెక్ పరిశ్రమలు: రంగారెడ్డి జిల్లా చుట్టూ అనేక ఫార్మాస్యూటికల్, బయోటెక్నాలజీ క్లస్టర్లు ఉన్నాయి. దేశంలోనే అతిపెద్ద లైఫ్ సైన్సెస్ పరిశ్రమకు ఈ జిల్లా ముఖ్యమైన కేంద్రంగా మారింది. పెద్ద ఎత్తున పరిశోధన, అభివృద్ధి ఉత్పత్తి యూనిట్లు ఇక్కడ ఉండటం వలన ఆర్థిక వ్యవస్థకు అధిక విలువ, ఉద్యోగ కల్పన జరుగుతోంది.


రియల్ ఎస్టేట్ రంగం వృద్ధి:ఐటీ, పారిశ్రామిక వృద్ధి ఫలితంగా రియల్ ఎస్టేట్ రంగంలో భారీ వృద్ధి నమోదైంది. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ వంటి ప్రధాన నగర ప్రాంతాల నుంచి మొదలైన రియల్ ఎస్టేట్ కార్యకలాపాలు రంగారెడ్డి జిల్లాలోని హై-ఎండ్ రెసిడెన్షియల్, కమర్షియల్ ప్రాపర్టీల వైపు విస్తరించాయి. భూముల ధరలు, ఆస్తుల విలువ పెరగడం కూడా జిల్లా తలసరి జీడీపీ పెరగడానికి ఒక ముఖ్య కారణం.

మెరుగైన కనెక్టివిటీ, మౌలిక సదుపాయాలు: శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం ఈ జిల్లాలోనే ఉంది. ఔటర్ రింగ్ రోడ్డు వంటి అత్యాధునిక రహదారులు, మెట్రోపాలిటన్ మౌలిక సదుపాయాలు, మెరుగైన కనెక్టివిటీ (రవాణా) కారణంగా పెట్టుబడులను, వ్యాపార కార్యకలాపాలను ఈ ప్రాంతం ఆకర్షించగలిగింది. ఈ మౌలిక సదుపాయాలు పారిశ్రామిక, వాణిజ్య కార్యకలాపాలకు దోహదపడ్డాయి.

## 48 గంటల్లో టికెట్ క్యాన్సిల్ చేసుకుంటే..

**న్యూఢిల్లీ:** ఫ్లైట్ టికెట్లకు సంబంధించిన రీఫండ్ నిబంధనల్లో కొన్ని మార్పులు చేసినట్లు.. డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ వెల్లడించింది. ప్రయాణికులు టికెట్ బుక్ చేసుకున్న 48 గంటలోపు అదనపు చార్జీలు లేకుండానే రద్దు చేసుకోవచ్చు, లేదా మార్పులు చేసుకోవచ్చు. రీఫండ్ కూడా వేగవంతంగా పూర్తవుతుందని డీజీసిఏ ప్రకటించింది.టికెట్ బుక్ చేసుకున్న 48 గంటల పాటు విమానయాన సంస్థలు "లుక్-ఇన్ ఆప్షన్" అందించాలి. ఈ కాలంలో అదనపు ఛార్జీలు లేకుండా ప్రయాణీకులు తమ టిక్కెట్లను రద్దు చేసుకోవడానికి లేదా మార్చడానికి అనుమతించాలని డీజీసిఏ పేర్కొంది. దేశీయ విమానాలకు ఐదు రోజుల్లోపు.. అంతర్జాతీయ విమానాలకు 15 రోజుల్లోపు ఎయిర్‌లైన్ వెబ్‌సైట్ ద్వారా నేరుగా టికెట్ బుక్ చేసుకుంటే ఈ సౌకర్యం అందుబాటులో ఉండదు.క్రెడిట్ కార్డుల ద్వారా చెల్లింపులు జరిపిన సందర్భంలో.. విమానయాన సంస్థలు టికెట్ రద్దు చేసిన ఏడు రోజుల్లోపు తిరిగి చెల్లిస్తుంది. నగదు చెల్లింపుపు ద్వారా టికెట్ బుక్ చేసుకుంటే.. మీరు రద్దు చేసుకున్న వెంటనే డబ్బు అందుతుంది. అయితే ట్రావెల్ ఏజెంట్లు లేదా పోర్టల్స్ ద్వారా టిక్కెట్లు బుక్ చేసుకుని.. 48 గంటల్లో రద్దు చేసుకుంటే.. డబ్బు వాపసు అనేది 21 పని దినాలలో మీకు జమ అవుతుంది.






## వొడాఫోన్-ఐడియా బకాయిలపై మదింపు చేయవచ్చు.. సుప్రీంకోర్టు

వొడాఫోన్-ఐడియా అడ్జస్టెడ్ గ్రాస్ రెవెన్యూ బకాయిలకు సంబంధించి సుప్రీంకోర్టు స్పష్టత ఇచ్చింది. 2016-17 ఆర్థిక సంవత్సరం వరకు ఉన్న వొడాఫోన్-ఐడియా అన్ని ఏజీఆర్ బకాయిలను ఫిబ్రవరి 3, 2020 నాటి మార్గదర్శకాల ప్రకారం సమగ్రంగా మదింపు చేసి, సరిదిద్దే అధికారం కేంద్ర ప్రభుత్వానికి ఉందని సుప్రీంకోర్టు పేర్కొంది.సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం ఈమేరకు స్పష్టతనిచ్చింది. వొడాఫోన్-ఐడియా తరపు న్యాయవాదులు ముకుల్ రోహత్గి, మహేష్ అగర్వాల్ మౌఖికంగా చేసిన విజ్ఞప్తిపై ఈ నిర్ణయం తీసుకుంది. అక్టోబర్ 27న కోర్టు ఇచ్చిన ఉత్తర్వులోని ఆరో పేరాలో అదనపు ఏజీఆర్ డిమాండ్‌ను మాత్రమే సరిదిద్దాలని టెలికాం సంస్థ కోరినట్లు పొరపాటున పేర్కొనబడిందని కంపెనీ కోర్టు దృష్టికి తెచ్చింది.

## ఒకటే బ్రాండ్.. లక్ష మంది కొన్నారు!



2020లో ఎంజీ మోటార్ కంపెనీ.. జెడ్ఎస్ ఈవీ కారును లాంచ్ చేయడంలో ఎలక్ట్రిక్ వాహన విభాగంలోకి అడుగుపెట్టింది. అప్పటి నుంచి ఈ సంస్థ ఒక లక్ష కంటే ఎక్కువ ఈవీలను విక్రయించి, అమ్మకాల్లో సరికొత్త మైలురాయిని చేరుకున్నట్లు మోటార్ ఇండియా ప్రకటించింది. ప్రారంభంలో జెడ్ఎస్ ఈవీను లాంచ్ చేసిన.. ఎంజీ మోటార్ కంపెనీ, ఇప్పుడు కామెట్ ఈవీ, విండ్సర్ ఈవీలను లాంచ్ చేసి, మార్కెట్లో విక్రయిస్తోంది. ఇవి కూడా ప్రతి నెలా ఉత్తమ అమ్మకాలను పొందుతున్నాయి. కంపెనీ మొత్తం అమ్మకాల్లో.. ప్రస్తుతం 70-80 శాతం ఎలక్ట్రిక్ వాహనాలే ఉన్నాయని సంస్థ స్పష్టం చేసింది.భారతదేశ ఎలక్ట్రిక్ వాహనాల మార్కెట్లో 26 శాతం వాటాను కలిగిన ఎంజీ మోటార్ 2024 చివరి నాటికి 34 శాతానికి పెరిగింది. కాగా కంపెనీ 2025 ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు 26640 ఎలక్ట్రిక్ కార్లను విక్రయించింది. ఇది అంతకు, ముందు సంవత్సరంతో పోలిస్తే 220 శాతం ఎక్కువ కావడం గమనార్హం.ఎంజీ మోటార్ ఎలక్ట్రిక్ వాహన విభాగంలో.. జెడ్ఎస్ ఈవీ, కామెట్ ఈవీ, విండ్సర్ ఈవీ వంటివి మాత్రమే కాకుండా, ఎం9 అనే ప్రీమి యం ఎంపీవీ కూడా ఉంది. దీని ప్రారంభ ధర రూ. 69.90 లక్షలు (ఎక్స్ షోరూమ్). ధర కొంత ఎక్కువగా ఉండటం వల్ల అమ్మకాలను ఇది దోహదపడనప్పటికీ.. లగ్జరీ ఎలక్ట్రిక్ కారు కావాలనుకునే వారికి ఇది మంచి ఎంపిక అవుతుంది.

## భారీ నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు



**ముంబై:**మంగళవారం ఉదయం స్వల్ప నష్టాలతో ప్రారంభమైన దేశీయ స్టాక్ మార్కెట్లు ట్రేడింగ్ క్లోజ్ అయ్యే సమాయానికి భారీ నష్టాలను చవిచూశాయి. సెన్సెక్స్ 519.34 పాయింట్లు లేదా 0.62 శాతం నష్టంతో 83,459.15 వద్ద, నిఫ్టీ 165.70 పాయింట్లు లేదా 0.64 శాతం నష్టంతో..కీనోట్ ఫైనాన్షియల్ సర్వీసెస్, సిల్లీ మాంక్స్ ఎంటర్టైన్మెంట్, 3ఎం ఇండియా, తంగమైల్ జ్యువెలరీ, ఎక్సారో టైల్స్ వంటి కంపెనీలు టాప్ గెయినర్స్ జాబితాలో చేరగా.. ఫిషర్ మెడికల్ వెంచర్స్ లిమిటెడ్, బ్లూ జెట్ హెల్త్‌కేర్, ఫైనోటెక్స్ కెమికల్, ఎస్పీఎల్ ఇండస్ట్రీస్, టీఎస్ఎఫ్ ఇన్వెస్ట్‌మెంట్స్ లిమిటెడ్ కంపెనీలు నష్టాల జాబితాలోకి చేరాయి.

# పరిశోధనల పరంపరలో భారత్ సరికొత్త శకం



• మానవ వనరులు, ఉపాధిపై ప్రభావం • రంగాల వారీగా భారీ ప్రయోజనాలు

**న్యూఢిల్లీ:**పరిశోధన, అభివృద్ధి ఆవిష్కరణల రంగంలో భారత్‌ను విశ్వ గురువుగా నిలబెట్టాలనే లక్ష్యంతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిన్న కీలక నిర్ణయాన్ని ప్రకటించారు.దేశంలో పరిశోధన, అభివృద్ధి, ఆవిష్కరణల కోసం రూ.1 లక్ష కోట్లతో ప్రత్యేక మూలనిధి(రిసెర్చ్, డెవలప్‌మెంట్, ఇన్నోవేషన్‌ని ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు. ప్రధానంగా ప్రైవేట్ రంగం పెట్టుబడులు, భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం ఈ నిధి ముఖ్య ఉద్దేశం. ఈ నిధి భారత్‌ను శాస్త్ర సాంకేతిక హబ్‌గా మార్చడంలో ఎలా ఉపయోగపడుతుందో, వివిధ రంగాలపై దీని ప్రభావం ఎలా ఉండబోతుందో అంచనావేద్దాం. రూ.1 లక్ష కోట్ల ఆర్‌అండ్‌డీ మూలనిధి భారత్‌ను అంతర్జాతీయ శాస్త్ర సాంకేతిక హబ్‌గా తీర్చిదిద్దడంలో కీలకమైన ఉత్ప్రేరకంగా పనిచేయనుంది. ఈ నిధి ద్వారా పరిశోధన ప్రాజెక్టులకు, ముఖ్యంగా 'హై-రిస్క్, హై-ఇంపాక్ట్' (అధిక ప్రమాదం, అధిక ప్రభావం) కలిగిన డీప్‌టెక్ స్టార్టప్‌లకు దీర్ఘకాలికంగా తక్కువ లేదా సున్నా వడ్డీకి రుణాలు లభిస్తాయి. ప్రభుత్వ సంస్థలు అందించే గ్రాంట్‌లతో పోలిస్తే ఇది ప్రైవేట్ సంస్థలకు స్థిరత్వాన్ని ఇస్తుంది.ఈ నిధులను నేరుగా పరిశ్రమలకు అందించకుండా సెకండరీ లెవల్ ఫండ్ మేనేజర్‌ల ద్వారా మళ్లించడం వల్ల నిధుల వినియోగంలో పారదర్శకత పెరుగుతుంది. ఇది ప్రైవేట్ వెంచర్ క్యాపిటల్, ఇతర సంస్థాగత పెట్టుబడిదారులను ఆర్ అండ్ డీ రంగంలోకి మరింతగా ఆకర్షిస్తుంది. ఈజ్ ఆఫ్ డూయింగ్ రీసెర్చ్(పరిశోధనను సులభతరం చేయడం) లక్ష్యంగా ఆర్థిక నియంత్రణలు, విధానాల్లో సంస్కరణలు ప్రవేశపెట్టడం వల్ల ఆవిష్కరణలు వేగవంతమవుతాయి.పరిశోధనలపై పెట్టుబడి పెరిగినప్పుడు అది నేరుగా మానవ వనరుల అభివృద్ధి, ఉపాధి కల్పనపై ప్రభావాన్ని చూపుతుంది. ఆర్ అండ్ డీ కార్యకలాపాలు పెరగడం వల్ల సైంటిస్టులు, ఇంజినీర్లు, డేటా నిపుణులు, డీప్‌టెక్ డెవలపర్లు వంటి అత్యంత నైపుణ్యం కలిగిన నిపుణులకు డిమాండ్ పెరుగుతుంది. ఇది విదేశాలకు వెళ్లాలనుకునే భారతీయ మేధావులను దేశంలోనే నిలుపుకోవడానికి దోహదపడుతుంది. పరిశోధన ఆధారిత సంస్థలు, స్టార్టప్‌లు వృద్ధి చెందడం వల్ల ఉద్యోగుల నైపుణ్యాలను ఎప్పటికప్పుడు మెరుగుపరచాల్సిన అవసరం ఏర్పడుతుంది. దీనివల్ల విశ్వవిద్యాలయాలు, పరిశ్రమల మధ్య సహకారం పెరిగి ప్రామాణికమైన శిక్షణ, విద్య అందుబాటులోకి వస్తుంది.ఇటీవల సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, మ్యాథమెటిక్స్ విద్యలో మహిళల భాగస్వామ్యం (43%తో ప్రపంచ సగటు కంటే ఎక్కువ) గణనీయంగా పెరిగింది. ఈ నిధి మహిళా శాస్త్రవేత్తలకు, ఆవిష్కర్తలకు ఉపాధి అవకాశాల పరంగా కొత్త మార్గాలను తెరిచి సమ్మిళిత ఆవిష్కరణకు తోడ్పడుతుంది.ఈ నిధి మద్దతుతో డీప్‌టెక్ స్టార్టప్‌లు వేగంగా వృద్ధి చెందుతాయి. తద్వారా పరోక్షంగా సేల్స్, మార్కెటింగ్, తయారీ రంగాల్లోనూ వేలాది కొత్త ఉద్యోగాలు పుట్టుకొస్తాయి.

## వంతారాకు ఐరాస సంస్థ 'సైట్స్' ప్రశంసలు

**ముంబ**జంతు సంరక్షణకు భారతదేశం చూపుతున్న నిబద్ధతపై ఐరాస సంస్థ సైట్స్ ప్రశంసల వర్షం కురిపించింది. ఐక్యరాజ్య సమితి పర్యావరణ కార్యక్రమం పరిధిలో పనిచేస్తున్న ఈ సంస్థ తాజాగా విడుదల చేసిన నివేదికలో, వంతారా కాంప్లెక్స్‌లోని గ్రీన్స్ జూలాజికల్ రెస్క్యూ అండ్ రీహాబిలిటేషన్ సెంటర్ రాధా కృష్ణ టెంపుల్ ఎలిఫెంట్ వెల్ఫేర్ ట్రస్ట్ వంటి కేంద్రాలు ప్రపంచ స్థాయి ప్రమాణాలతో పనిచేస్తున్నాయని పేర్కొంది.ఈ నివేదికను రూపొందించడానికి సైట్స్ బృందం భారత్‌లో విస్తృత పరిశీలన జరిపి, రాబోయే 79వ సైట్స్ స్టాండింగ్ కమిటీ సమావేశం కోసం సమగ్ర రిపోర్ట్ సిద్ధం చేసింది. ఈ సమావేశం ఉజ్బెకిస్థాన్‌లోని సమర్కండ్‌లో జరగనుంది.సైట్స్ తన నివేదికలో వంతారా సౌకర్యాలను విశేషంగా ప్రశంసిస్తూ, అక్కడి పశువైద్య సేవలు, వసతులు ప్రపంచ స్థాయి నాణ్యత కలిగినవని పేర్కొంది. "ఈ కేంద్రాలు జాబితాలో ఉన్న జంతువులను కూడా సురక్షితంగా సంరక్షించే సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయని మాకు ఎటువంటి సందేహం లేదు" అని తెలిపింది.అంతేకాకుండా.. వంతారా సంస్థలు అభివృద్ధి చేసిన అధునాతన వైద్య పద్ధతులు, జంతు చికిత్సా విధానాలు అంతర్జాతీయ స్థాయిలో ఆదర్శంగా నిలిచేలా ఉన్నాయని సైట్స్ తెలిపింది. ఈ విజయాలను శాస్త్రీయ సమాజంతో పంచుకోవాలని కూడా ప్రోత్సహించింది. ఈ కేంద్రాలు పూర్తిగా చట్టపరమైన, నైతిక ప్రమాణాలతోనే పనిచేస్తున్నాయని సైట్స్ మిషన్ కీలకంగా ప్రస్తావించిన అంశం.భారత్‌కు అక్రమంగా జంతువులను దిగుమతి చేశారనే ఆధారాలు ఏవీ లేవని నివేదిక స్పష్టం చేసింది. జంతువుల విక్రయం లేదా వాటి సంతానోత్పత్తితో సంబంధం ఉన్న వాణిజ్య కార్యకలాపాలు లేవని తెలిపింది. వాణిజ్య ప్రయోజనాల కోసం దిగుమతులు జరగలేదని స్పష్టంగా పేర్కొంది. వీటి ప్రధాన ఉద్దేశ్యం సంరక్షణ, జాతి పునరుద్ధరణ మాత్రమేనని, భవిష్యత్తులో అడవుల్లో తిరిగి వదిలేలా వీటిని అభివృద్ధి చేస్తున్నామని సంస్థ నిర్వాహకులు వివరించారు.




## ఛత్తీస్‌గఢ్‌లో రైలు ప్రమాదం

**ఎదురెదురుగా ఢీకొన్న ప్యాసింజర్ గూడ్స్ రైలు**

**ఐదుగురి మృతి.. పలువురికి గాయాలు**

మంగళవారం సాయంత్రం 4 గంటల సమయంలో జరిగింది. గేవ్రా నుంచి బిలాస్‌పూర్ వైపు వెళ్తున్న ప్యాసింజర్ రైలు, గూడ్స్‌ట్రైన్‌ను వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో ప్యాసింజర్ రైలు ముందు భాగం గూడ్స్‌ట్రైన్‌పైకి ఎక్కింది. ఒక బోగీ పూర్తిగా దెబ్బతింది. ఈ ప్రమాదంలో నలుగురు మృతి చెందారు. 14 మంది గాయపడినట్లు సమాచారం. వెంటనే అప్రమత్తమైన జిల్లా యంత్రాంగం, రైల్వే యంత్రాంగం ఘటనాస్థలిలో సహాయచర్యలు చేపట్టాయి. దెబ్బతిన్న రైల్ కోచ్‌ల్లో చిక్కుకున్నవారిని రక్షించాయి. ఈ క్రమంలో నాలుగు మృతదేహాలను వెలికితీశాయి.

## అమెరికా హెచ్-1బీ వీసాల జారీ పునరుద్ధరణ

దాదాపు 70శాతం మంది భారతీయులు ఉన్నారు. తాజా ప్రకటన వారికి తీపి కబురే.దరఖాస్తు ప్రాసెసింగ్‌లు తిరిగి ప్రారంభించేందుకు అవసరమైన అన్ని చర్యలను ఓఎఫ్ఎల్‌సీ తీసుకొంటుందని తెలిపింది. ఈసందర్భంగా ఇప్పటికే ఉన్న అనేక దరఖాస్తుల విషయాన్ని ప్రస్తావించింది. వివిధ కంపెనీలు, సంస్థల నుంచి వచ్చే అభ్యర్థనలు పెరిగే అవకాశం ఉందని, దీంతో సాధారణ ప్రాసెసింగ్‌లకు ఎక్కువ సమయం పట్టవచ్చని పేర్కొంది.

## రష్యా నుంచి క్రూడాయిల్ దిగుమతులు తగ్గుముఖం!




దేశీయ చమురు శుద్ధి కర్మాగారాలకు ప్రధాన ముడిచమురు సరఫరాదారుగా ఉన్న రష్యా నుంచి భారత్ దిగుమతులు ఇటీవలికాలంలో గణనీయంగా తగ్గాయి. సెప్టెంబర్ నెలలో రష్యా నుంచి క్రూడాయిల్ దిగుమతులు విలువ పరంగా 28.9 శాతం తగ్గి, 2024 సెప్టెంబర్‌లోని 4,675 మిలియన్ డాలర్ల నుంచి 3,322 మిలియన్ డాలర్లకు చేరుకున్నాయి.వాల్యూమ్ పరంగా చూస్తే ఈ దిగుమతులు ఏకంగా 17 శాతం తగ్గి 6.6 మిలియన్ టన్నులకు చేరాయి.రష్యా నుంచి భారత్ ముడిచమురు కొనుగోలు చేస్తున్న కారణంగా అమెరికా జులైలో ఇండియాపై 25 శాతం అదనపు టారిఫ్‌ను విధించింది. అంతకుముందు ఉన్న టారిఫ్‌లతో కలిపి ఇది మొత్తం సుమారు 50 శాతానికి చేరింది. ఈ అదనపు టారిఫ్‌ల వల్ల భారతీయ ఎగుమతులపై ముఖ్యంగా జౌళి (టెక్స్‌టైల్స్), ఫార్మాస్యూటికల్స్ వంటి రంగాలపై తీవ్ర ప్రభావం పడింది. దీంతో అమెరికా మార్కెట్లలో భారతీయ ఉత్పత్తులు ధరల పరంగా తమ పోటీతత్వాన్ని కోల్పోయాయి.

**దిగుమతులు తగ్గించుకుంటేనే..**

రష్యా నుంచి చమురు దిగుమతులను తగ్గించుకుంటే ఈ టారిఫ్‌లను ఉపసంహరిస్తామని అమెరికా ప్రభుత్వం పరోక్షంగా ఒత్తిడి తీసుకొచ్చింది. దాంతో భారతీయ చమురు సంస్థలు (రిఫైనరీలు) ప్రత్యామ్నాయాల వైపు దృష్టి సారించక తప్పలేదు.అమెరికా ప్రభుత్వం ఇటీవల రష్యాకు చెందిన ప్రధాన చమురు సంస్థలు అయిన రోస్‌నెఫ్ట్ లుకోయిల్ వంటి వాటిపై ఆంక్షలు విధించింది. ఈ ఆంక్షలు కేవలం టారిఫ్‌లు వంటి ధరల పెరుగుదలకు మాత్రమే పరిమితం కాకుండా ఈ సంస్థలతో ఆర్థిక లావాదేవీలు జరపడం, బీమా (ఇన్సూరెన్స్), రవాణా (షిప్పింగ్) వంటి అంశాలలో భారీ నియంత్రణ సమస్యలను సృష్టిస్తున్నాయి. పాశ్చాత్య ఆంక్షలకు లోబడి పనిచేయడం రిఫైనరీలకు సంక్లిష్టంగా మారడంతో భవిష్యత్తులో సరఫరా భద్రత దృష్ట్యా కొన్ని భారతీయ రిఫైనరీలు (రిలయన్స్ ఇండస్ట్రీస్, మాంగళూరు రిఫైనరీ వంటివి) రష్యా నుంచి కొత్త కొనుగోళ్లను తాత్కాలికంగా నిలిపివేసినట్లు తెలుస్తుంది. దీన్ని కంపెనీలు అధికారికంగా ధ్రువీకరించాల్సి ఉంది.ఎనర్జీ సెక్యూరిటీ, జాతీయ ప్రయోజనాలే అత్యంత ముఖ్యమని వాదిస్తూ భారత్ రష్యా నుంచి చౌకగా లభించిన ముడిచమురును పెద్ద మొత్తంలో దిగుమతి చేసుకుంది. అయినప్పటికీ అంతర్జాతీయ వాణిజ్యంపై అమెరికా విధించిన భారీ టారిఫ్‌లు, రష్యన్ సంస్థలపై ఆంక్షలు భారతీయ ఎగుమతి రంగంపై తీవ్ర ప్రభావం చూపడంతో దేశీయ రిఫైనరీలు తమ చమురు వనరుల కోసం ప్రత్యామ్నాయ దేశాలైన అమెరికా, మధ్య ఆసియా దేశాల వైపు మళ్ళక తప్పని పరిస్థితి ఏర్పడింది.

## 'ఇస్కాన్'పై ఉగ్ర ముద్ర.. 'బంగ్లా'లో ఆందోళనలు

న్యూఢిల్లీ: శ్రీకృష్ణ భక్తిని ప్రపంచవ్యాప్తం చేసిన ఇంటర్నేషనల్ సొసైటీ ఫర్ కృష్ణ కాన్షియస్‌నెస్ (ఇస్కాన్) ఇప్పుడు బంగ్లాదేశ్‌లో విపత్కర పరిస్థితులను ఎదుర్కొంటోంది.ఆ దేశంలోని రాడికల్ ఇస్లామిస్ట్ గ్రూపులన్నీ 'ఇస్కాన్'పై ఉగ్రవాద ముద్ర వేశాయి. అలాగే ఈ సంస్థపై సంపూర్ణ నిషేధం విధించాలని డిమాండ్ చేస్తున్నాయి. ఇందుకోసం మొహమ్మద్ యూనస్ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తున్నాయి. గత కొంతకాలంగా ఇస్కాన్ దేవాలయంతో సహా బంగ్లాదేశ్‌లోని పలు హిందూ దేవాలయాలను ఇస్లాంవాదులు తగులబెట్టారు. ఇస్కాన్ ను వెంటనే నిషేధించాలని కోరుతూ పలువురు మతఛాందసవాదులు బంగ్లాదేశ్ వీధుల్లో నిరసనలు వ్యక్తం చేశారు. శుక్రవారం ప్రార్థనల తర్వాత రాజధాని ఢాకా, చట్టోగ్రామ్‌లో ముస్లింలు నిర్వహించిన ర్యాలీలలో హిందూ వ్యతిరేక నినాదాలు హోరెత్తాయి.

## భారత ట్రక్కు డ్రైవర్ కేసులో మరో మలుపు

**న్యూయార్క్:** ఇటీవల కాలిఫోర్నియాలో ముగ్గురు మరణానికి కారణమైన భారత సంతతికి చెందిన ట్రక్కు డ్రైవర్ కేసు మరో మలుపు తిరిగింది. అతను మద్యం మత్తు లో వాహనం నడపడం లేదని, అది నిర్లక్ష్యంతో జరిగిన ప్రమాదమని విచారణలో తేలిందని యూఎస్ అధికారులు మీడియాకు తెలిపారు.ప్రాథమిక నివేదికలో సదరు డ్రైవర్ మద్యం మత్తులో ఉన్నాడని పేర్కొన్నారు.యుబా సిటీకి చెందిన 21 ఏళ్ల జష న్‌ప్రీత్ సింగ్‌ను అక్టోబర్ 21న మద్యం సేవించి వాహనం నడుపుతున్నాడనే అనుమా నంతో అమెరికా పోలీసులు అరెస్టు చేసి, అతనిపై హత్యా నేరం మోపారు. నాడు కాలి ఫోర్నియాలోని ఒంటారియోలో డ్రైవర్ జషన్‌ప్రీత్ సింగ్ కారణంగా జరిగిన ప్రమా దంలో ముగ్గురు మృతి చెందగా, పలువురు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదం అనం తరం డ్రైవర్ జషన్‌ప్రీత్ సింగ్‌కు నిర్వహించిన వైద్య పరీక్షల్లో అతని రక్తంలో మత్తు కలిగించే పదార్థాలు ఏవీ లేవని నిర్ధారణ అయ్యింది. అయితే వాహనాన్ని నిర్లక్ష్యంగా నడపడంతో జరిగిన హత్యగా దీనిని గుర్తిస్తున్నట్లు శాన్ బెర్నార్డినో కౌంటీ అటార్నీ కార్యాలయం మీడియాకు తెలిపింది.

# ప్రజలే న్యాయ నిర్ణేతలని కాంగ్రెస్‌కు అర్థం అయ్యేలా చేయాలి

- జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్




**మంథని, (జనంసాక్షి) :** జూబ్లిహిల్స్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఓడిపోతేనే తెలంగాణకు నిజమైన స్వాతంత్ర్యం వస్తుందనే భావన అందరిలో నెలకొందని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ అన్నారు. జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారంలో బాగంగా మంగళవారం బీఆర్ఎస్ పార్టీ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ఆధ్వర్యంలో జూబ్లీ హిల్స్ నియోజకవర్గంలో రహమత్ నగర్ డివిజన్ 161,162 బూత్ లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశానికి, రాష్ట్రానికి పట్టిన శని, పీడ కాంగ్రెస్ పార్టీ అని ఆయన అన్నారు. ఆనాడు ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌లో జరిగిన నష్టం కంటే ఎక్కువగా ఈ ప్రభుత్వ హాయాంలో తెలంగాణ రాష్ట్రం ద్వంసం చేసిండ్లన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం ఆనాడు పోరాటం చేసినోళ్ల, తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న వారు ఎలా గుర్తుంటారో అదే రీతిలో జూబ్లి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న వారి పేర్లు గుర్తుండి పోతాయని ఆయన అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఓడిపోవాలని ప్రతి గడప కోరుకుంటుందని అందుకోసం మీరంతా ప్రయత్నం చేయడం అభినందనీయమన్నారు. మిగిలిన ఐదు రోజులు ప్రతి ఒక్కరు కష్టపడి పనిచేయాలని, కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని ప్రజల కాళ్ల వద్దకు తీసుకురావాలన్నారు. మనం చూస్తుండగానే మనం వింటుండగానే మోసం చేస్తున్నారని, అధికారంతో నెత్తికెక్కిన కళ్లను దించాలంటే జూబ్లిలో కాంగ్రెస్ ఓడిపోవాలని, ప్రజాస్వామ్య దేశంలో ప్రజలే న్యాయనిర్ణేతలని వాళ్లకు ప్రజలే ఓనర్లని అర్థం కావాలంటే బీఆర్ఎస్ పార్టీ గెలువాలన్నారు. కాంగ్రెస్ పార్టీ డబ్బులను ఆఖరు అస్త్రంగా ఉపయోగిస్తారని, గ్రామాల్లో డబ్బుకు మోస పోయి గోసపడుతున్నారనే విషయాన్ని ప్రచారంలో ప్రతి గడపకు చేర్చాలన్నారు. రాష్ట్రంలో పాలన సరిగ్గా లేకపోవడం మూలంగానే అరిష్టం వచ్చిందని, ఓ వైపు ఎండ, వాన, చలి వస్తున్నాయని ఇన్నేండ్లలో ఇలాంటి వాతావరణం తాను ఎన్నడూ చూడలేదన్నారు. ప్రతి కార్యకర్త కష్టపడి బీఆర్ఎస్ గెలుపు కోసం పనిచేయాలని, ఈ ప్రచారంలో పాల్గొనే అవకాశం రావడం అదృష్టంగా బావిస్తున్నానని ఈ సందర్బంగా ఆయన తెలిపారు. సమావేశం అనంతరం జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్‌తో కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు.

## పెండింగ్ స్కాలర్షిప్, ఫీజు రీయింబర్స్మెంట్
# విడుదల చేయాలని క్యాంప్ కార్యాలయం ముట్టడి

**మంథని, (జనంసాక్షి) :** పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు విడుదల చేయాలని, విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మంత్రి ఎమ్మెల్యే ఐటీ మినిస్టర్ దుద్దిల్ల శ్రీధర్ బాబు క్యాంప్ కార్యాలయాన్ని వర్షంలో సైతం లెక్క చేయకుండా ముట్టడి చేశారు. ప్రజా పాలన.. మార్పు వస్తదని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినంక విద్య రంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేస్తుందని విద్యార్థి సంఘం నాయకులు ఆరోపించారు. ఐటీ మినిస్టర్ శ్రీధర్ బాబు అయిన చొరవ తీసుకొని విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని, పెండింగ్ బకాయిలు విడుదల చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.రజినీకాంత్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే విద్య రంగానికి తగిన ప్రాధాన్యత ఇస్తామని హామీలు ఇచ్చి రెండు సంవత్సరాలు గడుస్తున్న విద్య రంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేస్తున్నారని విమర్శించారు. పేద బడుగు బలహీన వర్గ విద్యార్థులకు ఇవ్వవలసిన స్కాలర్షిప్ ఫీజు రియంబేర్స్మెంట్ బకాయిలు విడుదల చేయకపోవడం వల్ల విద్యార్థులు తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేద విద్యార్థులకు, ఉన్నత విద్యకు భరోసా కల్పిస్తూ రియంబర్స్మెంట్ పథకం తీసుకురావడం జరిగింది కానీ తెలంగాణ రాష్ట్రంలో రియంబర్స్మెంట్ పథకాన్ని తీసివేసే కుట్ర జరుగుతున్నదని ఆరోపించారు. పెండింగ్ లో ఉన్న 8025 కోట్ల బకాయిలు విడుదల చేయాలని అన్నారు. ఇప్పటికే ప్రభుత్వం యజమా




నాలతో గతంలో చర్చలు జరిపి దసరా దీపవళి 1200 కోట్ల రూపాయలు ఇస్తామని హామీ ఇచ్చి ఇప్పటి వరకు విడుదల చేయలేదు.. యాజమాన్యంలు నిన్నటి నుండి కళాశాల నిరవధిక బంద్‌కు పిలుపునివ్వడం జరిగింది, కానీ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు కనీసం స్పందించకపోవడం సిగ్గుచేటు అన్నారు. తక్షణమే రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు విడుదల చేసి విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు రాజ్ కుమార్,స్మరన్, పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు ఆర్ల సందీప్ జిల్లా ఉపాధ్యక్షులు రాజ్ కుమార్, నాయకులు సాయి తేజ, లక్ష్మణ్, శశి, కళ్యాణ్, తిరుపతి, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

## మోడల్ స్కూల్లో మధ్యాహ్న భోజనం
# తనిఖీలు ఎక్కడ

- అన్నం తినలేక పోతున్నా విద్యార్థులు
- టిఫిన్ బాక్సులే దర్శనమిస్తున్నాయి



**గంభీరావుపేట నవంబరు 4 (జనం సాక్షి):** రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం దమ్మన్న పేట మోడల్ స్కూల్లో మధ్యాహ్న భోజనం తనిఖీలు లేక,, విద్యార్థులకు మెనూ పాటించకుండా, సాంబారు పోయడం తో, తినలేక పోతున్న మంటూ విద్యార్థులు, ఇంటి నుండి టిఫిన్ బాక్సులు తెచ్చుకొని తింటున్న వైనం చోటుచేసు కుంది ప్రభుత్వ మెనూ ప్రకారం విద్యార్థులకు పౌష్టికా హారం అందిస్తున్నామని చెప్తున్నప్పటికీ, విద్యార్థులకు సరైన పౌష్టికాహారం అందలేక ఇంటి నుండి దాదాపు 81 మంది విద్యార్థులకు గాను 20 మందే భోజనం చేస్తున్నారు మిగ తా వారందరూ ఇంటినుండే టిఫిన్ బాక్సులు తెచ్చుకొని తింటున్నారు, సంబంధిత అధికారులు వెంటనే మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసి మెనూ ప్రకారం పౌష్టిక ఆహారం అందించాలని విద్యార్థి తల్లిదండ్రులు కోరుతున్నారు

స్కూల్ బస్సు లేక విద్యార్థుల సంఖ్య తగ్గిపోతుంది గంభీరావుపేట మండలంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు బస్సులు సౌకర్యం లేక ఇంటికే పరిమితమై విద్యకు దూరమైతున్నారు వివరాలకు వెళ్తే గంభరావుపేట మండలం పీజీ డిగ్రీ కాలేజీ మోడల్ స్కూల్ చదువుతున్న విద్యార్థులు పాఠశాలలకు సమయానికి బస్సు సౌకర్యం లేక విద్యార్థులు పాఠశాలలకు దూరమైతున్నారు. గత రెండేళ్ల క్రితం మండల కేంద్రంలో లింగన్నపేట గంభీరావుపేట గ్రామాల మధ్య మానేరు వాగుపై తాత్కాలికంగా పోసిన మట్టి రోడ్డు వాగు ఉధృతికి కొట్టుకపోవడంతో విద్యార్థులు బస్సుల సౌకర్యం లేక ఇబ్బంది పడుతూ సమయానికి పాఠశాలకు చేరుకోలేక ఇంటి వద్దనే ఉంటున్నారు. అధికారులు మాత్రం చూచి చూడనట్లు వివరిస్తున్నారు ఇప్పటికైనా అధికారులు స్పందించి పాఠశాలలకు బస్సుల సౌకర్యం కల్పించాలని విద్యార్థి తల్లిదండ్రులు కోరుతున్నారు.

# రైతులకు ఇబ్బందులు కలగకుండా పత్తి కొనుగోలు జరగాలి



**కామారెడ్డి జిల్లా ప్రతినిది నవంబర్ 4 (జనం సాక్షి) :** మద్నూర్ మండలం మార్కెట్ యార్డ్ ను సందర్శించిన జిల్లా కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి.వ్యవసాయ మార్కెట్ కమిటీ మద్నూర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి కాటన్ జిన్నింగ్ మిల్లుల వారితో చర్చించారు.జిన్నింగ్ మిల్లు, సిపిఓ మార్కెటింగ్ అధికారి, మార్కెట్ కమిటీ స్థానిక లోకల్ మానిటరింగ్ కమిటీ సభ్యులకు, సంబధిత జిల్లా అధికారుల తో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 6వ తేది నుండి కొనుగోలు ప్రక్రియ జరగాలని, రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాల్సిన బాధ్యత జిల్లా యంత్రాంగంపైన ఉందని తెలుపుతూ జిన్నింగ్ మిల్లుల యజమానులు కొనుగోలు ప్రక్రియను సజావుగా నిర్వహించాలని, దీనికి కామారెడ్డి జిల్లా కాటన్ మిల్లర్స్ , ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వారు సుముఖతను వ్యక్తపరిచారన్నారు. అకాల వర్షాల వలన ప్రస్తుత పత్తి కొనుగోలు సీజన్ కు సంబంధించిన ఏర్పాట్లు, రైతులకు సరైన ధర చెల్లింపు, కొనుగోలు కేంద్రాల వద్ద సౌకర్యాల ఏర్పాటు, తూకం చెల్లింపు ప్రక్రియల పారదర్శకంగా నిర్వహించాలని ఆన్నారు. మద్దతు ధరలకు కొనుగోళ్లు జరిగేలా చూడాలని, రైతులకు అన్ని సదుపాయాలు కల్పించాలని

**పత్తి కొనుగోళ్లు:** సీసీఐ ద్వారా మద్దతు ధరలకు పత్తి కొనుగోళ్లు సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.కొనుగోలు కేంద్రాలలో కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయడానికి సీసీఐ అధికారులు, జిన్నింగ్ మిల్లుల యజమానులు, ఇతర అధికారుల మధ్య సమన్వయం అవసరమని సమస్యల పరిష్కారం: సాంకేతిక లోపాలు,సమస్యలు వంటివి పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు .

పత్తి కొనుగోలు ప్రక్రియ ను రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా, పారదర్శకంగా, వేగంగా జరిగేలా సంబంధిత శాఖాధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే సీసీఐ అధికారులు మిల్లుల యజమానులు రైతులకు తగిన మద్దతు ధర చెల్లించడం, తేమ శాతం పరిశీలనలో నిబంధనలు పాటించడం, బరువు తూకం పట్ల సక్రమంగా వ్యవహరించాలని సూచించారు.సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యు విక్టర్, సబ్ కలెక్టర్ కిరణ్మయి, మార్కెటింగ్ అధికారి రమ్య, కార్యదర్శి రాజకుమార్, సిబ్బంది, సీసీఐ ప్రతినిధులు, పత్తి జిన్నింగ్ మిల్లుల యజమానులు ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.






# కామారెడ్డి ఐఎంఏకు ఆల్‌రౌండ్ బెస్ట్ అవార్డు

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి నవంబర్ 4 జనంసాక్షి :** కామారెడ్డి ఐఎంఏకు ఆల్ రౌండ్ బెస్ట్ బ్రాంచ్ అవార్డు వచ్చినట్లు ఐఎంఏ జిల్లా ప్రధాన కార్యదర్శి అరవింద్ గౌడ్ తెలిపారు. ఈ మేరకు కరీంనగర్ ఐఎంఏ స్టేట్ కాన్ఫరెన్సో రాష్ట్ర ఐఎంఏ అవార్డుల ప్రధాన కార్యక్రమంలో అవార్డును సోమవారం బ్రాంచ్ ప్రతినిధులు అందుకున్నారు.కామారెడ్డి ఐఎంఏ అధ్యక్షురాలు డా.రాధా విజయలక్ష్మి, కార్యదర్శి డా.అరవింద్‌గౌడ్ అవార్డును అందుకున్నారు. ఈ అవార్డుల ప్రధాన కార్యక్రమానికి మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, శాతవాహన అర్బన్ డెవలప్మెంట్ ఛైర్మన్ కొమటిరెడ్డి నరేందర్, 2024-2025 సంవత్సరంలో తమ పనితీరుకు ఆల్ రౌండ్ బెస్ట్ బ్రాంచ్ అవార్డును గెలుచుకోవడం జరిగిందని అధ్యక్ష కార్యదర్శులు మంగళవారం తెలిపారు. ఈ అవార్డు రావడానికి కృషి చేసిన ఐఎంఏ సభ్యులకు ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు వారు పర్కొన్నారు.

## డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు
# మౌలిక సదుపాయాలు

- సీఎంఆర్ రైస్ డెలివరీపై కలెక్టర్ సమీక్ష
- పెండింగ్ సీఎంఆర్ రైస్ డెలివరీ నవంబర్ 8 నాటికి పూర్తి చేయాలి
- 99.5 శాతం సీఎంఆర్ రైస్ డెలివరీతో రాష్ట్రంలో అగ్రస్థానం
- నవంబర్ 8లోపు మిగిలిన 29 ఏకేసీ రైస్ సరఫరా



**పెద్దపల్లి, నవంబర్ 4 (జనం సాక్షి) :** డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల వద్ద మౌలిక సదుపాయాల కల్పనను వేగవంతం చేయాలని, పెండింగ్ సీఎంఆర్ రైస్ డెలివరీని నవంబరు 8లోపు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో రెండు సమీక్షలు నిర్వహించిన ఆయన, సంబంధిత అధికారులకు, రైస్ మిల్లర్లకు స్పష్టమైన గడువులు నిర్దేశించారు. మొదటి సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణశ్రీ, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ వనజతో కలిసి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీ, మౌలిక వసతులపై చర్చించారు. మంథని, సుల్తానాబాద్, గోదావరిఖని, ఓదెల, ధర్మారం, శ్రీరాంపూర్ మండలాల్లోని ఇళ్ల వద్ద త్రాగునీటి సరఫరా, విద్యుత్, పారిశుధ్య పనులు డిసెంబరు 15లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. రామగుండం నగరంలో సీవరేజీ, సెప్టిక్ ట్యాంక్, త్రాగునీటి సరఫరా, విద్యుత్ సరఫరా మొదలైన మౌలిక సదుపాయాలు డిసెంబరు చివరి నాటికి పూర్తయ్యేలా చూడాలని సూచించారు. 5 ఇంక్లైన్ కాలనీలో వివిధ దశల్లో అసంపూర్ణంగా ఉన్న ఇళ్లను లబ్ధిదారులకు అలాట్ చేసి, వారే నిర్మాణం పూర్తి చేసుకునేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో పీడీ హౌసింగ్ రాజేశ్వర్ రావు, ఆర్ అండ్ బీ ఈఈ బావ్‌సింగ్, రెవెన్యూ డివిజనల్ అధికారి గంగయ్యతోపాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

రెండో సమావేశంలో అదనపు కలెక్టర్ డి.వేణుతో కలిసి 2024-25 ఖరీఫ్ సీజన్ పెండింగ్ సీఎంఆర్ రైస్ డెలివరీపై సమీక్షించారు. ఇప్పటికే 99.5 శాతం డెలివరీ పూర్తి చేసిన పెద్దపల్లి జిల్లా రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచిందని, దీనికి కృషి చేసిన మిల్లర్లు, అధికారులకు అభినందనలు తెలిపారు. జిల్లాలోని 11 రైస్ మిల్లుల పరిధిలో మిగిలిన 29 ఏసీకే రైస్ సరఫరా పెండింగ్‌లో ఉందని, దాన్ని నవంబరు 8లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. రబీ సీజన్ రైస్ డెలివరీ కూడా గడువులోగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రస్తుత ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్ ధాన్యం కేటాయింపుకు బ్యాంకు గ్యారంటీ తప్పనిసరని, మిల్లర్లంతా దాన్ని సమర్పించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి శ్రీనాథ్, మేనేజర్ శ్రీకాంత్, రైస్ మిల్లర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## కులం పేరుతో దూషించాడని
# ఫిర్యాదుపై అదనపు ఎస్పి విచారణ



**ముస్తాబాద్ నవంబర్ 4 (జనం సాక్షి) :** ముస్తాబాద్ మండల కేంద్రానికి చెందిన గుండెల్లి దేవరాములు తనను కులం పేరుతో చిన్నచూపు చూశారని మానవ హక్కుల కమిషన్ రాష్ట్ర ముఖ్యమంత్రి కి ఇచ్చిన ఫిర్యాదుపై అదనపు ఎస్పి చంద్రయ్య విచారణ జరిపారు. ఈ సందర్భంగా మంగళవారం అదనపు ఎస్పీ క్షేత్రస్థాయిలో సంఘటనపై విచారణ జరిపారు ముస్తాబాద్‌లోని మానేరు ప్రధాన కాలువ కట్టపై సీసీ రోడ్డు నిర్మాణము జరుగుతున్నది ఈ రోడ్డు నిర్మాణం సందర్భంగా ఇరిగేషన్ అధికారులకు గుండెలు దేవరాములు మధ్య జరిగిన సంఘటన పోలీస్ స్టేషన్ వరకు వెళ్లింది దీని విచారణపై నీటిపారుదల శాఖ అధికారులు దేవరాములు స్టేషన్కు వచ్చిన సందర్భంగా తనకు కుర్చీ ఇవ్వలేదని కులము పేరుతో తనను చిన్న చూశారని ఆయన మానవ హక్కుల కమిషన్ రాష్ట్ర ముఖ్యమంత్రి చేసిన ఫిర్యాదు పై క్షేత్రస్థాయిలో ఇరువర్గాల తో మాట్లాడి వివరాలు సేకరించామని అడిషనల్ ఎస్పీ తెలిపారు. ఈ నివేదికను ఉన్నతాధికారులకు అందించడం జరుగుతుందని పై అధికారుల ఆదేశానుసారం తదుపరి చర్యలు ఉంటాయన్నారు ఇక్కడ ఎస్సై గణేష్ పోలీస్ సిబ్బంది ఉన్నారు

## శాస్త్రీయ ఆలోచనతోనే
# విద్యార్థుల మానసిక అభివృద్ధి




**జగిత్యాల బ్యూరో నవంబర్ 4 జనంసాక్షి :** శాస్త్రీయ ఆలోచనలతోనే విద్యార్థులు మానసిక అభివృద్ధి చెంది బాల శాస్త్రవేత్తలుగా ఎదుగుతారు, అని జగిత్యాల జిల్లా విద్యాధికారి రాము అన్నారు మంగళవారం డిఇఓ కార్యాలయంలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించే చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ సంబంధించిన గోడ పత్రికలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో ఉన్న శాస్త్రీయ ఆలోచనలు కల్పించేది సైన్స్ ఒక్కటే అన్నారు. ఇలాంటి పరీక్షల ద్వారా విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం ఏర్పడి సైన్స్ పట్ల అభిరుచి పెరుగుతుంది అన్నారు. ఈ టాలెంట్ పరీక్షలను ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. పాఠశాల స్థాయిలో నవంబర్ 7న, మండల స్థాయిలో నవంబర్ 21 న జిల్లాస్థాయిలో నవంబర్ 28 జరుగుతాయి అన్నారు ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ ఆఫీసర్ రాజశేఖర్, జన విజ్ఞాన వేదిక జిల్లా నాయకులు తులసి ఆగమయ్య, బడే శ్రీనివాస్, దాసరాములు, రాంరెడ్డి, పులి రమేష్ కుమార్, గంగరాజు, బర్ల వంశీ, జానకిరామ్ పాల్గొన్నారు

# చివరి ధాన్యం గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది

**రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వడి కృష్ణారావు**

**మల్లాపూర్ నవంబర్ 4(జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతుల పక్షపాతి అని రైతులు తమ దాన్యాన్ని తేమ లేకుండా అరబెట్టి ప్రభుత్వకొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని ప్రభుత్వం చివరి ధాన్యం గింజ వరకు కొనుగోలు చేస్తుందనిరాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వడి కృష్ణారావు అన్నారు ఈ రోజు మల్లాపూర్ మండలంలోని వివిధ గ్రామాల్లో స్థానిక వ్యవసాయమార్కెట్ కమిటీ చైర్ పర్సన్ అంతడుపుల పుష్పలతతో కలసి ఐకేపీ ప్యాక్స్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతుగత టిఆరెస్ ప్రభుత్వం రైతులను మోసం చేసిందని కానీ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రైతులకు న్యాయం చేయాలి అని సంకల్పి న్ చి తుకల్లో కోతలు లేకుండా చేసి ధాన్యం డబ్బులు సకాలంలో రైతులఖాతాల్లో వేస్తోంది అని అన్నారు. దీంతోపాటు రాష్ట్ర ప్రభుత్వం గతంలో ఎకరం విస్తీర్ణానికి 18 క్వింటాళ్ల మొక్కజొన్న కొనుగోలు చేసేదని నేడు 25 క్వింటాళ్ల వరకు కొనుగోలు చేయడానికి ప్రభుత్వం జీవో జారీ చేసిందన మొక్కజొన్న రైతులకు ఇది మంచి అవకాశం అని అన్నారు. మండలంలోని ముత్యంపేట రాఘవ పేటసిరిపూర్ కుస్తాపూర్ రత్నాపూర్ మొగిలిపేట ఓబులాపూర్ వాల్గొండ గొర్రెపల్లి వివిరావుపేట్ గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు ఈ కార్యక్రమల్లో కృష్ణారావు వెంటమల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మార్కెట్ ఛైర్పర్సన్ పుష్పలత నర్సయ్య వైస్ చైర్మన్ ఇట్టేది నారాయణ రెడ్డిగడ్డం లకపతి రెడ్డి వాకిటి భూమారెడ్డి తక్కల నరేష్ రెడ్డి నత్తి రాము గంగాధర్ మైపాల్ రెడ్డిఏలేటి జలపతి రెడ్డినైనేని రాజేందర్ గంగాధర్ వాసిరామ్ చల్ల లింగం సురేష్ జమాల్ రా జేందర్ సంజీవ్ రాజు మిట్టపల్లి జలపతి రెడ్డి పోతు శేఖర్ జమాల్ తదితరులు పాల్గొన్నారు



# గవర్నర్ పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

**జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి**

**కరీంనగర్ జిల్లా బ్యూరో, నవంబర్ 04 (జనంసాక్షి):** ఈనెల 7న రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ శాతవాహన యూనివర్సిటీ స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరుకానున్న నేపథ్యంలో అవసరమైన పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ పమేలా సత్పతి ధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో అదనపు కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, లక్ష్మీకిరణ్, నగర పాలిక కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, పోలీసు, వైద్య, విద్యుత్ శాఖ తదితర శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... గవర్నర్ పర్యటనలో ప్రోటోకాల్ పాటిస్తూ ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా బందోబస్తు కార్యక్రమాలకు సమయపాలన పాటించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసే స్టాళ్లు, సాంస్కృతిక కార్యక్రమాల గురించి పలు సూచనలు చేశారు.యూనివర్సిటీలో పూర్తిస్థాయిలో భద్రత ఉంటుందని, ఐడెంటిటీ కార్డులు ఉన్నవారిని మాత్రమే లోని కి అనుమతి ఇస్తామని, గేటు వద్ద తనిఖీ కోసం యూనివర్సిటీ తరఫున సిబ్బందిని ఏర్పాటు చేయాలని కోరారు. గవర్నర్ కార్యక్రమానికి హాజరయ్యే వారి పేర్ల జాబితాను ముందే సమర్పించాలన్నారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ వీసీ ఉమేష్ కుమార్ మాట్లాడుతూ... ఈనెల 7న ఉదయం శాతవాహన యూనివర్సిటీ స్నాతకోత్సవంలో




ముఖ్య అతిథిగా గవర్నర్ పాల్గొంటారన్నారు. ఉదయం 10 గంటల వరకు చేరుకుంటారని, మరో అతిథి ప్రొఫెసర్ బీ.జే రావు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులకు గోల్డ్ మెడల్, పీహెచ్ డీ పట్టాలు ప్రదానం చేస్తారని, అనంతరం గవర్నర్ ప్రసంగం ఉంటుందన్నారు. పలు కార్యక్రమాల అనంతరం సెమినార్ హోల్ ప్రారంభిస్తారన్నారు. కార్యక్రమం సవ్యంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. ఈ సమావేశంలో డీఆర్ఓ వెంకటేశ్వర్లు, ఆర్డీవో మహేశ్వర్, డిసిపి వెంకటరామిరెడ్డి, ఏసీపీలు పోలీసు, వైద్య, విద్య, రెవెన్యూ, మున్సిపల్, విద్యుత్ తదితర శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

### ప్రైవేట్ రంగంలోని ఉపాధి అవకాశాలను
# యువత వినియోగించుకోవాలి

- జిల్లా ఉపాధి అధికారి ఎం.రాజశేఖర్
- జాబ్ మేళాకు విశేష స్పందన



**పెద్దపల్లి, నవంబర్ 04(జనంసాక్షి) :** ప్రైవేట్ రంగంలో ప్రభుత్వం కల్పిస్తున్న ఉపాధి అవకాశాలను నిరుద్యోగ యువతీ,యువకులు వినియోగించుకోవాలని జిల్లా ఉపాధి అధికారి ఎం.రాజశేఖర్ తెలిపారు.మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని జిల్లా ఉపాధి కార్యాలయంలో మెడ్ ప్లస్ కంపెనీ నిర్వహించిన జాబ్ మేళా కార్యక్రమానికి విశేష స్పందన వచ్చినట్లు జిల్లా ఉపాధి అధికారి తెలిపారు. వివిధ ప్రాంతాల అభ్యర్థులు ధృవ పత్రాలతో పాల్గొన్నారని, కంపెనీ ప్రతినిధులు ఎంపిక విధానం , ఉద్యోగం గురించి వివరించి ఇంటర్వ్యూలు నిర్వహించారని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగాలు కాకుండా ప్రైవేట్ రంగంలో ప్రభుత్వం కల్పిస్తున్న ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఉపాధి కల్పన అధికారి సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, మెడ్ ప్లస్ కంపెనీ ప్రతినిధులు,తదితరులు పాల్గొన్నారు.


# ఫీజు బకాయిలు, బీసీ రిజర్వేషన్‌పై కలెక్టర్‌కు వినతులు

- రియంబర్స్‌మెంట్ బకాయిలు, ఉపకార వేతనాలు విడుదలకు డిమాండ్లు
- అధిక ఎగ్జామ్ ఫీజు వసూళ్లపై నియంత్రణ
- బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ప్రకటన
- విద్య, ఉద్యోగాల్లో జనాభానుగుణ రిజర్వేషన్





**పెద్దపల్లి/సుల్తానాబాద్, నవంబరు 4 (జనంసాక్షి) :** ఫీజు రియంబర్స్‌మెంట్ బకాయిలు, ఉపకార వేతనాలు వెంటనే విడుదల చేయాలని, బీసీలకు విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ ప్రకటించాలని డిమాండ్ చేస్తూ రెండు సంఘాలు మంగళవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షకు వినతిపత్రాలు అందజేశాయి. సుల్తానాబాద్‌లో జాతీయ బీసీ జనరల్ సెక్రటరీ హరికృష్ణ యాదవ్, బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు మల్యాల సంజీవ్ గౌడ్, మాజీ కౌన్సిలర్ మహంతా కృష్ణ, మల్యాల సాయికుమార్, బండి సంజు కుమార్ లతో కూడిన బృందం కలెక్టర్‌కు వినతి సమర్పించింది. ప్రభుత్వ ఆదేశాలు ఉన్నప్పటికీ పేద, మధ్యతరగతి బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల నుంచి కళాశాలలు అధిక ఎగ్జామ్ ఫీజులు వసూలు చేస్తున్నాయని, దీన్ని వెంటనే నిలిపి ప్రభుత్వ నిర్దేశిత ఫీజులు మాత్రమే వసూలు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రియంబర్స్‌మెంట్ తెలిసినా అనధికారికంగా రికార్డు చార్జీలు, ఇతర చార్జీల పేరుతో కళాశాల యజమానులు విద్యార్థుల నుంచి డబ్బు వసూలు చేస్తూ తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫీజు రియంబర్స్‌మెంట్ విషయంలో విద్యార్థులపై ఒత్తిడి తీసుకురావద్దని, ప్రభుత్వ బకాయిలు విడుదల కాని పక్షంలో విద్యార్థులను కళాశాలలోకి అనుమతించాలని, హాల్ టికెట్లు యథావిధిగా జారీ చేయాలని, సర్టిఫికెట్లు ఆపకుండా చూడాలని డిమాండ్ చేశారు. పై అంశాలపై ప్రభుత్వం విచారణ జరిపి విద్యార్థులకు న్యాయం చేయాలని హరికృష్ణ యాదవ్, మల్యాల సంజీవ్ గౌడ్ తదితరులు విజ్ఞప్తి చేశారు. లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. అదే రోజు పెద్దపల్లిలో బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ ఆధ్వర్యంలో మరో వినతిపత్రం అందజేశారు. జిల్లా జేఏసీ కన్వీనర్ జాగిరి అంజన్ కుమార్ గౌడ్, బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు మల్యాల సంజీవ్ గౌడ్, డీఎస్పీ జిల్లా అధ్యక్షుడు మాతంగి రేవంత్, నాయకులు న్యాతరి శ్రీనివాస్, క్యా దాసి రమేష్, కుక్క అవినాష్ తదితరులు పాల్గొన్నారు. సమాజంలో 90 శాతం జనాభా ఉన్న బీసీలకు విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. రాబోయే శీతాకాల పార్లమెంటు సమావేశాల్లో దీన్ని 9వ షెడ్యూల్‌లో చేర్చి కేంద్ర ప్రభుత్వాన్ని ఒత్తిడి చేయాలని కోరారు. 'మేమెంతో మాకంత' అంటూ గత కొన్నేళ్లుగా డిమాండ్ చేస్తున్నామని, అన్ని పార్టీలు ఈ విషయంలో కపట నాటకాలు ఆడుతున్నాయని ఆరోపించారు. 42 శాతం రిజర్వేషన్ సాధించే వరకు రాష్ట్ర జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడు విశారదన్ మహరాజ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేయాలని, గవర్నర్ వద్ద పెండింగ్‌లో ఉన్న 42 శాతం రిజర్వేషన్‌ను వెంటనే ఆమోదించి బీసీలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో జేఏసీ ఆధ్వర్యంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



## ముడిసరుకుల సరఫరాకు ఆసక్తి గలవారు దరఖాస్తు సమర్పించాలి

**రామగుండం ఐటిఐ ప్రిన్సిపాల్**

**రామగుండం, జనంసాక్షి :** ముడిసరుకుల సరఫరాకు ఆసక్తి గలవారు దరఖాస్తు సమర్పించాలని రామగుండం ఐటిఐ ప్రిన్సిపాల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఐటిఐలోని వివిధ ట్రేడ్స్‌లో అవసరమై ముడిసరుకుల 6 లక్షల 48వేల రూపాయలతో కొనుగోలు చేయడానికి నిర్ణయించామని,196 అంశాలకు సంబంధించిన ముడి సరుకులు ఒకే ప్యాకేజీలు సరఫరా చేసేందుకు ఆసక్తిగల సంస్థల నుంచి కొటేషన్ దరఖాస్తు ద్వారా ఆహ్వానిస్తున్నామని తెలిపారు.ఆసక్తి గల సరఫరాదారులు తమ కొటేషన్లను అందజేయాలని, ఇతర వివరాలకు రామగుండం ఐటిఐ ప్రిన్సిపల్ కార్యాలయంలో సంప్రదించాలని ఐటిఐ ప్రిన్సిపల్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# అరుదైన 'కెరోటిడ్ వెబ్' స్టెంటింగ్ విజయవంతం

- 62 ఏళ్ల రోగికి కొత్త జీవితం..
- ప్రసాద్ ఆసుపత్రి వైద్యుల ఘనత




**హైదరాబాద్, నవంబర్ 04(జనంసాక్షి) :** ఇది ఒక అరుదైన శస్త్రచికిత్స. సమస్య కూడా అత్యంత అరుదైనదే. అయినా, ప్రసాద్ ఆసుపత్రి కార్డియాలజీ నిపుణులు ఈ శస్త్రచికిత్సను విజయవంతం గా నిర్వహించారు. అరుదైన, అత్యంత ప్రమాదకరమైన ధమని సంబంధిత వ్యాధి 'కెరోటిడ్ వెబ్'తో బాధపడుతున్న 62 ఏళ్ల వ్యక్తికి క్లిష్టమైన కెరోటిడ్ వెబ్ స్టెంటింగ్ విధానాన్ని విజయవంతంగా పూర్తి చేశారు. ఈ కెరోటిడ్ వెబ్ అనేది మెడలోని ప్రధాన రక్తనాళంలో ఏర్పడే అసాధారణ గడ్డలాంటి నిర్మాణం. ఇది రక్త ప్రవాహాన్ని అడ్డుకుంటుంది. రక్తం గడ్డకట్టేలా చేస్తుంది. దీంతో పదే పదే బ్రెయిన్ స్ట్రోక్ వచ్చే ప్రమాదం ఉంది. దీనికి చికిత్సను ఆలస్యం చేస్తే జీవితం ప్రమాదంలో పడుతుంది. బెంగళూరుకు చెందిన గౌతమ్ రామకృష్ణ గత జూన్ నెలలో తల తిరగడం, మాట్లాడంలో ఇబ్బంది పడుతూ బెంగళూరులోని అనేక ఆసుపత్రులకు వెళ్లారు. అయితే, చికిత్సకు ఆ ఆసుపత్రులు వెనుకంజ వేశాయి. ఇటీవల ఇస్కేమిక్ స్ట్రోక్ వచ్చిన తర్వాత, ఆయన హైదరాబాద్ నాచారంలో ఉన్న ప్రసాద్ ఆసుపత్రిని సంప్రదించారు. ఇస్కేమిక్ స్ట్రోక్ అనేది మెదడుకు రక్తాన్ని సరఫరా చేసే ధమని గడ్డకట్టడం వల్ల మెదడు కణాలకు ఆక్సిజన్ అందకుండా జరిగే స్థితి ఇది. ఇది అత్యవసర వైద్య పరిస్థితి. ప్రసాద్ ఆసుపత్రి వైద్యుల బృందం తనిఖీలు నిర్వహించింది. ఈ తనిఖీల్లో ఈ సమస్యకు మూల కారణం కెరోటిడ్ వెబ్ అని గుర్తించారు. ఆధునిక ఎండ్‌వాస్కులార్ టెక్నిక్ ద్వారా రక్తనాళంలో ప్రత్యేక స్టెంట్ ను అమర్చి రక్త ప్రవాహం సరి చేశారు. దీంతో రోగిని భవిష్యత్తులో వచ్చే బ్రెయిన్ స్ట్రోక్ ప్రమాదం నుంచి రక్షించారు.

రోగికి వచ్చిన సమస్యకు కారణాన్ని గుర్తించడానికి సీటీ కెరోటిడ్ యాంజియోగ్రామ్ నిర్వహించారు. రైట్ ఇంటర్నల్ కెరోటిడ్ ఆర్టరీ (ఐసీఏ)లో కెరోటిడ్ వెబ్ అనే అరుదైన నిర్మాణం ఉన్నట్లు గుర్తించారు. అనంతరం చేసిన డిజిటల్ సబ్‌ట్రాక్షన్ యాంజియోగ్రఫీ (డీఎస్‌ఏ) ద్వారా ధృవీకరించారు. డీఎస్ఏ అనేది రక్తనాళాలను స్పష్టంగా చూపించే అధునాతన ఇమేజింగ్ పద్ధతి. ఇందులో ఎక్స్-రే, కంప్యూటర్ సాంకేతికతతో ఇతర కణాల చిత్రాలను తొలగిస్తుంది. కేవలం రక్తనాళాల చిత్రాన్ని స్పష్టంగా చూపిస్తుంది. తర్వాత ప్రసాద్ ఆసుపత్రి కార్డియాలజీ వైద్యుల బృందం రైట్ ఐసీఏ కెరోటిడ్ స్టెంటింగ్ విధానాన్ని విజయవంతంగా నిర్వహించింది. ఈ ప్రక్రియలో మెదడుకు రక్తాన్ని సరఫరా చేసే ధమనిలో ఏర్పడిన గడ్డను తొలగించారు. రక్తప్రవాహం సజావుగా జరిగేలా చేశారు. ఈ సందర్భంగా ఈ శస్త్రచికిత్సకు నేతృత్వం వహించిన డాక్టర్ సంపత్ (డీఎం, కార్డియాలజీ) మాట్లాడుతూ కెరోటిడ్ వెబ్ అనేది అరుదైనదన్నారు. దీనిని ప్రాథమిక దశలో గుర్తించడం, సమయానికి జోక్యం చేసుకోవడం ద్వారా మరిన్ని న్యూరాలజికల్ సమస్యలు నివారించవచ్చన్నారు. రోగికి అత్యుత్తమ ఫలితాన్ని ఇవ్వడం మాకు ఆనందంగా ఉందన్నారు. ఈ చికిత్సను డాక్టర్ సంపత్ కుమార్ మాదపాటి నేతృత్వంలో డాక్టర్ ఎనోష్, డాక్టర్ సునీల్, పారామెడికల్ ఖాజా, అనురాధ, శ్రీకాంత్‌తో కూడిన బృందం పాల్గొంది.

# ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన రైల్వే బ్రిడ్జి

- నిర్మాణాన్ని పరిశీలించిన కేంద్ర మంత్రి బండి సంజయ్
- మణిపూర్‌లో అత్యంత వెనుకబడిన నోనీ జిల్లాలో పర్యటించిన కేంద్ర మంత్రి



**ఇంఫాల్, నవంబర్ 04(జనంసాక్షి) :** మూడు రోజుల మణిపూర్ రాష్ట్ర పర్యటనలో భాగంగా ఈరోజు నోనీ జిల్లాలో నిర్మిస్తున్న ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన రైల్వే బ్రిడ్జిని సందర్శించారు. మణిపూర్ రాష్ట్ర రాజధాని ఇంఫాల్ నగరాన్ని అస్సాం ద్వారా భారత రైల్వే నెట్‌వర్క్‌తో అనుసంధానం చేసే జిరిబామ్ - ఇంఫాల్ కొత్త రైల్వే లైన్ ప్రాజెక్టులో ఈ రైల్వే బ్రిడ్జి ఒకటి. వాస్తవానికి ఈ రైల్వే లేన్ ప్రాజెక్ట్ మొత్తం వ్యయ అంచనా రూ.21,885 కోట్లు. ఈ రైల్వే లేన్ కు ప్రధాన ఆకర్షణ ఈ ఎత్తైన రైల్వే బ్రిడ్జి. సుమారు 650 కోట్లు వ్యయంతో 703 మీటర్ల పొడవున 7 పిల్లర్లతో ఈ వంతెనను నిర్మిస్తున్నారు. ఇందులో 2 పిల్లర్లు 141 మీటర్ల ఎత్తు కలిగి ఉండటం ప్రపంచ రికార్డు అని మణిపూర్ అధికారులు చెప్పారు. ఇక జిరిబామ్-ఇంఫాల్ కొత్త రైల్వే లైన్ ప్రాజెక్ట్ విషయానికొస్తే.. 110 కి.మీల మేరకు నిర్మిస్తున్న ఈ రైల్వే లేన్ పనుల్లో భాగంగా ఏకంగా 55 సొరంగ (టన్నెల్స్) మార్గాలను నిర్మిస్తున్నారు. వీటి పొడవు 66 కి.మీలు. అందులో 10. 25 కిలోమీటర్ల పొడవైన సొరంగం కూడా ఒకటి నిర్మాణంలో ఉంది. ఈ నిర్మాణం పూర్తయితే దేశం లోనే అతి పొడవైన రైల్వే సొరంగాల్లో కూడా ఒకటి కానుంది. వచ్చే ఏడాది మార్చి నాటికి ఈ బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తి చేస్తామని అధికారులు కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు తెలిపారు. 2028 డిసెంబర్ నాటికి ఈ రైల్వే లేన్ నిర్మాణాన్ని పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ రైల్వే బ్రిడ్జి నిర్మాణాన్ని ఆద్యంతం పరిశీలించారు. దాదాపు అర కిలోమీటర్ మేరకు నడిచి నిర్మాణ పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.

# అధ్వాన్నంగా వన్ ఇంక్లయిన్ రైల్వే అండర్ బ్రిడ్జి రోడ్డు





- చెత్తకుప్పలు, రోడ్డుపై బురద నీరు..వెలగని లైట్లు..
- పట్టించుకోని ఆర్‌జీ-వన్ యాజమాన్యం..
- సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు తొడుపునూరి రమేశ్‌కుమార్..

**గోదావరిఖని, (జనంసాక్షి) :** సింగరేణి ఆర్‌జీ-వన్ ఏరియాలోని జీడీకే. వన్ ఇంక్లయిన్ రైల్వే అండర్ బ్రిడ్జి రోడ్డు పూర్తిగా అధ్వాన్నంగా ఉందని, రోడ్డుపై బురద నీరు, రోడ్డు ప్రక్కన చెత్తకుప్పలు ఉన్నాయని,అదేవిధంగా లైట్‌లు ఉన్నా రాత్రి సమయాల్లో వెలగడంలేదని.. వెంటనే రోడ్డు శుభ్రంగా ఉండే విధంగా ఆర్‌జీ-వన్ యాజమాన్యం తగుచర్యలు తీసుకోవాలని సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు తొడుపునూరి రమేశ్ కుమార్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.రోడ్డుపై గోదావరిఖనికి వెళ్లేందుకు సమీప ప్రాంతాల ప్రజలు, వాహనదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆయన పేర్కొన్నారు.గత కొన్ని నెలలుగా ఈ రోడ్డుపై యైటింక్లయిన్‌కాలనీకి వెళ్లే ప్రధాన నీటిపైపులు లీకేజీ కారణంగా నీరు వృధాగా పోవడంతో రోడ్డంతా బురద నీరుగా మారి అధ్వాన్నంగా ఉందని, దీనితో వాహనదారులు కిం దపడే ప్రమాదం ఉందని ఆయన పేర్కొన్నారు.వెంటనే యాజమాన్యం రోడ్డుపై నీటి లీకేజీని అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అదేవిధంగా ఈ రోడ్డు ప్రక్కన చెత్తకుప్పలు ఉన్నాయని వాటిని తొలగించకపోవడంతో దుర్వాసన వస్తుందని రమేశ్‌కుమార్ పేర్కొన్నారు.దారి వెంట వెళ్లేవారు ఇబ్బందులు పడుతున్నారని ఆయన అన్నారు.వెంటనే యాజమాన్యం రోడ్డు పక్కన ఉన్న చెత్తకుప్పలను తొలగించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.లైట్స్ ఉన్నా రాత్రి పూట వెలగడంలేదని,వెంటనే రోడ్డుపై లైట్లు వెలిగే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

# మరో పోరుకు భారత జట్టు సిద్ధం!?

*భారతదేశం ఆసియా కప్ 2025 విజేతగా నిలిచి నెల రోజులు దాటినా.. ఇప్పటివరకు టీమిండియాకు కప్ దక్కలేదు. ఈ విషయంలో పాకిస్తాన్ క్రికెట్ బోర్డ్ ఛైర్మన్, ఆసియా క్రికెట్ కౌన్సిల్ ఛైర్మన్ అయిన మొహ్సిన్ నఖ్వీ తీరు వివాదాస్పదంగా మారింది.*

- నాలుగో టీ20లో ఆసీస్‌తో అమీతుమీ..
- గోల్డ్ కోస్ట్ వేదికగా నాలుగో టీ20 మ్యాచ్
- కుల్దీప్, సంజూకు ఉద్వాసన పలికే అవకాశం




ఆస్ట్రేలియాతో ఐదు టీ20ల సిరీస్‌లో 1-1తో సమంగా నిలిచిన భారత జట్టు మరో ఆసక్తికర పోరుకు సిద్ధమైంది. గురువారం గోల్డ్ కోస్ట్ వేదికగా జరిగే నాలుగో టీ20లో ఆసీస్‌తో అమీతుమీ తేల్చుకోనుంది. మూడో టీ20లో అద్వితీయమైన ప్రదర్శనతో ఐదు వికెట్ల తేడాతో గెలుపొందిందిన భారత్.. అదే జోరును నాలుగో టీ20లోనూ కొనసాగించాలనుకుంటుంది. మరోవైపు ఈ మ్యాచ్ గెలిచి సిరీస్‌పై పట్టు సాధించాలని ఆసీస్ భావిస్తోంది. దాంతో ఈ మ్యాచ్‌పై సర్వత్రా ఆసక్తి నెలకొంది. మూడో టీ20లో టీమిండియా మూడు మార్పులు చేయడం జట్టుకు కలిసొచ్చింది. కాంబినేషన్ సెట్ అయ్యిందని మ్యాచ్ అనంతరం సూర్యకుమార్ యాదవ్ తెలిపాడు. దాంతో నాలుగో టీ20లో ఎలాంటి మార్పులు చేయకుండా భారత్ బరిలోకి దిగే అవకాశాలు ఉన్నాయి. అదే జరిగితే కుల్దీప్ యాదవ్, సంజూ శాంసన్‌కు నిరాశే ఎదురుకానుంది.టీ20 ప్రపంచకప్ 2026 సన్నాహాల్లో భాగంగా టీమిండియా ప్రయోగాలు చేస్తోంది. హర్షిత్ రాణా, సంజూ శాంసన్, కుల్దీప్ యాదవ్‌లను తొలి రెండు టీ20ల్లో ఆడించగా.. జట్టు అంచనాలను అందుకోలేకపోయారు. దాంతో మూడో టీ20లో ఈ ముగ్గురిపై వేటు వేసిన గంభీర్.. జితేశ్ శర్మ, వాషింగ్టన్ సుందర్, అర్ష్‌దీప్ సింగ్‌లకు అవకాశాలు కల్పించింది. ఈ ముగ్గురు అద్భుతమైన ప్రదర్శన కనబర్చారు.గాయంతో తొలి మూడు టీ20లకు దూరంగా ఉన్న నితీష్ కుమార్ రెడ్డి అందుబాటులోకి వస్తే తుది జట్టులో చోటు దక్కనుంది. అతని కోసం శివమ్ దూబేను పక్కన పెట్టవచ్చు. ఈ ఒక్కటి మినహా తుది జట్టులో భారీగా మార్పులు జరిగే అవకాశం లేదు. బ్యాటింగ్‌లో శుభ్‌మన్ గిల్, సూర్యకుమార్ యాదవ్, తిలక్ వర్మ సత్తా చాటాల్సి ఉంది. ముఖ్యంగా గిల్, సూర్య వైఫల్యం విమర్శలకు దారి తీస్తోంది. గిల్ స్థానంలో సంజూ శాంసన్‌ను ఓపెనర్‌గా ఆడించాలనే డిమాండ్ కూడా వ్యక్తమవుతుంది. ఈ క్రమంలోనే అతనికి నాలుగో టీ20 కీలకంగా మారింది.

**ఆస్ట్రేలియాతో నాలుగో టీ20 ఆడే భారత తుది జట్టు(అంచనా)**

శుభ్‌మన్ గిల్, అభిషేక్ శర్మ, సూర్యకుమార్ యాదవ్, తిలక్ వర్మ, శివమ్ దూబే/నితీష్ కుమార్ రెడ్డి, వాషింగ్టన్ సుందర్, జితేష్ శర్మ(కీపర్), అర్ష్‌దీప్ సింగ్, జస్‌ప్రీత్ బుమ్రా

# విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి






- క్రీడల్లో పిల్లలను తల్లిదండ్రులు ప్రోత్సహించాలి
- మల్లఖంబ్ రాష్ట్రస్థాయి ఛాంపియన్ షిప్ క్రీడలు ప్రారంభం
- సాంస్కృతిక ప్రదర్శనలతో ఆకట్టుకున్న విద్యార్థులు

**చౌటుప్పల్ నవంబర్ 4 (జనం సాక్షి) :** విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించినప్పుడే మానసికంగా,శారీరకంగా దృఢంగా ఉంటారని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్రస్థాయి మల్లఖంబ్ క్రీడల ప్రారంభోత్సవానికి విచ్చేసిన ఎమ్మెల్యేను ట్రినిటీ విద్యాసంస్థల యాజమాన్యం, విద్యార్థిని, విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. అనంతరం, ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి,జాతీయ జెండా ఆవిష్కరించి రెండు రోజులపాటు జరిగే ఈ రాష్ట్రస్థాయి ఛాంపియన్షిప్ పోటీలను ప్రారంభించారు.పాఠశాల విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించి ఆకట్టుకున్నారు. సాంస్కృతిక నృత్యాలతో అలరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భావితరాల భవిష్యత్తు విద్యార్థులదేనని,విద్యార్థులు సెల్‌ఫోన్లకు దూరంగా ఉండి, క్రీడలకు దగ్గరగా ఉండాలని తెలిపారు.క్రీడల్లో పిల్లలను తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. విద్య, వైద్యం బాగున్నప్పుడే పేదలకు న్యాయం జరుగుతుందన్నారు. ప్రభుత్వ బడుల అభివృద్ధికి తన వంతుగా ప్రభుత్వంతో మాట్లాడతానని, కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ద్వారా రూ. 1.50 కోట్లతో కస్తూరిబా బాలికల పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించామని తెలిపారు.సమాజసేవలో ఉన్న గొప్ప వ్యక్తులు కూడా ప్రభుత్వ బడుల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ముందుకు రావాలని కోరారు. ట్రినిటీ విద్యాసంస్థల చైర్మన్ కేవీబి కృష్ణారావు, ప్రిన్సిపాల్ డైరెక్టర్ డాక్టర్ ఉజ్జిని మంజుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డీఈవో సత్యనారాయణ,ఎస్ జి ఎఫ్ సెక్రటరీ దశరథ్ రెడ్డి, మండల విద్యాధికారి గురువు రావు, మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య,ఆర్డీవో శేఖర్ రెడ్డి , ఎమ్మార్వో మీరాబాయి,వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి,ఆర్ ఐ సుధాకర్,మాజీ మున్సిపల్ చైర్మన్ వెన్ రెడ్డి రాజు,పబ్బు రాజు గౌడ్, మాజీ జెడ్పిటిసి చిలుకూరు ప్రభాకర్ రెడ్డి,మాజీ వైస్ ఎంపీపీ ఉప్పు భద్రయ్య,మాజీ కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులు, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు విద్యార్థినీ విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# గజ్వేల్, సిద్దిపేట, సిరిసిల్ల మాత్రమే అభివృద్ధి

- గతంలో ముఖ్యమంత్రి, మంత్రులను ప్రజలు కలిసే అవకాశం లేదు
- జూబ్లీహిల్స్ అభివృద్ధి కాంగ్రెస్ తోనే సాధ్యం
- మా భూములు మాగంటి గోపీనాథ్ లాక్కునే ప్రయత్నం చేశారు : కమ్మ సామాజిక వర్గ నేతలు



**ఖైరతాబాద్ నవంబర్ 4 (జనం సాక్షి) :** జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉపఎన్నిక సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు మద్దతుగా మంత్రి వాకిటి శ్రీహరి వెంగళరావు నగర్ డివిజన్ కళ్యాణ్‌నగర్ ప్రాంతంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమ్మ సామాజిక వర్గ నాయకులతో భేటీ అయ్యారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గ అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ కు మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ జూబ్లీహిల్స్ అంటే సంపన్న ప్రాంతం అని భావించాం కానీ అందుకు భిన్నంగా ఉంది.బి.ఆర్.ఎస్ హయాంలో కేవలం గజ్వేల్, సిరిసిల్ల, సిద్దిపేట నియోజకవర్గాలు మాత్రమే అభివృద్ధి అయ్యాయని విమర్శించారు. గతంలో ముఖ్యమంత్రులను, మంత్రులను కలిసే అవకాశం ప్రజలకు లేదు కానీ ప్రజా ప్రభుత్వంలో ముఖ్యమంత్రి, మంత్రులు అనునిత్యం ప్రజల్లో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలిస్తే జూబ్లీహిల్స్ అభివృద్ధి పరుగులు పెడుతుందని కాంగ్రెస్ పార్టీతోనే జూబ్లీహిల్స్ అభివృద్ధి సాధ్యమని, వెంగళరావు నగర్ డివిజన్ అభివృద్ధి బాధ్యత నేను, తుమ్మల నాగేశ్వరరావు తీసుకుంటామన్నారు. బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ అభివృద్ధి కోసం ఏం చేసిందో చెప్పకుండా సెంటిమెంట్ రాజకీయాలు చేసే ప్రయత్నం చేస్తుందని, గతంలో అనేక సందర్భాల్లో ఉపఎన్నిక వచ్చినప్పుడు బిఆర్ఎస్ అభ్యర్థిని పెట్టిందన్నారు. ప్రజలు ఈ సారి బి.ఆర్.ఎస్ పార్టీకి కర్రుకాల్చి వాత పెట్టడం ఖాయమని ప్రజల జీవన ప్రమాణాలు పెంచటమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ పని చేస్తుందని, అందుకు నిదర్శనం సన్నబియ్యం,200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఉచిత బస్ లాంటి పథకాలు అమలు అమలు చేస్తుందని ప్రభుత్వ పథకాలు అమలు చేయటమేనన్నారు. కమ్మ సామాజిక వర్గ నాయకులు మాట్లాడుతూ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అధికార దుర్వినియోగం చేస్తూ మాపై అక్రమ కేసులు బనాయించి మా భూములు లాక్కునే ప్రయత్నం చేసారు. కోర్టుకి వెళ్లి మేము మా భూములు సాధించుకున్నాం అని వాపోయారు. ఈ ఎన్నికలో బి.ఆర్.ఎస్ పార్టీకి బుద్ధి చెప్తాం. కాంగ్రెస్ పార్టీకి మా మద్దతు ఉంటుంద న్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మట్ట దయానంద్, సరితమ్మ, రవికాంత్, వెంకటేశ్వర్లు, కిషోర్, రవి తదితరులు పాల్గొన్నారు.

# మంత్రికి జూడాల కృతజ్ఞతలు



హైదరాబాద్ (జనంసాక్షి) : ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహకు తెలంగాణ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ కృతజ్ఞతలు తెలిపింది. అసోసియేషన్ ప్రెసిడెంట్ ఐజాక్, జనరల్ సెక్రటరీ అజయ్ నేతృత్వంలోని జూనియర్ డాక్టర్ల బృందం, మంగళవారం మంత్రిని ఆయన నివాసంలో కలిశారు మెడికల్ పీజీ మేనేజ్‌మెంట్ కోటాలో 85 శాతం సీట్లను తెలంగాణ విద్యార్థులకు కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నదని జూడాలు తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. తమ దశాబ్దకాల ఆకాంక్షను నెరవేర్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహకు ధన్యవాదాలు తెలిపారు. ఈ నిర్ణయంతో స్థానిక డాక్టర్లకు పీజీ సీట్లు పొందే అవకాశాలు పెరుగుతాయని, తద్వారా రాష్ట్రంలో స్పెషలిస్ట్ డాక్టర్ల సంఖ్య పెరుగుతుందని జూడాలు తెలిపారు. రాష్ట్రంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీల బలోపేతానికి, నాణ్యమైన మెడికల్ విద్యను అందించడానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను జూడాలు అభినందించారు. ఇటీవలే ప్రభుత్వ వైద్య కళాశాలల్లో పీజీ సీట్లు పెంచడం, టీచింగ్ ఫాకల్టీ నియామకం, జూనియర్ డాక్టర్లు – సీనియర్ రెసిడెంట్లకు స్టైఫండ్ 15 శాతం పెంచిన విషయాలను జూడాలు గుర్తు చేశారు. ప్రభుత్వం తీసుకున్న చర్యలతో కాలేజీల్లో సౌకర్యాలు పెరిగాయని, దీంతో ఇటీవల జరిగిన అసెస్‌మెంట్‌లో ఒక్క సీటును కూడా నేషనల్ మెడికల్ కమిషన్ తగ్గించలేదని జూడాలు గుర్తు చేశారు. కాలేజీల అభివృద్ధితో పీజీ, యూజీ సీట్లు అదనంగా వచ్చాయని.. దీంతో తమకు అవకాశాలు పెరిగాయని డాక్టర్లు వివరించారు. ప్రభుత్వ హాస్పిటళ్లలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం చేస్తున్న కృషికి తమ వంతు సహకారాన్ని అందిస్తామని జూడాలు తెలిపారు.

# తెలంగాణలో క్రీడా ప్రోత్సాహక విధానాలు

- బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభించిన మంత్రి వాకిటి




హైదరాబాద్, నవంబర్ 4 (జనంసాక్షి) : తెలంగాణ ప్రభుత్వ క్రీడా ప్రోత్సాహక విధానాల వల్లనే పలు జాతీయ, అంతర్జాతీయ క్రీడా పోటీలకు హైదరాబాద్ వేదికగా మారుతోందని రాష్ట్ర క్రీడలు, యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జరిగిన 'తెలంగాణ ఇండియా ఇంటర్నేషనల్ చాలెంజ్ 2025' బ్యాడ్మింటన్ పోటీలను మంత్రి శ్రీహరి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం క్రీడల ప్రోత్సాహక విధానాన్ని అమలు చేస్తోంది. దాని ఫలితంగా హైదరాబాద్ మాత్రమే కాకుండా తెలంగాణలోని పలు జిల్లాల్లో కూడా భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ క్రీడా టోర్నమెంట్లు నిర్వహించే ప్రణాళిక ఉందని తెలిపారు. ౹రాష్ట్ర ప్రభుత్వ క్రీడల సలహాదారు ఏపీ జితేందర్ రెడ్డి మాట్లాడుతూ, హైదరాబాద్ బ్యాడ్మింటన్ క్రీడకు హబ్ లాంటిదే. దేశానికి అనేక బ్యాడ్మింటన్ ఛాంపియన్లను అందించిన ఘనత తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీకి దక్కిందని అన్నారు. స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి మాట్లాడుతూ, ఈ టోర్నమెంట్ విజయవంతంగా సాగేందుకు స్పోర్ట్స్ అథారిటీ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిందని, గత రెండేళ్లలో అనేక మెగా ఈవెంట్లను విజయవంతంగా నిర్వహించిన ఘనత సంస్థకు దక్కిందని తెలిపారు. పద్మభూషణ్ పుల్లెల గోపీచంద్ మాట్లాడుతూ, ఈ టోర్నమెంట్ నిర్వహణలో స్పోర్ట్స్ అథారిటీ అందిస్తున్న సహకారం ప్రశంసనీయమని అన్నారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ అథారిటీ ఎండీ డా. సోని బాలాదేవి, డిప్యూటీ డైరెక్టర్లు చంద్రారెడ్డి, రవీందర్, డా. రవితేజ, అనిత, సుజాత, పద్మావతి, స్పెషల్ ఆఫీసర్ భాష పి ఆర్. ఓ కాలేరు సురేష్ స్టేడియం అడ్మినిస్ట్రేటర్ కన్నం మధు, బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ ప్రతినిధులు యువిఎన్ బాబు, వంశీధర్, లక్ష్మణ్, కె. శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారిపై డ్యాన్స్ మాస్టర్ అసభ్య ప్రవర్తన

- పోలీసులకు ఫిర్యాదుతో పోక్సో చట్టం కింద కేసు

హైదరాబాద్, నవంబర్ 4 (జనంసాక్షి) : నగరంలోని బోయిన్‌పల్లి పీఎస్ పరిధిలో దారుణం చోటు చేసుకుంది. ఓల్డ్ బోయిన్‌పల్లిలో సుబ్బు డాన్స్ స్టూడియో నిర్వాహకుడు జ్ఞానేశ్వర్ నాలుగేళ్ల చిన్నారితో అసభ్యంగా ప్రవర్తించాడు. గత రెండు నెలలుగా తన వద్ద డ్యాన్స్ నేర్చుకునేందుకు వస్తున్న బాలిక పట్ల స్టూడియోలో ఎవరూ లేని సమయంలో అసభ్యంగా ప్రవర్తించాడు. ఈ నేపథ్యంలో కొన్నాళ్లుగా డ్యాన్స్ స్కూల్‌కు వెళ్లనని మారాం చేస్తుండటంతో.. చిన్నారిని తల్లిదండ్రులు ప్రశ్నించగా అసలు విషయం బయటకువచ్చింది. జ్ఞానేశ్వర్.. స్టూడియోలో చిన్నారిపై లైంగిక వేధింపులకు గురి చేయడంతో పాటు అసభ్యంగా ప్రవర్తిస్తున్నట్లు తల్లిదండ్రులకు చెప్పడంతో వెంటనే బోయిన్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి.. నిందితుడిని అరెస్టు చేసినట్లు ఉత్తర మండల డీసీపీ రష్మీ పెరుమాళ్ తెలిపారు. జ్ఞానేశ్వర్‌ను రిమాండ్‌కు తరలించడంతోపాటు స్టూడియోను సీజ్ చేసినట్టు తెలిపారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ.. పాఠశాలలోనే చిన్నారులకు మంచి, చెడు స్పర్శలపై అవగాహన కల్పించాలన్నారు. ఇలాంటి డ్యాన్స్ స్టూడియోలకు పంపే ముందు జాగ్రత్తలు తీసుకోవాలని తల్లిదండ్రులకు సూచించారు.

# రేగా ఉడత బెదిరింపులకు భయపడేది లేదు

- వందకోట్ల బేరంతో దొరికిన అసలు తెలంగాణ ద్రోహి
- పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు విమర్శలు



భద్రాద్రి కొత్తగూడెం, నవంబర్ 4 (జనంసాక్షి) : మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు చేస్తున్న ఉడత ఊపులకు, తాటాకు చప్పుళ్లకు కాంగ్రెస్ నాయకులు గానీ కార్యకర్తలు కానీ భయపడే పరిస్థితులు లేవని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. పార్టీ ఫిరాయింపులో 100 కోట్ల బేరసారాలు ఆడి అడ్డంగా దొరికిన తెలంగాణ ద్రోహి రేగా అని, ఆయనకు ప్రజాస్వామ్యం గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. క్యాంపు కార్యాలయంలో డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్యతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన కాంగ్రెస్ కార్యాలయానికి సంబంధించిన చరిత్రను వివరించారు. స్థలం దానంగా ఇచ్చినప్పటి నుంచి భూమి పూజ, ప్రారంభోత్సవంతో పాటు ఇంటి పన్నుల వివరాలు అందరికీ తెలుసని, వాటి రశీదులు, కరెంటు బిల్లులు, అన్ని ధ్రువపత్రాలు ఉన్నాయని తెలిపారు. 2009లో రెడిమెడ్‌గా వచ్చిన నాయకుడు రేగాకు నియోజకవర్గ దిక్కులు కూడా తెలియవని, నాడు అతడిని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కష్టపడి పార్టీ గెలిపిస్తే బేరసారాలు చేసి పార్టీ ఫిరాయించిన సంగతి అందరికీ తెలుసునన్నారు. ఆయన పార్టీ మారుతూ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల శక్తితో కట్టుకున్న భవనాన్ని కబ్జా చేశాడని ఆరోపించారు. తాను గెలిచిన తర్వాత నాయకులు, కార్యకర్తలు మన ఆఫీసును మనం స్వాధీనం చేసుకుందామని అన్నా.. తాను సముదాయించానన్నారు. కానీ ఆదివారం నాయకులు, కార్యకర్తలు ఆఫీసుకు వెళ్లిన సమయంలో బీఆర్ఎస్ వారు తమ వారిపట్ల వ్యవహరించిన తీరు ఉద్రిక్తతకు కారణమైందన్నారు. రేగా కాంతారావు రెచ్చగొట్టగా.. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు రెచ్చిపోయారని, దాన్ని తమ పార్టీ వారు ప్రతిఘటించారన్నారు. తమ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు చేసిన చర్యను తాను అభినందిస్తున్నానని ఎమ్మెల్యే పాయం తెలిపారు. తన ముఖ్య అనుచరుడు నవీన్‌కు చందా హరికృష్ణ ఆ భవనాన్ని అమ్మాడని, ఇందుకు సంబంధించి పత్రాలు తమ వద్ద ఉన్నాయన్న పాయం వాటిని విలేకరులకు చూపారు. భద్రాచలం మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్య మాట్లాడుతూ.. మణుగూరులో కాంగ్రెస్ పార్టీ భవనాన్ని తిరిగి స్వాధీనం చేసుకోవడం సాహసోపేత నిర్ణయమన్నారు. పార్టీ మారిన రేగా తర్వాత తెలంగాణ భవన్‌గా మార్చాడని, ఆభవనం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల ఆస్తి అని అన్నారు. పినపాక నియోజక వర్గ కాంగ్రెస్ శ్రేణులకుశిరస్సు వంచి నమస్కారాలు తెలియజేసుకుంటున్నానని పొదెం వీరయ్య తెలిపారు. రేగా మాటలు ఆయన విజ్ఞతకే వదిలే స్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో పలువురు నియోజకవర్గ నాయ కులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఓయూ హాస్టల్‌లో కల్తీ ఆహారం

- గోదావరి హాస్టల్ వద్ద విద్యార్థుల ఆందోళన

హైదరాబాద్, నవంబర్4 (జనంసాక్షి) : ఉస్మానియా యూనివర్సిటీలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కల్తీ ఆహారం పెడుతున్నారని ఓయూ విద్యార్థులు నిరసన చేపట్టారు. దీంతో ఓయూలో పోలీసులు భారీగా మోహరించారు. ఉస్మానియా యూనివర్సిటీలోని గోదావరి హాస్టల్ వద్ద విద్యార్థులు నిరసన దిగారు. ఆహారం బాగాలేదని, నాణ్యత పెంచాలని కాంట్రాక్టర్‌కు విద్యార్థులు సూచించారు. కల్తీ ఆహారం తిని అనారోగ్యానికి గురవుతున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్‌కు, ఓయూ అధికారులకు వ్యతిరేకంగా విద్యార్థులు ఓయూ ప్రధాన రహదారిపై భోజనంతో కూడి పాత్రలతో నిరసనకు దిగారు. ఆహారం బాగాలేదని చెప్తే.. ఏం చేసుకుంటారో చేసుకోండి అని కాంట్రాక్టర్ నిర్లక్ష్యపు సమాధానం ఇచ్చారని విద్యార్థులు పేర్కొన్నారు. నాణ్యత లేని కల్తీ ఆహారాన్ని పెడుతున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకొని, నాణ్యమైన ఆహారాన్ని అందిం చాలని విద్యార్థులు డిమాండ్ చేశారు.

# మరోమారు స్వల్పంగా తగ్గిన బంగారం ధరలు

హైదరాబాద్, నవంబర్4 (జనంసాక్షి) : గత కొన్ని రోజులుగా బంగారం ధరల్లో హెచ్చుతగ్గులు కనిపిస్తున్నాయి. సోమవారం స్వల్పంగా పెరిగి రూ.1.23 లక్షల మార్కు దాటిన బంగారం ధర మంగళవారం మళ్లీ దిగొచ్చింది. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో దేశంలో 24 క్యారెట్ 10 గ్రాముల బంగారం ధర రూ.710 మేర తగ్గి రూ.1,22,460కు చేరుకుంది. 22 క్యారెట్ 10 గ్రాముల పసిడి ధరలో రూ.650 మేర కోత పడి రూ..1,12,250కు దిగింది. వెండి ధర ఏకంగా రూ.3 వేల మేర తగ్గింది. ప్రస్తుతం కిలో వెండి రూ.1,51,000గా ఉంది .హైదరాబాద్, విజయవాడల్లో ప్రస్తుతం 24 క్యారెట్ 10 గ్రాముల బంగారం ధర రూ.1,22,460గా ఉంది. 22 క్యారెట్ ఆర్నమెంటల్ బంగారం ధర రూ.1,12,250గా ఉంది. రెండు నగరాల్లో వెండి రేట్ కిలోకు రూ.1,65,000 వద్ద కొనసాగుతోంది. మదపర్లు ప్రాఫిట్ బుకింగ్‌కు దిగడం, ఫెడ్ వడ్డీ రేట్ల కోతపై నానాటికీ సన్నగిల్లుతున్న ఆశలు, మళ్లీ పుంజుకున్న డాలర్ వెరసి బంగారం ధరలను తగ్గిస్తున్నాయని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు.

# శ్రీశైలం ఘాట్‌రోడ్డులో విరిగిపడ్డ కొండచరియలు



శ్రీశైలం, నవంబర్ 4 (జనంసాక్షి) : ప్రముఖ శైవక్షేత్రం శ్రీశైలంలో మరోసారి భారీ వర్షాలు కురియడంతో భక్తులు ఇబ్బంది పడ్డారు.. శ్రీశైలం రాకపోకలు సాగించే భక్తులు అప్రమత్తంగా ఉండాల్సిన సమయం వచ్చింది.. శ్రీశైలం–హైదరాబాద్ ఘాట్ రోడ్డులో భారీ స్థాయిలో కొండచరియలు విరిగిపడ్డాయి.. మంగళవారం ఉదయం నుంచి శ్రీశైలంలో భారీ వర్షం కురుస్తోంది.. ఈ వర్షానికి శ్రీశైలం –హైదరాబాద్ ఘాట్‌రోడ్డులోని డ్డయమ్, స్విచ్ యార్డ్ సమీపంలో ఒక్కసారిగా పెద్ద పెద్ద కొండ చరియలు, బండరాళ్లు, చెట్లు విరిగి రోడ్డుపై అడ్డుగా పడిపోయాయి.. దీంతో ప్రయాణికులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు.. అయితే, కొండచరియలు, బండరాళ్లు, చెట్లు విరిగినపడిన ప్రాంతంలో.. ఆ సమయంలో వాహనాలు ఏమి లేకపోవడంతో.. పెను ప్రమాదం తప్పినట్టు అయ్యింది.. కొండచరియలు విరిగినపడిన సమయంలో.. ఆ ప్రాంతంలో కారు, బస్సు, లారీలు ఏదైనా ఉంటే భారీ నష్టం జరిగి ఉండేదని.. ప్రాణనష్టం కూడా జరిగి ఉండేదని.. ఆ సమయంలో అక్కడ ఏ వాహనం, భక్తులు ఎవరూ లేకపోడంతో.. అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.. వర్షం కురిసే సమయంలో ఘాట్ రోడ్డులో వచ్చే భక్తులు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు అధికారులు..

# జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ ఓటమి ఖాయం

- రెండేళ్లలో కాంగ్రెస్ పాలనలో తెలంగాణ విధ్వంసం
- రేవంత్ నోటి దురుసుతో కెసిఆర్‌పై అభాండాలు
- మండిపడ్డ మాజీమంత్రి నిరంజన్ రెడ్డి




హైదరాబాద్, నవంబర్ 4 (జనంసాక్షి) : జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఓటమి ఖాయమని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత నిరంజన్ రెడ్డి జోస్యం చెప్పారు. సమైక్య పాలనలో తెలంగాణ రెండు తరాలు నష్టపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక కాంగ్రెస్ ప్రభుత్వంపై రెండేళ్లకే ఆశలన్నీ పటాపంచలయ్యా యన్నారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డికి.. నీటి విలువ, నోటి విలువ తెలియదన్నారు. ఆయనకు జూబ్లీహిల్స్ ఓటమి భయం పట్టుకుందని విమర్శించారు. జూబ్లీహిల్స్‌లో ఉప ఎన్నికల కోసం ప్రచారం చేస్తోన్నది సీఎం రేవంత్ రెడ్డి మాత్రమేనని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌పై ఇష్టమెచ్చినట్లు మాట్లాడటమే సీఎం రేవంత్ రెడ్డికి తెలుసునని మండిపడ్డారు. తమ పార్టీ అధినేత కేసీఆర్‌పై కోపంతో మెత్తం వ్యవస్థను నాశనం చేస్తున్నారంటూ రేవంత్ రెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నీళ్ల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి నల్గొండ తప్ప ఏమీ తెలియదని ఎద్దేవా చేశారు. పాలమూరు అల్లుడు ఉత్తమ్ కుమార్ రెడ్డి.. ఆ జిల్లాలోని ప్రాజెక్టును పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. 2014 ముందు వరకు ఎస్ఎల్బీసీని కాంగ్రెస్, టీడీపీలు ఎందుకు పూర్తి చేయ లేదని ఆ యా పార్టీల నేతలను మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి ప్రశ్నించారు. ఎస్ఎల్బీసీ విషయంలో అవాస్తవాలు చెప్తుందంటూ కాంగ్రెస్ సర్కార్‌పై మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి నిప్పులు చెరిగారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ మరణంతో జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక అనివార్యమైంది. ఈ ఉప ఎన్నిక నవంబర్ 11వ తేదీన జరగనుంది. బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీల మధ్య ప్రధాన పోరు జరగనుంది. ఈ మూడు పార్టీలు తమ తమ అభ్యర్థులను బరిలోకి దింపాయి. ఈ ఎన్నికల్లో ప్రచార జోరు ఉపందుకొంది. ఆ పార్టీల అగ్రనేతలు సైతం రంగంలోకి దిగి.. తమ అభ్యర్థిని గెలిపించాలంటూ ఓటర్లకు సూచిస్తున్నారు. ఈ సందర్భంగా కీలక హామీలు గుప్పిస్తున్నారు. ఈ ఉప ఎన్నిక ఫలితం నవంబర్ 14వ తేదీన వెలువడనుంది.

# గ్రామీణ రహదారులకు మహర్దశ

- సాస్కి నిధులతో రోడ్ల పునర్నిర్మాణం
- తోణమే పంచాయితీరాజ్ రోడ్ల పునరుద్ధరణ
- నాణ్యతా ప్రమాణాలతో నిర్మాణాలు జరగాలి
- అధికారులను ఆదేశించిన డిప్యూటి సిఎం పవన్



హైదరాబాద్, నవంబర్ 4 (జనంసాక్షి) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గ్రామీణ రహదారుల పరిస్థితిని మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం పెద్దఎత్తున నిధులు కేటాయించింది.. సాస్కి.. పథకం కింద ఆంధ్రప్రదేశ్‌కు రూ.2వేల కోట్లు మంజూరు చేశారు.. ఈ నిధులను వినియోగించి గ్రామాల్లో దెబ్బతిన్న పంచాయతీరాజ్ రోడ్లను పునర్నిర్మిం చాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఈ విషయాన్ని డిప్యూటీ సీఎం, పంచాయతీరాజ్ , గ్రామీణాభి వృద్ధి శాఖల మంత్రి పవన్ కళ్యాణ్ వెల్లడించారు. రహదారుల నిర్మాణంలో నాణ్యత విషయంలో రాజీ ఉండదు అని స్పష్టం చేశారు..రహదారుల నిర్మాణ పనులు చేపడుతున్న కాంట్రాక్టర్లు, ఇంజినీరింగ్ అధికారులు ప్రమాణాలకు అనుగుణంగా పని చేయాలని ఆదేశించారు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్.. నిర్మాణం ప్రారంభమైన తర్వాత పలు దశల్లో క్వాలిటీ చెక్ తప్పనిసరి.. ప్రమాణాలకు విరుద్ధంగా పనులు జరిగినా, అవకతవకలు నమోదైనా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే, పుట్టపర్తిలో జరిగే శ్రీ సత్య సాయిబాబా శత జయంతి ఉత్సవాల నేపథ్యంలో అక్కడి పంచాయతీరాజ్ రహదారుల అభివృద్ధికి రూ.35 కోట్లు కేటాయించినట్టు చెప్పారు. కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడి సహకారం, రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మార్గదర్శకత్వంతో ప్రతి గ్రామానికీ పటిష్టమైన, బలమైన రహదారులు అందించడమే లక్ష్యమని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు.. సాస్కి'పథకం ద్వారా నిధులను సద్వినియోగం చేసుకోవాలని పవన్ కళ్యాణ్ సూచించారు. ప్రజలకు 'సాస్కి' నిధుల ఫలాలు అందించాలని సూచించారు. ఈ సందర్భంగా పంచాయతీరాజ్, ఇంజినీరింగ్ శాఖల అధికారులకి పవన్ కళ్యాణ్ దిశానిర్దేశర చేశారు.గ్రామీణ ప్రాంతాల్లోని రహదారులకు రూ.2 వేల కోట్ల నిధులను కేంద్ర ప్రభుత్వం సమకూర్చిందని స్పష్టం చేశారు పవన్ కళ్యాణ్. సాస్కి నిధులతో నిర్మించే రోడ్లలో ఎక్కడ నాణ్యతా ప్రమాణాలు తగ్గకూడదని ఆదేశించారు. నాణ్యతా ప్రమాణాల విషయంలో బాధ్యత అధికార యంత్రాంగానిదేనని ఆజ్ఞాపించారు. రోడ్ల నిర్మాణ దశ నుంచి పూర్తయ్యే వరకూ అధికారులు పరిశీలించాలని హుకుం జారీ చేశారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ సహకారంతో, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మార్గదర్శకంలో మరో ముందడుగు వేశామని పవన్ కళ్యాణ్ ఉద్ఘాటించారు. ఏపీలోని గ్రామాల్లో రహదారుల స్థితిగతులను మార్చి నూతన రోడ్లు నిర్మించడానికి కేంద్రప్రభుత్వం 'సాస్కి' పథకం ద్వారా ఆంధ్రప్రదేశ్‌కు రూ. 2 వేల కోట్లు నిధులు సమకూర్చిందని వ్యాఖ్యానించారు.

# బెంగాల్లో సర్‌కు వ్యతిరేకంగా మమత గళం

- కోల్‌కతా వీధుల్లో భారీ ర్యాలీ నిర్వహణ
- ఎన్నికల సంఘం తీరుపై ఆగ్రహం



కోల్‌కతా, నవంబర్ 4 (జనంసాక్షి) : బీజేపీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వంపై పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మంగళవారంనాడు విరుచుకుపడ్డారు. ప్రస్తుతం జరుగుతున్న ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ బెంగాలీ మాట్లాడే పౌరులను లక్ష్యంగా చేసుకుని చేపట్టిన 'నిశ్శబ్ద రిగ్గింగ్' అని ఆరోపించారు. ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా మంగళవారనాడు కోల్‌కతా వీధుల్లో భారీ ర్యాలీని మమత ముందుండి నడిపించారు. ఆమె మేనల్లుడు, టీఎంసీ జాతీయ ప్రధాన కార్యదర్శి, పార్లమెంటు సభ్యుడు అభిషేక్ బెనర్జీ కూడా ఈ ర్యాలీలో పాల్గొన్నారు. ఎలక్షన్ కమిషన్ టైమ్‌లైన్ పెట్టుకుని మరీ ఇంత హడావిడిగా ఎస్ఐఆర్ నిర్వహించడాన్ని మమతా బెనర్జీ తప్పుపట్టారు. బెంగాల్‌లో 2022లో ఓటర్ రివిజన్ జరిగిందని, అందుకు రెండేళ్లు పట్టిందని అన్నారు. ఇప్పుడు ఎస్ఐఆర్ ప్రక్రియ నెలరోజుల్లోనే పూర్తిచేయాలనుకుంటున్నారని అన్నారు. ఈసీ పారదర్శకత్వను ప్రశ్నిస్తూ... బిహార్ ఎస్ఐఆర్‌లో ఎంతమంది రోహింగ్యాలు, బంగ్లాదేశీయులను గుర్తించారో చెప్పాలన్నారు. పశ్చిమబెంగాల్ ఎన్నికల జాబితా నుంచి అర్హులైన ఒక్క ఓటరును తొలగించినా బీజేపీ ప్రభుత్వ పతనాన్ని తమ పార్టీ చూస్తుందని మమత హెచ్చరించారు. రాజకీయ ప్రయోజనాల కోసం ఎన్నికల కమిషన్‌తో కేంద్రం కుమ్మక్కై ఎస్ఐఆర్ ప్రక్రియను ఒక ఉపకరణంగా వాడుకుంటోందని విమర్శించారు. హిందీ, పంజాబీ మాట్లాడే వాళ్లు ఎలా పాకిస్థానీయులు కాదో బంగ్లా మాట్లాడే వాళ్లు బంగ్లాదేశీయులు కాదని మమత అన్నారు. ఎస్ఐఆర్ పేరుతో ఓటర్లను బీజేపీ భయపెట్టే ప్రయత్నం చేస్తోందని, ఈ భయాలతోనే ఇప్పటికే ఏడుగురు ప్రాణాలు తీసుకున్నారని టీఎంసీ ఎంపీ అభిషేక్ బెనర్జీ అన్నారు. లీగల్ ఓటర్లను ఎన్నికల జాబితా నుంచి తొలగిస్తే ఢిల్లీలో మెగా నిరసనకు మద్దతుదారులంతా సిద్ధంతా ఉండాలని కోరారు. కాగా, టీఎంసీ నిరసనలపై బీజేపీ మండిపడింది. రాజ్యాంగానికి వ్యతిరేకంగా చేపట్టిన ర్యాలీ ఇదని ఆక్షేపణ తెలిపింది. అక్రమ వలసదారులను తమ ఓటు బ్యాంకుగా చేసుకున్న మమతా బెనర్జీ ఇప్పుడు వారికి రక్షణ కల్పిస్తున్నారని బీజేపీ ప్రతినిధి అమిత్ మాలవీయ ఆరోపించారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370